
VOICE OF TELUGU PEOPLE
FOR THE STATE # OF THE STATE # BY THE STATE

నమస్తే ఆంధ్ర.కామ్

NAMASTEANDHRA.COM
VOL 18 ★ ISSUE 9 ★ MAR 2025



# సమర్థుడికీ, అసమర్థుడికీ తేడా!

ఐదేళ్ల విధ్వంసం తర్వాత
క్రమంగా గాడినపడుతున్న నవ్యాంధ్ర
పోలవరం నిర్మాణం చకచకా
అమరావతిని కాదన్న సంస్థ నుంచే వేల కోట్లు
ఆగిపోయిన రైల్వేజోన్ పరుగులు
ప్రైవేటీకరణ భయంలో ఉన్న
విశాఖ స్టీల్‌కు భారీ ప్యాకేజీ

16 & 17



5

## రవాణా హబ్‌గా అమరావతి!

ఔటర్ రింగు రోడ్డుకు రాజముద్ర
కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల

## చట్టంతో చెలగాటం



24



## కేసీఆర్‌కు బాబు భయం

తెలంగాణలోకి కూటమి
వస్తుందన్న ప్రచారంతోనేనా?

11



## 'తాడేపల్లి' ముందు ఢిల్లీ స్కాం దిగదిడుపే!

లిక్కర్ తయారీ నుంచి ఆర్డర్ల వరకు
అంతా మాఫియా తీరులోనే!!
చిన్న ఉద్యోగి నుంచి
ఎండీ దాకా పాత్రధారులే

20



14

## విశాఖ భూస్కాం భూంఫట్!

అటకెక్కిన విచారణ.. అక్రమాలకు సమాధి?
అసలు అక్రమాలే లేవంటూ తొలి నివేదిక


ASBL
LANDMARK
THE GREAT
UPGRADE
6.6 Sprawling Acres
G+19 & 20 Floors
3, 3.5, 4 BHKs
CLUBHOUSE
to House is your NEW and improved LIFESTYLE
Designed to give you more amenities per flat, with 35+ Amenities to cater to your every want. Including - Temple and Cultural Workshop, Party Halls and a Panchatantra Kids play area and many more...
0
ZERO BURDEN OFFER!
Where we reimburse your monthly Home Loan interest!
₹2.4 Cr
ONWARDS
Scan this QR to enjoy the great upgrade!
asbl.in/landmark
080 452 48944

# రాజధానిలో దళారులు!



- *గుంటూరుకు చెందిన ఒక ఇంజనీర్ రాజధానిలోని వెంకటపాలెం గ్రామానికి చెందిన ఒక అసైన్డ్ రైతు వద్ద ప్రభుత్వం ఇచ్చిన 110 గజాల రిటర్నబుల్ ప్లాటు కొన్నాడు. గజం రూ.38 వేల చొప్పున రైతుకు చెల్లించాడు. మర్నాడే గజం రూ. 55 వేలకు బేరం పెట్టి హాయిగా అమ్మేసుకున్నాడు.*
- *కురగల్లులో మరో అసైన్డ్ రైతు తనకు ప్రభుత్వం ఇచ్చిన ప్లాటును బేరం పెట్టాడు. అక్కడ గజం ధర రూ.50 వేలు పలుకుతుండగా.. ఆ రైతును దళారులు రూ.30 వేలకే అడుగుతున్నారు. అదేమంటే.. అది అసైన్డ్ ప్లాటు అంటూ దగా చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన అన్ని రిటర్నబుల్ ప్లాట్లదీ ఒకే స్వభావం అయినప్పటికీ ఏదో ఒక కొర్రీ పెట్టి దారుణంగా రేటు కోసేస్తున్నారు.*

## కారు చౌకగా రైతుల ప్లాట్లు కాజేసేందుకు కుట్ర
## జగన్ పెట్టిన సీఐడీ కేసులు పోయినా..
## అసైన్డ్ రైతులకు తప్పని తిప్పలు
## వారి స్థలాలే లక్ష్యంగా భారీ మోసాలు
## వాటికి ధర రాదంటూ దుష్ప్రచారం
### ఒక్కో గజానికి రూ. 10 వేల నుంచి 20 వేల వరకు తగ్గింపు

చంద్రబాబు మళ్లీ నవ్యాంధ్ర సీఎం అయ్యాక రాజధాని రైతుల రిటర్నబుల్ ప్లాట్లకు విపరీతంగా డిమాండ్ పెరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచీ వాటిని కొనేందుకు అధికార, అనధికార, రాజకీయ ప్రముఖులు ఆసక్తి చూపుతున్నారు. రాజధాని నిర్మాణానిక కేంద్రం బాసటగా నిలవడం.. రాష్ట్ర రుణాలతో సంబంధం లేకుండా కేంద్రమే హామీ ఉండడం.. ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) మాత్రమే కాకుండా కేంద్ర ప్రభుత్వ సంస్థ హడ్కో కూడా రుణాలు ఇచ్చేందుకు అంగీకరించి ఒప్పందాలు చేసుకోవడం వంటి పరిణామాలు దీనికి కారణం. రాజధాని గ్రామాలకు ఆవల కొనేవాళ్లు కొనేస్తున్నారు. ఇదే సమయంలో రైతుల ఆర్థిక అవసరాలను గమనించిన అధికార వర్గాలు రిటర్నబుల్ ప్లాట్లపై కన్నేశాయి. నేరుగా కొంటే ఎక్కువకు అడుగుతారని దళారులను రంగంలోకి దించుతున్నారు. దీంతో వారు రెచ్చిపోతున్నారు. ప్రస్తుతం రాజధాని గ్రామాల్లో దళారీ గద్దలు రాజ్యమేలుతున్నాయి. కొర్రీలు పెట్టి రైతుల ప్లాట్ల ధరలు కోసేసి కారు చౌకగా కొట్టేస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం అసైన్డ్ రైతులపై సీఐడీ పెట్టిన తప్పుడు కేసులను దళారులు బ్రహ్మాస్త్రాల్లా వాడుకొని వారిని లూటీ చేస్తున్నారు. అసైన్డ్ రైతుల భూములను ప్రధానంగా టార్గెట్ చేసుకుని వాటి ధరలు తగ్గించి, వాటిని చూపి సాధారణ రైతుల ప్లాట్ల ధరలు కూడా తగ్గించి కాజేసేందుకు కుట్రలు పన్నుతున్నారు. అందరూ కుమ్మక్కై ఒకటే రేటు చెబుతున్నారు. ఉదాహరణకు.. గజం రూ.40 వేలు ఉందనుకుంటే రూ.30 వేలకు మించి పెట్టడం లేదు. బేరం కుదిరాక కొనుగోలుదారులకు మాత్రం రూ.35–40 వేలకు అమ్ముతున్నారు. రైతుకు 30 వేలిచ్చి.. మిగతా మొత్తం జేబులో వేసుకుంటున్న బాపతే ఎక్కువగా ఉన్నారు.

### ఐదేళ్ల వేధింపులు.. ఇప్పుడు తప్పుడు ప్రచారం..!

రాజధాని నిర్మాణం కోసం ప్రభుత్వం భూసమీకరణ పద్ధతిలో రైతుల నుంచి భూములు సేకరించింది. 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాల భూములను ఇచ్చారు. వారిలో 29 గ్రామాలకు చెందిన 3,139 మంది అసైన్డ్ రైతులు 2,689.14 ఎకరాలిచ్చారు. వారి భూములపై సీఐడీ కేసులు వేసి గత ప్రభుత్వం వారి స్థలాలను నాట్ ట్యాలీడ్ జాబితాలో పెట్టి ఐదేళ్లపాటు వేధింపులకు గురిచేసింది. తాజాగా చంద్రబాబు ప్రభుత్వం ఆ భూములను అసైన్డ్ చెర నుంచి తప్పించి సర్వహక్కులూ కల్పించింది. సాధారణ రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్ల మాదిరిగానే వీటిపై కూడా అన్ని హక్కులూ ఇచ్చింది. అయినప్పటికీ దళారులు అసైన్డ్ రైతులను మోసం చేస్తున్నారు. సీఆర్‌డీఏ ఒప్పందం ప్రకారం రైతులకు ఇచ్చిన ప్లాట్లను ప్రభుత్వం చట్టపరంగా రిజిస్టర్ చేసి వారికి అందిస్తోంది. అలా ఇచ్చే క్రమంలో రైతులు ప్రభుత్వానికి ఇచ్చిన భూమి స్వభావం అనే కాలమ్ వద్ద 'అసైన్డ్' అని నమోదు చేస్తోంది. ఈ పదాన్ని అడ్డం పెట్టుకుని దళారులు రైతులను మోసం చేస్తున్నారు. రిటర్నబుల్ ప్లాట్లకు 'అసైన్డ్' స్వభావం ఉంటుందని చెప్పి, వాటికి ఎలాంటి హక్కులూ సంక్రమించవని, బ్యాంకుల నుంచి రుణాలు రావని బెదిరిస్తూ రేట్లు తెగగోస్తున్నారు.

### వెంటాడుతున్న కేసుల శాపం..

జగన్ ప్రభుత్వం సీఐడీ విచారణ పేరుతో చేసిన నిర్వాకమే అసైన్డ్ రైతుల పాలిట శాపంగా మారింది. విచారణ పేరుతో వారి పొలాలను నాట్ ట్యాలీడ్ జాబితాలో పెట్టింది. దీనిని ఆసరా చేసుకుని ఆ ఐదేళ్ల కాలంలో గజం రూ.35 వేలు ఉన్న స్థలాలను కూడా రూ. 10, 12వేలకు దళారులు కొల్లగొట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అదే పద్ధతిలో రైతులను దోపిడీ చేయాలని చూస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం రాగానే న్యాయస్థానం ద్వారానే వారిపై సీఐడీ కేసులు ఎత్తివేసింది. నాట్ ట్యాలీడ్ జాబితా నుంచి అసైన్డ్ పొలాలకు కూడా విముక్తి కల్పించింది. అయినా అమాయకులైన అసైన్డ్ రైతులను కేసుల బూచితో దళారులు దగా చేస్తున్నారు. అంతేకాదు.. మళ్లీ జగనే సీఎంగా వస్తారని.. ఐదేళ్ల తర్వాత ప్రభుత్వం మారితే సమస్యలు తప్పవని.. అసైన్డ్ రైతుల రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు ఎప్పటికైనా ఇబ్బంది తప్పదని, వాటి రిజిస్ట్రేషన్లు చెల్లవని ఊరూవాడా ప్రచారం చేస్తున్నారు. ఏడేళ్ల పాటు కౌళ్లు తీసుకున్నారని, ఆ తర్వాత ఆగిపోవడమే గాక.. ప్లాట్లు నాట్ ట్యాలీడ్ జాబితాలో పడిపోయాయని.. ఐదేళ్ల తర్వాత జగన్ తిరిగి వస్తే మళ్లీ అలాంటి సమస్యలే ఎదుర్కోవలసి వస్తుందంటూ రైతుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారు. ప్లాట్ల ధరలను తగ్గిస్తున్నారు. కొందరు అధికారులు కూడా వారితో అంటకాగుతున్నారు. మంచి మంచి ఏరియాల్లో ఉన్న ప్లాట్లపై కన్నేసినవారు.. దళారుల ద్వారానే వాటిని సొంతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కురగల్లు, వెంకటపాలెంలో ఎక్కువ రిటర్నబుల్ ప్లాట్లను వారే సొంతం చేసుకున్నారని తెలుస్తోంది.

### సీఆర్‌డీఏ స్పందించకుంటే నష్టమే..

చాలా రాజధాని గ్రామాల్లో ప్రస్తుతం గజం స్థలం ధర రూ.50 నుంచి 70 వేల వరకూ పలుకుతోంది. కురగల్లు, నీరుకొండ, కృష్ణాయపాలెం, మందడం ప్రాంతాల్లో రూ.50 వేలు ఉండగా.. విట్, ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయాల సమీపంలో, కోర్ క్యాపిటల్ ప్రాంతంలో రూ.70 వేల వరకు ఉంది. దళారులు తప్పుడు ప్రచారాలతో వాటిని రూ.40 వేలు, 50 వేలకే కాజేస్తున్న ఉదంతాలు అనేకం కనిపిస్తున్నాయి. ఒకే లే అవుట్, సర్వే నంబరులో ప్లాట్లు వచ్చిన సాధారణ, అసైన్డ్ రైతుల ప్లాట్ల ధరల్లో రూ.10–20 వేలు తేడా కనిపిస్తోంది. ఇలా తొలుత అసైన్డ్ రైతుల ప్లాట్ల ధరలు తగ్గించి, ఆ ధరను ఆసరా చేసుకుని సాధారణ రైతుల ప్లాట్ల ధరలను కూడా తగ్గించేందుకు అక్రమార్కులు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఆర్‌డీఏ రంగంలోకి దిగి స్పష్టమైన ప్రకటన చేయాలని.. దళారుల ఆగడాలను ప్రభుత్వమే అడ్డుకుని తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. రిటర్నబుల్ ప్లాట్లపై సీఆర్‌డీఏ స్పష్టమైన ప్రకటన చేస్తే గందరగోళాలు తొలగిపోతాయని, అప్పుడే దళారుల బారి నుంచి రైతులను కాపాడడం సాధ్యమవుతుందని రైతు నేతలు భావిస్తున్నారు.



నమస్తే ఆంధ్ర.కామ్
VOICE OF TELUGU PEOPLE
NAMASTEANDHRA.COM
FOR THE STATE # OF THE STATE # BY THE STATE
MAR 2025



## చంద్రబాబు నాయుడు గోత్ర నామాలతో
# యజ్ఞ యాగాది హోమం
### - బుచ్చి రాంప్రసాద్!

గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా విజయవాడ శ్రీ కనకదుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయంతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాల్లో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు గోత్ర నామాలతో యజ్ఞ యాగాది హోమములను వేద ఆశీ ర్వచనములతో  నిర్వహించడం జరిగింది. వీటిలో భాగంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షులు బుచ్చి రాంప్రసాద్, విజయవాడ ఇంద్రకీలాద్రి పై కనకదుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో చండీ హోమం జరిపించి స్వామి అమ్మవార్ల ఆశీర్వాదాలు చంద్రబాబు నాయుడుకి ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.

# 91 ఏళ్ల వయసులో పీహెచ్‌డీ చేసిన డాక్టర్ నూకల సూర్యనారాయణ!







### కృషి ఉంటే మనుషులు రుషులవుతారు.. మహా పురుషులవుతారు..

..అనే అన్న ఎన్టీఆర్ పాట చాలా పాపులర్. చదువుపై ఆసక్తి.. చదవాలి అనే పట్టుదల ఉంటే వయసుతో సంబంధం లేదని నిరూపించిన వారెందరో ఉన్నారు.  అమెరికాలో గతంలో నివసించిన ప్రవాసాంధ్రుడు డాక్టర్ నూకల సూర్యనారాయణ(ధనం) కూడా ఈ కోవలోకే వస్తారు. తొమ్మిది పదుల వయసులో వియత్నాం యూనివర్సిటీ నుంచి ఆయన పీహెచ్‌డీ పట్టా పొంది ఔరా అనిపించారు. వియత్నాం నేషనల్ యూనివర్సిటీ నుండి 91 ఏళ్ల వయసులో డాక్టర్ ఆఫ్ లిటరేచర్ ఇన్ ఫిలాసఫీ చేసిన సూర్యనారాయణ ఎందరికో స్ఫూర్తిదాయకం. 1954లో గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత, పెట్రోలియం రిఫైనింగ్ ఇండస్ట్రీలోకి నూకల సూర్యనారాయణ అడుగుపెట్టారు. 4 దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో ఆయన ఫిలిప్పీన్స్, దక్షిణ కొరియా, బహ్రెయిన్, కువైట్, ఒమన్ దేశాలలో పని చేశారు. ఆపరేషన్స్ మేనేజర్, వైస్ ప్రెసిడెంట్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వంటి హోదాలలో సమర్థవంతంగా పని చేశారు. కెరీర్ నుంచి రిటైర్ అయిన తర్వాత 77 సంవత్సరాల వయసులో ఫిలాసఫీ సబ్జెక్ట్‌లో చేరిన సూర్యనారాయణ 2011 నాటికి మాస్టర్స్ పూర్తి చేశారు. “మానవ విలువలు, సంబంధాలు” అనే అంశంపై తత్వశాస్త్రంలో పరిశోధనను సూర్యనారాయణ కొనసాగించారు. 2015లో 81 సంవత్సరాల వయసులో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి పీహెచ్‌డీ పొందారు. ఈ పరిశోధనలో మానవ విలువల యొక్క ప్రధాన భావనను గుర్తించారు. ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక మరియు సమకాలీన కాలాలను ఈ అధ్యయనంలో తెలుసుకున్నారు. మానవ విలువ వ్యవస్థలకు సంబంధించి తత్వవేత్తల భావజాలాన్ని గుర్తించారు. 2023లో పీహెచ్‌డీ చేసేందుకు వియత్నాం నేషనల్ యూనివర్సిటీని సూర్యనారాయణ సంప్రదించారు. డి.లిట్ అవార్డు కోసం పరిశోధన చేయడానికి యూనివర్సిటీ సూర్యనారాయణను అనుమతించింది. “నిర్ణయ వాదం మరియు స్వేచ్ఛా సంకల్పం: ఒక తాత్విక సమీక్ష” అనే అంశంపై పీహెచ్‌డీ చేశారు. నమ్మకాలు, నమ్మకాలు మరియు విభిన్న అభిప్రాయాలు, సామాజిక మరియు నైతిక బాధ్యతలు.. ఈ భావనకు సంబంధించిన తత్వవేత్తల మధ్య వాదనలు, ప్రతివాదాలను వివరంగా పరిశీలించారు. వేదాంత దృక్పథాలు, వివిధ మత విశ్వాసాలు ఈ వాదాన్ని ఎలా పరిష్కరించాయో లోతైన పరిశోధన చేశారు. సూర్యనారాయణ పరిశోధనకు కొన్ని కేస్ స్టడీస్ ఉపకరించాయి. కాగా.. ఈ వయసులో పీహెచ్‌డీ చేయడం సంతోషంగా, ఛాలెంజింగ్‌గా ఉందని నూకల సూర్యనారాయణ అన్నారు. కెరీర్ పరంగా, పీహెచ్‌డీలు, పరిశోధనల పరంగా ఇప్పటివరకు సాధించిన విజయాలతో సంతృప్తిగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు. దేవుడు తనకు ఆరోగ్యాన్ని ప్రసాదించాడని, తన శేష జీవితాన్ని దక్షిణ భారతదేశంలో ఓ సీనియర్ సిటిజెన్ కమ్యూనిటీలో సంతోషంగా గడుపుతున్నానని చెప్పారు.

# రవాణా హబ్‌గా అమరావతి!

189.9 కిలోమీటర్ల అలైన్‌మెంట్‌కు ఓకే

ఐదు జిల్లాల పరిధిలోని 23 మండలాలు..

121 గ్రామాల మీదుగా సాగనున్న నిర్మాణం


అమరావతికి ప్రత్యేక రైల్వే లైను

కృష్ణా నదిలో జలరవాణా వైపు మొగ్గు

నదీతీరంలో మూడు కార్గో టెర్మినల్స్

మరో నాలుగు చోట్ల టూరిజం టెర్మినల్స్

రాజధాని పనులకు రవాణా ఖర్చు తగ్గించడానికే



రాజధాని అమరావతిని రవాణా హబ్‌గా తీర్చిదిద్దే దిశగా చంద్రబాబు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రోడ్డు, రైలు, జలమార్గాల్లో రవాణా పెద్దఎత్తున జరిగేలా నిర్ణయాలు తీసుకుంటోంది. వీటిలో అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నిర్మాణం కీలకమైనది. రాజధానిని అనేక జాతీయ రహదారులతో అనుసంధానం చేసే ఓఆర్ఆర్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింది. రాజధాని ప్రాంత పరిధితోపాటు బయటి ప్రాంతాలను కూడా కలిపి.. ఎన్టీఆర్, ఏలూరు, కృష్ణా, గుంటూరు, పల్నాడు.. మొత్తం ఐదు జిల్లాల పరిధిలో 189.9 కిలోమీటర్ల నిడివిలో భూసేకరణకు గెజిట్‌నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఓఆర్ఆర్ అలైన్‌మెంట్‌కు కేంద్ర ఉపరితల రవాణా శాఖ అప్రూవల్ కమిటీ ఇటీవలే ఆమోదముద్ర వేసింది. ఈ నేపథ్యంలో కేంద్రం భూ సేకరణకు వీలుగా గెజిట్ నోటిఫికేషన్ వెలువరించింది. దాని ప్రకారం త్వరలోనే జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు తమ డివిజన్ల ప్రాతిపదికన భూసేకరణ నోటిఫికేషన్ల జారీకి ఐదు జిల్లాల యంత్రాంగాలను నిర్దేశించనుంది. కృష్ణా జిల్లాలో 4 మండలాల పరిధిలో 24 గ్రామాలు, ఏలూరు జిల్లాలో ఒక మండలం పరిధిలో 11 గ్రామాలు, కృష్ణాజిల్లాలో 5 మండలాల పరిధిలో 28 గ్రామాలు, గుంటూరు జిల్లాలో 11 మండలాల పరిధిలో 46 గ్రామాలు, పల్నాడు జిల్లాలో రెండు మండలాల పరిధిలో 12 గ్రామాల మీదుగా ఓఆర్ఆర్ అలైన్‌మెంట్ వెళ్తోంది. ఔటర్‌తో రాష్ట్ర ప్రగతి పరుగులు పెట్టనుంది. అమరావతికి దేశంలోని అనేక జాతీయ రహదారులు అనుసంధానమవుతాయి. పలు ఆర్థిక కారిడార్ల రహదారులు అనుసంధానం కావడంతో భవిష్యత్తులో రాజధాని భివృద్ధికి దోహదపడనుంది. ఓఆర్ఆర్‌లో కృష్ణానదిపై 2 వంతెనలు, 34 చోట్ల హై ఓల్టేజీ క్రాసింగ్ ్స, 3 సొరంగాలు, ఏడు ఆర్వోబీలు, 78 అండర్‌పాస్‌లు, 51 చిన్న వంతెనలు, 14 పెద్ద వంతెనలు, 9 ఇంటర్ చేంజ్‌లు వస్తాయి. గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా ఆరు వరుసల యాక్సెస్ కంట్రోల్ హైవేను నిర్మిస్తారు. భవిష్యత్తులో దీనిని 8 వరుసలకు విస్తరిస్తారు. ప్రస్తుతం రోడ్డ వెడల్పు 70 మీటర్లుగా ఉంటుంది.

**కొత్త రైల్వే లైన్..**

రాజధాని అమరావతికి కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి భూసేకరణ ఊపందుకుంది. ఖమ్మం జిల్లా యెర్రుపాలెం నుంచి రాజధాని మీదుగా గుంటూరు జిల్లా నంబూరు వరకు 57 కిలోమీటర్ల మార్గమిది. రూ.2,245 కోట్ల వ్యయంతో చేపడుతున్నారు. అవసరమైన భూమిలో 80 శాతం సీఆర్‌డీఏ అధీనంలో ఇప్పటికే ఉంది. రైలు మార్గం ఎలైన్‌మెంట్ ఖరారుకాగానే దానిని అప్పగిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మిగతా 60 ఎకరాలను ఖమ్మం జిల్లాలో సేకరించేందుకు నోటిఫికేషన్లు విడుదలయ్యాయి కూడా. రైలు మార్గం నిర్మాణాన్ని నాలుగేళ్లలో పూర్తిచేస్తామని రైల్వే శాఖ ప్రకటించింది. అయితే వీలైనంత త్వరగా పూర్తిచేయాలని సీఎం చంద్రబాబు ప్రధాని మోదీని అభ్యర్థించారు. దీంతో ముందస్తు పనులు జోరందుకున్నాయి. కృష్ణా నదిపై 3.2 కిలోమీటర్ల పొడవున భారీ వంతెన నిర్మాణం చేపట్టనున్నారు. దీనిద్వారా హైదరాబాద్, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు నగరాలతో నిరంతరాయంగా రవాణా సంధానత ఏర్పడుతుంది. అలాగే ముంబై, ఢిల్లీలకూ రైల్వే లైన్లను విస్తరించవచ్చు. ఇక



అమరావతిలో నూతనంగా నిర్మించే రైల్వే స్టేషన్‌ను మోడల్ స్టేషన్‌గా తీర్చిదిద్దాలని రాష్ట్రప్రభుత్వం రైల్వే శాఖను కోరింది. ఇందుకోసం 1,500 ఎకరాలను కేటాయిస్తామని ప్రతిపాదించింది.

**జలరవాణాకు మార్గం సుగమం..**

అంతర్గత జలరవాణా మార్గాలను అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు సంకల్పించారు. బకింగ్‌హాం కెనాల్, విజయవాడ–నాగార్జునసాగర్–శ్రీశైలం మార్గాలను ఇందుకు సిద్ధంచేయాలని భావిస్తున్నారు. కృష్ణా నది రాజధానిలోనే ప్రవహిస్తుండడంతో.. నిర్మాణ పనులకు జలమార్గాన్ని వాడుకోవాలని నిర్ణయించారు. సిమెంటు, ఇసుక, ఇనుము, కంకర, ఫ్లైయాష్ వంటి అనేక రకాలైన ముడిసరుకులను తక్కువ ఖర్చుతో రాజధాని ప్రాంతానికి తరలించడానికి జలరవాణా చాలా అనుకూలమైందని ప్రభుత్వం అంచనా వేసింది. క్రమంలో ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) గతంలో కృష్ణానదిలో చేపట్టిన అంతర్గత జలరవాణా–4 తాలూకు కార్యాచరణను వినియోగించుకోవాలని భావిస్తుంది. రోడ్డు రవాణా ఖర్చులతో పోల్చుకుంటే జలరవాణాకయ్యే ఖర్చు సగంలో సగం మాత్రమే ఉంటుంది. ఎలాగంటే.. టన్ను బరువున్న సరుకును కిలోమీటరు దూరం పాటు రోడ్డు రవాణా చేసేందుకు రూ.2.50.. రైల్లో రూ 1.36 ఖర్చవుతుంది. అదే జలరవాణాలో అయితే రూ.1.06 మాత్రమే అవుతుంది. దీంతో కేంద్ర ప్రభుత్వం కూడా జలరవాణాకు ప్రాధాన్యమిచ్చి సాగరమాల పేరుతో దేశవ్యాప్తంగా జలరవాణా మార్గాలను అభివృద్ధి చేస్తోంది. ప్రస్తుతం ఏపీ రాజధాని అమరావతి నిర్మాణ పనులు మరికొద్ది రోజుల్లోనే ఊపందుకోనుంది. ఈ నేపథ్యంలో నిర్మాణ సామగ్రి, ఇతరత్రా ముడి సరుకులను రాజధానికి సులభంగా, చౌకగా తరలించడమెలాగన్న చర్చ మొదలైంది. ఇక్కడి నిర్మాణ పనులకు అవసరమైన సిమెంటు, ఇటుక, కంకర వంటి మెటీరియల్ అంతా ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట సమీపంలోని ముక్త్యాల పరిసర ప్రాంతాలనుంచే రావాలి. ముక్త్యాల–అమరావతి మధ్య ఉన్న కృష్ణానదీ మార్గం ద్వారా జలరవాణా చేయడం అత్యుత్తమం. దూరం తగ్గడంతోపాటు రవాణా ఖర్చు కూడా గణనీయంగా తగ్గిపోతుంది. జల రవాణా కోసం కార్గో వెస్సెల్స్‌ను వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

**ఆచరణలో..**

వాస్తవానికి ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరిలకు వర్తింపజేస్తూ కేంద్ర ప్రభుత్వం 2008 నవంబరులోనే జాతీయ జలరవాణా–4ని ప్రకటించింది. అప్పట్లో భద్రాచలం నుంచి రాజమండ్రి వరకు గోదావరి నదిలో 171 కిలోమీటర్లు, రాజమండ్రి నుంచి విజయవాడ వరకు ఏలూరు కాలువలో 139 కిలోమీటర్లు, కాకినాడ నుంచి రాజమండ్రి వరకు కాకినాడ కాలువలో 50 కిలోమీటర్లు, విజయవాడ నుంచి పెదగంజాం వరకు కొమ్మమూరు కాలువలో 113 కిలోమీటర్లు, పెదగంజాం నుంచి చెన్నై వరకు ఉత్తర బకింగ్‌హ్యాం కాలువలో 316 కిలోమీటర్లు, చెన్నై నుంచి మరక్కాణం వరకు దక్షిణ బకింగ్‌హాం కాలువలో 110 కిలోమీటర్లు.. నల్గొండ జిల్లా వజీరాబాద్ నుంచి విజయవాడ వరకు కృష్ణానదిలో 157 కిలోమీటర్ల వంతున మొత్తం 1078 కిలోమీటర్ల మేర జలరవాణా మార్గాన్ని అభివృద్ధి చేయాలని నాడు ప్రతిపాదించింది. 2016లో దీనిని సవరించారు. కృష్ణానదిలో వజీరాబాద్ నుంచి కర్ణాటక రాష్ట్రం గలగలి వరకు మరో 628 కిలోమీటర్లు, భద్రాచలం నుంచి మహారాష్ట్రలోని నాసిక్ వరకు గోదావరి నదిలో 1,184 కిలోమీటర్ల వరకు విస్తరించడం ద్వారా జాతీయ జలరవాణా–4ని మొత్తం 2,890 కిలోమీటర్లకు పెంచింది. ఈ పథకం ఆచరణ విషయానికొస్తే.. 2016లో మాత్రం తొలిదశ కింద ముక్త్యాల నుంచి విజయవాడ వరకు కృష్ణానదిలో 82 కిలోమీటర్ల వరకు జలరవాణా మార్గాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.96 కోట్లను మంజూరు చేశారు. ఇందులో ప్రధానంగా కార్గో ఓడలు లేదా క్రూయిజ్‌లు ప్రయాణించేందుకు వీలుగా నదీమార్గంలో సుమారు యాభై మీటర్ల నిడివిలో రెండేసి మీటర్ల లోతున పూడికతీత పనులను చేపట్టాలి. ఇందుకోసం మొదటగా ముక్త్యాల నుంచి గుంటూరు జిల్లా అచ్చంపేట మండలం చామర్రు వరకు 29 కిలోమీటర్ల పొడవున డ్రెడ్జింగ్ చేసేందుకు రూ 33.85 కోట్ల వ్యయంతో, చామర్రు నుంచి గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం హరిశ్చంద్రాపురం వరకు 37 కిలోమీటర్ల పొడవున డ్రెడ్జింగ్ చేసేందుకు మరో రూ.35.91 కోట్ల వ్యయంతో 2016 ఏప్రిల్లో టెండర్లను ఆహ్వానించారు. ఈ టెండర్ల ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభించేందుకు ఏడాదిన్నర పట్టింది. 2017 అక్టోబరు 3న ఈ పనులకు శ్రీకారం చుట్టారు. 2019 జూన్ నాటికి డ్రెడ్జింగ్ పనులు పూర్తి కావలసి ఉండగా.. అనుకోకుండా నది అంతర్భాగంలో కొన్నిచోట్ల గట్టి రాయి తగలడం, కొందరు ఈ డ్రెడ్జింగ్ పనులపై జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జీటీ)లో కేసులు వేయడంతో పనులకు అంతరాయం కలిగింది. డ్రెడ్జింగ్ పనులు 70శాతం వరకు పూర్తయినా మిగిలినవి ముందడుగు పడలేదు. పైగా డ్రెడ్జింగ్ తీసిన ప్రాంతాల్లో తరచూగా నిర్వహణ కూడా చేయాలి. కానీ ఐడబ్ల్యూఏఐ కూడా పట్టించుకోలేదు. పైగా గత ఏడాది కృష్ణా నదికి 11.5లక్షల క్యూసెక్కుల మేర భారీ వరద వచ్చిపడింది. దీంతో చేసిన డ్రెడ్జింగ్ తాలూకు లీడ్స్ మళ్లీ ఇసుకమేటలతో నిండిపోయి ఉంటాయి. అమరావతి నిర్మాణ పనుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియాతో సమన్వయం చేసుకుని కార్గో వెస్సెల్స్ ముక్త్యాల–హరిశ్చంద్రాపురం మధ్య నడిచేలా నదీ జలమార్గాన్ని అభివృద్ధి చేస్తే రవాణా ఖర్చులను గణనీయంగా తగ్గించుకునే వెసులుబాటు కలుగుతుంది. ఇది సానుకూలపడితే ముక్త్యాల, ఇబ్రహీంపట్నం, హరిశ్చంద్రాపురం ప్రాంతాల్లో మరో మూడు కార్గో టెర్మినల్స్‌ను కూడా ఏర్పాటుచేయాలని ఐడబ్ల్యూఏఐ నిర్ణయించింది. ముక్త్యాల వద్ద 8.57 ఎకరాలు, ఇబ్రహీంపట్నం (ఫెర్రీ) వద్ద 3.63 ఎకరాలు, హరిశ్చంద్రాపురం వద్ద 3.80 ఎకరాలు టెర్మినల్స్ ఏర్పాటు నిమిత్తం అవసరమవుతాయని రాష్ట్రప్రభుత్వానికి నివేదించింది. భూసేకరణకు అయ్యే ఖర్చును కూడా సంబంధిత అధికారుల వద్ద డిపాజిట్ చేసింది. తాజాగా ఈ భూములను రాష్ట్ర ప్రభుత్వం సేకరించి ఐడబ్ల్యూఏఐకి స్వాధీనం చేసింది. త్వరలోనే ఈ మూడు ప్రాంతాల్లో కార్గో టెర్మినల్స్ నిర్మాణపనులు మొదలుకున్నాయి. ఈ టెర్మినల్స్ సరుకు ఎగుమతులు, దిగుమతులకు ఉపకరిస్తాయి.

# రేవంతా.. జరజాగ్రత్త!

**ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు ప్రమాద ఘంటికలే!!**
**కాంగ్రెస్ నేతల్లో కొరవడిన సమన్వయం**
**అధికారం దక్కగానే వర్గపోరు**
**ఉత్తర తెలంగాణలో పుంజుకున్న బీజేపీ**
**పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలు కైవసం**
**ఇదే సమయంలో నల్లగొండలో ఓటమి**
**సోదిలో కూడా లేని బీఆర్ఎస్**
**కమలానికి ప్రచ్ఛన్న సాయం**
**ఆంధ్రలో టీడీపీ కూటమి హవా**
**జగన్ మద్దతు తీసుకుని దెబ్బతిన్న లెఫ్ట్**



అసాధ్యాన్ని సుసాధ్యం చేసి.. సొంత కష్టంతో కేసీఆర్‌ను మట్టి కరిపించి కాంగ్రెస్‌ను అనూహ్యంగా అధికారంలోకి తీసుకొచ్చిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనూహ్య పరాజయం ఎదురైంది. ఒకప్పుడు బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న ఉత్తర తెలంగాణలోనే రేవంత్ దానిని ఓడించి సీఎం అయ్యారు. ఇప్పుడా ప్రాంతంలో విద్యావంతులు, టీచర్లు బీజేపీ వైపు మొగ్గుచూపడం.. ఆయనకు మింగుడుపడడం లేదు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. సీఎం రేసులో ఉన్న కాంగ్రెస్ నేతలందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి.. పార్టీని విజయపథాన నడిపిన ఆయన.. మండలి ఎన్నికల్లో మాత్రం స్థానిక నేతలు, మంత్రుల మధ్య సమన్వయం సాధించలేకపోయారు. బీఆర్ఎస్, బీజేపీ ఆరోపణలు, విమర్శలను రేవంత్ మాత్రమే తిప్పికొడుతుండగా.. మిగతా కాంగ్రెస్ నేతలు చోద్యం చూస్తున్నారు. ఇదంతా ముఖ్యమంత్రే చూసుకోవాలి.. తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో రేవంత్ దాదాపు ఒంటరి పోరాటం చేస్తున్నట్లు కనిపిస్తోంది. నిత్యం ముఠాల కుమ్ములాటలతో రచ్చకెక్కే కాంగ్రెస్ నేతలకు.. అధికారం వచ్చాక మళ్లీ ఆ జాఢ్యం అంటుకుంది. ఫలితంగానే నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ, కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ టీచర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో పరాజయం పాలైంది. నల్లగొండ టీచర్ స్థానంలో ఉపాధ్యాయ సంఘం పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి.. సమీప యూడీఎఫ్ ప్రత్యర్థి, సిటింగ్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డిపై గెలిచారు. టీపీఆర్‌టీయూ (కాంగ్రెస్), బీసీ సంఘాలు బలపరచిన పూల రవీందర్ మూడు, నాలుగు స్థానాల్లో నిలువగా.. బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తంరెడ్డి 2,280 ఓట్లతో ఐదో స్థానానికి పరిమితమయ్యారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు పరస్పరం తలపడుతున్నందున.. తాము ఎంత ప్రయత్నించినా గెలిచేది లేదన్న భావనతో బీజేపీ సీనియర్ నేతలు ప్రచారానికి రాలేదు. ఆ పార్టీ అభ్యర్థి సొంతంగా ప్రచారం చేసుకున్నారు. ఇక కరీంనగర్ పట్టభద్రులు, టీచర్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంది. ఆ పార్టీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి రెండో ప్రాధాన్యఓట్లతో విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డిపై 5,106 ఓట్ల ఆధిక్యం పొందారు. సిటింగ్ స్థానాన్ని కోల్పోవడం కాంగ్రెస్‌కు షాకే. గత ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ఇక్కడ పటిష్ఠంగా ఉంది. అయినా కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి ఘనవిజయం సాధించారు. ఈ సారి ఆయన పోటీకి దూరంగా ఉన్నారు. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డిని బరిలోకి దింపింది. కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడిన ప్రసన్న హరికృష్ణ బీఎస్పీ అభ్యర్థిగా పోటీలో నిలిచారు. ఆయనకు బీఆర్ఎస్ పరోక్షంగా మద్దతిచ్చింది. మొదటి నుంచీ గెలుపుపై ధీమాతో ఉన్న కాంగ్రెసకు ఊహించని షాక్ తగిలింది. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఆ పార్టీకి 21 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు ఉన్నారు. మిత్రపక్షంగా సీపీఐ మద్దతు కూడా ప్రకటించింది. అయినా కాంగ్రెస్ తన సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోలేకపోయింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ప్రచారం చేసినా ప్రయోజనం లేకుండాపోయింది. ఇదే నియోజకవర్గ పరిధిలో ఏడుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలను కలిగి ఉన్న బీజేపీ.. అందరికంటే ముందుగానే అభ్యర్థిని ప్రకటించినా ఆలస్యంగా ప్రచారంలోకి దిగింది. అయినా అనూహ్యంగా పోటీ ఇచ్చి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంతోపాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని కూడా కైవసం చేసుకుని ఈ ప్రాంతంలో తనపట్టును మరింత పెంచుకుంది. బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో అభ్యర్థిని నిలపకపోయినా కాంగ్రెస్‌ను ఓడించేందుకు పరోక్షంగా బీజేపీ, బీఎస్పీలకు మద్దతిచ్చింది.





### భవిష్యత్ అధికారంపై బీజేపీలో ఆశలు!

ఎమ్మెల్సీ ఎన్నికల విజయంతో బీజేపీ శ్రేణులు సంబరాల్లో మునిగాయి. బలమైన ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థిని సునాయాసంగా ఓడించి.. పట్టభద్రుల నియోజకవర్గంలో అధికార పార్టీ అభ్యర్థితో జరిగిన హోరాహోరీ పోరులో విజయబావుటా ఎగురవేయడం సామాన్య విషయం కాదు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నేతృత్వంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్‌తో పాటు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేల సమష్టి కృషితోనే ఈ గెలుపు సాధ్యమైంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పీఠమే లక్ష్యంగా పెట్టుకున్న తమకు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు కొత్త జోష్ ఇస్తున్నాయని కమలనాథులు భావిస్తున్నారు. ఉత్తర తెలంగాణలోని 42 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగ్గా.. తమ అభ్యర్థులు మొదటి స్థానంలో నిలిచారని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమదే అధికారమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా ఉత్తర తెలంగాణలో మరింత బలపడ్డామని బీజేపీ జాతీయ నాయకత్వం భావిస్తోంది. ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు ఈ ప్రాంతంలో పార్టీకి పెద్దదిక్కుగా ఉండగా.. ఇప్పుడు ఇద్దరు ఎమ్మెల్సీలు కూడా గెలవడంతో పార్టీ ఇటు పట్టభద్రులు, అటు ఉపాధ్యాయ వర్గాల్లో పట్టు సాధించినట్లయింది.

### చేతులు కాలాక..

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపై రేవంత్‌రెడ్డి మార్చి 6న జరిగిన మంత్రి మండలి సమావేశంలో చర్చించారు. ఓటమికి కారణాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. సమన్వయ లోపంతోనే ఓడిపోయామని తేల్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గెలుచుకున్న ఎమ్మెల్సీ స్థానాన్ని.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక నిలుపుకోలేకపోవడాన్ని అధిష్ఠానం కూడా తీవ్రంగా పరిగణించింది. ఈ నేపథ్యంలో.. స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి పార్టీని బలోపేతం చేయాలని.. క్షేత్ర స్థాయిలో మరింత బలపడాలని నిర్ణయించారు. ఇకపై జిల్లాలవారీగా కూడా రాజకీయ పరిస్థితులు, పరిణామాలపై సమావేశాలు, సమీక్షలు నిర్వహించి, నివేదికలు తీసుకోవాలనే నిశ్చయానికి వచ్చారు. అలాగే.. ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టాలని రేవంత్ స్పష్టం చేశారు. దానికి అనుగుణంగా అసెంబ్లీ సమావేశాల్లో, బయట మంత్రులు, ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌పై విరుచుకుపడుతున్నారు. ఆ పార్టీ బీజేపీతో రహస్య పొత్తు పెట్టుకుందన్న అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ నేతలపై ఉన్న కేసులను బూచిగా చూపెట్టి బీజేపీ భయపెట్టిందని, రహస్య ఒప్పందంతోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిందని విమర్శిస్తున్నారు. అయితే ఓట్లేసినవారంతా విద్యావంతులు, టీచర్లు. ఏడాదిన్నర కిందట జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో వారే కాంగ్రెస్‌ను గెలిపిచారు. ఇప్పుడు ఎందుకు బీజేపీ వైపు మొగ్గుచూపుతున్నారనేది క్షేత్ర స్థాయిలో విశ్లేషించుకుని ముందడుగు వేయకపోతే.. రేవంత్‌కే కాదు.. కాంగ్రెస్‌కూ కష్టాలు తప్పవు.



### కూటమికి వెయ్యేనుగుల బలం

నవ్యాంధ్రలో కూడా ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ, ఉభయగోదావరి, కృష్ణా-గుంటూరు పట్టభద్ర ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. కూటమి అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారు. ఇక్కడ వైసీపీ ప్రత్యక్షంగా పోటీచేయకున్నా.. సీపీఎం ఆధ్వర్యంలోని

యూడీఎఫ్ అభ్యర్థులకు మద్దతిచ్చింది. ముఖ్యంగా కృష్ణా-గుంటూరు స్థానంలో ఏకంగా యూడీఎఫ్ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తరపున వైసీపీ నేతలు పోలింగ్ ఏజెంట్లుగా కూడా కూర్చున్నారు. అయినా ప్రజలు 8 నెలల కిందట ఇచ్చిన తీర్పును పునరావృతం చేశారు. దీంతో రాష్ట్రాన్ని గాడినపెట్టేందుకు చెమటోడుస్తున్న సీఎం చంద్రబాబుకు వెయ్యేనుగుల బలం చేకూరినట్లయింది. రెండు పట్టభద్రుల స్థానాల్లో టీడీపీ అభ్యర్థులకు ఏకంగా 65 శాతం ఓట్లు రావడం ప్రజల్లో చంద్రబాబుపై విశ్వాసానికి నిదర్శనమని చెప్పవచ్చు. వైసీపీ స్వయంగా పోటీ చేసినా ఫలితాల్లో తేడా ఉండేది కాదని.. మహా అయితే కూటమికి లభించిన ఓట్ల శాతం కొంత తగ్గేదేమోనని ఆ పార్టీ నేతలే అంటున్నారు. కృష్ణా-గుంటూరు పట్టభద్రుల స్థానంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ అఖండ విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఓట్ల లెక్కింపులో తొలి రౌండ్ నుంచి ఆఖరి రౌండ్ వరకు అంతకంతకూ మెజారిటీ సాధిస్తూ వచ్చారు. 83,320 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఓడిన లక్ష్మణరావు 62,737 ఓట్లు మాత్రమే సాధించారు. ఉభయగోదావరి పట్టభద్రుల స్థానంలో టీడీపీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు హోరాహోరీ ప్రచారం సాగించారు. కానీ పట్టభద్ర ఓటర్లు ఏకపక్షంగా కూటమి పక్షానే నిలిచి భారీ విజయం అందించారు. రాజశేఖరం 77,461 ఓట్ల ఆధిక్యంతో విజయం పొందారు. ఈ పట్టభద్రుల నియోజకవర్గంలో టీడీపీ గెలుపొందడం ఇదే మొదటిసారి. 2013 నుంచి ఇప్పటి వరకు పీడీఎఫ్ అభ్యర్థులే 2013 నుంచి వరుసగా గెలుపొందుతూ వచ్చారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు విజయం సాధించారు. ఇక్కడ టీడీపీ కూటమి పోటీచేయలేదు. ఈ నియోజకవర్గంలో విచిత్రం ఏమిటంటే.. గాదె, ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ ఇద్దరూ కూటమి మద్దతుతోనే బరిలోకి దిగారు. ప్రథమ ప్రాధాన్య ఓటును గాదెకు, ద్వితీయ ప్రాధాన్య ఓటును రఘువర్మకు వేయాలని చంద్రబాబు పిలుపిచ్చారు. అయితే గాదె విజయంతో కూటమికి ఘోరపరాజయం ఎదురైందని, 8 నెలలకు ప్రజల్లో వ్యతిరేకత తీవ్రంగా ఉందని జగన్ అండ్ కో ప్రచారం చేసుకున్నారు. అయితే తాను కూటమి మద్దతుతోనే గెలిచానని గాదె ప్రకటించడంతో నోరెత్తలేదు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాలక కూటమి రిగ్గింగ్ చేసి గెలిచిందని జగన్ కొత్త పల్లవి అందుకున్నారు. ఈవీఎంలలో లోపాలున్నాయని.. బ్యాలెట్ పోరే పెట్టాలని ఇటీవల తెగ మాట్లాడుతున్న ఈయన.. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్లతోనే జరిగిన విషయాన్ని దాచిపెట్టి రిగ్గింగ్ ఆరోపణలు చేస్తున్నారు. చంద్రబాబు కూడా 2019లో ఓడిపోయాక తాను మారతానని ప్రకటించి టీడీపీ కార్యకర్తల్లో భరోసా నింపే ప్రయత్నం చేశారు. అసలు తాను ఓడిన విషయాన్నే అంగీకరించడానికి జగన్ సిద్ధంగా లేరు. అలాంటి వ్యక్తి తనను తాను సంస్కరించుకకునే ప్రయత్నం చేస్తారని ఆశించడం భ్రమే. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై ఆ మధ్య అనవసరంగా నోరు పారేసుకున్నారు. ఆయన కార్పొరేటర్‌కు ఎక్కువ-ఎమ్మెల్యేకు తక్కువ అని కించపరిచారు. పవన్‌ను అవమానించడం అంటే కూటమి ఐక్యతను పటిష్ఠం చేయడమే అన్న చిన్న లాజిక్ కూడా ఆయనకు తెలియకపోతే ఎవరేం చేయగలరు?



# ఏమిటీ శల్యసారథ్యం!

## కూటమిని ఉంచరా.. తమ్ముడిని దించేస్తారా?
## పిఠాపురం వర్మపై నాగబాబు అనవసర వ్యాఖ్యలు
## ప్రజారాజ్యం ఉన్నప్పుడూ ఇంతే
## బీసీల్లో చిరంజీవిపై వ్యతిరేకత తెచ్చిన వైనం
## ఇప్పుడు టీడీపీకి పవన్‌ను దూరం చేసే యత్నం

టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి శాశ్వతంగా కొనసాగాలని సీఎం చంద్రబాబు పదే పదే అంటున్నారు.. కనీసం 15 ఏళ్లు కలిసిసాగాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెబుతున్నారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు, నేతలు క్షేత్ర స్థాయిలో సంతోషంగానే ఉన్నారు. కలిసి సాగుతున్నారు. కానీ పవన్ చిన్నన్నయ్య నాగేంద్రబాబు మాత్రం కూటమి మైత్రికి గండి కట్టాలని కంకణం కట్టుకున్నట్లు కనబడుతోంది. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన్ను ఇటీవలే ఎమ్మెల్సీ చేశారు. త్వరలో మంత్రి కూడా అయ్యేందుకు కర్చీఫ్ వేసుకుకూర్చుని ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో పిఠాపురం అసెంబ్లీ స్థానాన్ని పవన్ కోసం త్యాగం చేసిన ఎస్వీఎస్ఎన్ వర్మ గురించి నాగబాబు అనుచిత వ్యాఖ్యలు చేశారు. 'పిఠాపురంలో పవన్‌కు అఖండ విజయం రావడానికి రెండు ముఖ్య కారణాల్లో ఒకటి పవన కల్యాణే. రెండోది పిఠాపురం నియోజకవర్గ ప్రజలు, ఓటర్లు మాత్రమే. వీరిద్దరూ లేకపోతే మేం ఎంత చేసినా ఉపయోగం లేదు. అయితే మాలో ఇంకా ఎవరైనా సరే.. పవన్ విజయానికి మేమే దోహదపడ్డామని అనుకుంటే అది వారి ఖర్మ. ఇంకేం చేయలేం' అని వ్యాఖ్యానించారు. పిఠాపురంలో పోటీచేస్తానని పవన్ ప్రకటించిన తర్వాత తనను, మరికొందరిని ఆ నియోజకవర్గానికి వెళ్లి పనిచేయాలని సూచించారని.. కానీ ఆయన విజయం ముందే ఖాయమని అక్కడకు వెళ్లి పని మొదలుపెట్టిన తర్వాత తనకు అర్థమైందన్నారు. అక్కడకు వెళ్లి పనిచేస్తున్నట్లు ఉండడం తప్ప, కొత్తగా చేయాల్సింది ఏమీ లేదని నాగబాబుకు అర్థమైందట! ఇంత దురహంకారం.. విశ్వాస ద్రోహం మరొకటి ఉంటుందా? అసలు పోటీ ప్రకటించేనాటికి పిఠాపురం నియోజకవర్గ సరిహద్దులే పవన్‌కు తెలియవు. చంద్రబాబు నచ్చజెప్పడంతో ప్రచారం ఆసాంతం వర్మ జనసేనాని వెంటే ఉన్నారు. పవన్ ఇతర నియోజకవర్గాల్లో ప్రచారానికి వెళ్లినప్పుడు.. టీడీపీ, జనసేన కార్యకర్తలను సమన్వయపరచి బూత్ స్థాయి వరకు బలోపేతం చేశారు. పోలింగ్ రోజు ఓటర్లను బూత్‌ల వద్దకు తీసుకురావడానికి కృషిచేశారు. ఇంత చేసిన ఆయనపై కనీస విశ్వాసం లేకుండా నాగబాబు మాట్లాడడం టీడీపీ వర్గాలను ఆగ్రహానికి గురిచేస్తోంది. వాస్తవానికి ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల్లో వర్మకు ఇవ్వడం ఖాయమని పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే ఆయన్ను మండలికి పంపితే పిఠాపురంలో మరో అధికార కేంద్రంగా మారతారని.. ఇవ్వొద్దని చంద్రబాబుపై జనసేన నేతలు ఒత్తిడి తెచ్చారని ఆరోపణలు ఉన్నాయి. వీటిని జనసేన పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ ఖండించినా.. నాగబాబు వ్యాఖ్యలు చూశాక తెరవెనుక కచ్చితంగా ఏదో జరిగిందని టీడీపీ వర్గాలు అనుమానిస్తున్నాయి. ఇదంతా చూశాక.. నాగబాబు శల్యసారథ్యంపై జనసేన నేతలు చెవులు కొరుక్కుంటున్నారు. అసలాయనకు తమ్ముడి అభ్యున్నతి ఇష్టం లేనట్లుగా ఉందని.. ఉపముఖ్యమంత్రి పదవి నుంచి దించేసి.. జనసేనను, టీడీపీని విడగొట్టాలని చూస్తున్నట్లుగా ఉందని అంటున్నారు.

### నాడు ఎమ్మెల్సీ కోసం..

అది ప్రజారాజ్యం పార్టీ ఏర్పాటుకు మెగా స్టార్ చిరంజీవి సన్నాహాలు చేసుకుంటున్న సమయం. మిత్రా, ఆంజనేయరెడ్డి ప్రభృతులతో కలిసి పార్టీ నిర్మాణం ఎలా ఉండాలి.. సిద్ధాంతాలు ఎలా ఉండాలి.. నేతల నడవడిక ఎలా ఉండాలనే అంశాలపై తరచూ సమావేశాలు నిర్వహించేవారు. పార్టీ పెట్టడం దాదాపు ఖాయమని తేలాక.. నాగబాబు ఆకస్మికంగా నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని కలిశారు. శాసనమండలికి తనను నామినేట్ చేయాలని కోరారు. వైఎస్ ఆశ్చర్యపోయారు. ఈ విషయం చిరంజీవికి చెప్పారా అని కూడా అడిగారు. కుటుంబంలో విభేదాలు తెచ్చే పనిచేయకూడదని కొందరు సన్నిహితులు కూడా నాగబాబుకు హితవు పలికారు. ఇప్పుడు కూడా ఎమ్మెల్సీ పదవి కోసం పవన్‌పై కుటుంబ సభ్యుల ద్వారా ఆయన ఒత్తిడి తెచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి.

### చిరంజీవిని దెబ్బతీశారిలా..

మెగాస్టార్ కులాలకు వ్యతిరేకం. కాపు వర్గీయులు ఆయనంటే ఎంత ఇష్టపడతారో.. మిగతా సామాజిక వర్గాలూ ఆయన్ను అమితంగా అభిమానిస్తాయి. ప్రజారాజ్యం నిర్మాణ సమయంలో చిరంజీవి కులాలకు అతీతంగా సమావేశాలు పెట్టేవారు. ఇతర కులాలకు చెందినవారికి మాట్లాడే అవకాశమిచ్చేవారు. దీనిని మీడియా బాగా హైలైట్ చేసేది. ప్రజల్లో చిరంజీవి పట్ల సానుకూలత పెరగడానికి ఇది దోహదపడింది కూడా. అయితే ఆ వెంటనే నాగబాబు రంగంలోకి దిగేవారు. గోదావరో, విశాఖో వెళ్లి కాపు సంఘాలతో అంతర్గతంగా సమావేశమయ్యేవారు. పార్టీలో కాపులకే ప్రాధాన్యం ఉంటుందని, రాజకీయ ఎదుగుదల కోసమే బీసీలను దువ్వుతున్నామని చెప్పేవారు. అందరినీ కలుపుకొని వెళ్తేనే ప్రజారాజ్యం విజయం సాధిస్తుందని నమ్మే కాపు నేతలు ఆయన తీరుకు ఆశ్చర్యపోయేవారు. ఈ రెండు నాల్కల ధోరణి వల్లే చిరంజీవిని గోదావరిలో కాపులు, ఇతర కులాలవారు కూడా నమ్మలేదని అంటారు. 2009 ఎన్నికల్లో పాలకొల్లు అసెంబ్లీ స్థానంలో ఓడిపోవడమే దీనికి ఉదాహరణగా కొందరు చెబుతుంటారు. ఆ ఎన్నికల్లో చిరంజీవి తిరుపతి నుంచి కూడా బరిలోకి దిగి గెలిచిన సంగతి తెలిసిందే. నిజంగా పవన్ వల్లే పిఠాపురంలో గెలిచారనుకుందాం. మరి 2019లో భీమవరం, గాజువాకలో ఎందుకు ఓడిపోయారు? జనసేన నుంచి నరసాపురం లోక్‌సభ అభ్యర్థిగా పోటీచేసిన నాగబాబు ఎందుకు గెలువలేదు? ప్రజల ఆలోచనలను ఎందుకు కనిపెట్టలేకపోయారు? సొంత బలంతో అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదనే కదా.. పవన్ మొన్నటి ఎన్నికల్లో టీడీపీతో పొత్తు పెట్టుకున్నారు! చంద్రబాబు కూడా జనసేనతో కలిసి వెళ్తే వైసీపీని సునాయాసంగా ఓడించవచ్చని భావించారు. మధ్యలో బీజేపీ కూడా చేరడంతో కూటమి సూపర్ హిట్ అయింది. ఐదేళ్లు పాలించిన జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. అభివృద్ధి ఆనవాళ్లే లేకుండా చేశారు. పెట్టుబడిదారులను, పరిశ్రమలను తరిమేశారు. వారందరినీ మళ్లీ తీసుకురావడానికి చంద్రబాబు అహోరాత్రాలు శ్రమపడుతున్నారు. పవన్, కేంద్రంలో ప్రధాని మోదీ ఇందుకు పూర్తిగా సహకరిస్తున్నారు. కూటమి మరింత ఐక్యంగా ఉండేందుకు ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో నాగబాబుతో పాటు బీజేపీకి కూడా ఒకటిచ్చారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం చంద్రబాబుకున్న 16 మంది లోక్‌సభ సభ్యుల బలంపైనే ఆధారపడి ఉంది. అయినా ఆయన గొంతెమ్మ కోరికలు కోరడం లేదు. రాష్ట్రానికి విభజన చట్టం ద్వారా రావలసినవి మాత్రమే కోరుతున్నారు. ధ్వంసమైన రాష్ట్రాన్ని ఆర్థికంగా నిలబెట్టాలని అడుగుతున్నారు. దీనికి పవన్ కూడా మద్దతిస్తున్నారు. కానీ నాగబాబు కూటమి విచ్ఛిన్నం కోరుతున్నారని టీడీపీ నేతలు ఆక్షేపిస్తున్నారు. జనసేన వల్లే టీడీపీ గెలిచిందన్నది ఎంత నిజమో.. అభ్యర్థులే లేని జనసేన కూడా టీడీపీ వల్లే 100 శాతం స్ట్రయిక్ రేట్‌తో 21 స్థానాల్లో పోటీచేసి మొత్తం గెలిచిందని గుర్తుచేస్తున్నారు. పవన్‌కు ఉన్న క్రేజ్‌తో ఈసారి ఒంటరిగా పోటీచేసినా గెలిచేస్తామని, ఆ దిశగా అడుగులు వేయాలని నాగబాబు అండ్ కో భావిస్తున్నట్లు కనబడుతోంది. మరి చిరంజీవికి అంత క్రేజ్ ఉన్నా సొంతంగా ఎందుకు అధికారంలోకి రాలేకపోయారో ఒక్కసారి విశ్లేషించుకోవాలని రాజకీయ విశ్లేషకులు కూడా సూచిస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత ఓట్లను ప్రజారాజ్యం చీల్చడం వల్లే 2009లో కాంగ్రెస్ రెండోసారి అధికారంలోకి వచ్చిందని గుర్తుచేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ అలాంటి తప్పు చేస్తే.. జగన్ అరాచకపాలన మళ్లీ వచ్చే ముప్పు పొంచి ఉందని హెచ్చరిస్తున్నారు.

నమస్తే ఆంధ్ర.కామ్
VOICE OF TELUGU PEOPLE
NAMASTEANDHRA.COM
FOR THE STATE # OF THE STATE # BY THE STATE
MAR 2025


# ONLY 2 MINUTES FROM BALANAGAR METRO STATION


ASBL LANDMARK
The Great Upgrade

Stay ahead of the traffic with effortless connectivity across the city

₹2.4 Cr
ONWARDS

## Nearby Hospitals

- Landmark Hospital
- Aster Prime Hospital
- Rainbow Children's Hospital
- Yashoda Hospital
- KIMS Hospital
- and many more





5+
Schools

8+
IT Parks

11+
Entertainment Zones

1 min from — Lakeshore Mall
2 mins from — Balanagar Metro Station
20 mins from — Hitech City
50 mins from — Airport

080 452 48944
asbl.in/landmark


DIFFERENT ZONES FOR DIFFERENT NEEDS
52000 sq. ft. of indoor amenities
& even more outdoors
ASBL LANDMARK
The Great Upgrade
Sports Zone
For the fitness enthusiast in you, we offer multiple fitness studios, including yoga, Zumba, calisthenics, and more.
Tranquil Zone
Discover peace and serenity at our temple, which is accompanied by a cultural workshop space to celebrate traditional art forms.
Kids Zone
Where they grow as they play with a Panchatantra-themed play area that's fully padded for extra safety & more features
Practical Luxury Zone
Convenience at your doorstep, featuring a co-working space, a clinic with physiotherapy, a laundry room, and more.
Scan this QR to enjoy the great upgrade!
₹2.4 Cr
ONWARDS
080 452 48944
asbl.in/landmark

# ఇంకా '30 ఏళ్ల' భ్రమల్లో!

ఓడినా మారని జగన్ తీరు
నరనరానా అధికార వ్యామోహం
అంతులేని పదవీలాలస.. దానిమాటున ధనకాంక్ష
కళ్లు మూసుకుంటే 9 నెలలు గడచిపోయాయట
మిగతా నాలుగేళ్లూ ఇట్టే అయిపోతాయట
ఆ తర్వాత సీఎం గద్దె తనదేనట!
30 ఏళ్లు దానిపైనే ఉంటానంటూ ఆర్భాటం
నవ్వుకుంటున్న జనం ● విస్తుపోతున్న వైసీపీ నేతలు
అసెంబ్లీకి ముఖం చాటేస్తూ ఈ నాటకాలేంటని ఆగ్రహం



జగన్మోహన్‌రెడ్డి నరనరాల్లో విపరీతమైన అధికార వ్యామోహం గూడుకట్టుకుని ఉంది. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.లక్ష కోట్లకుపైనే దోచుకున్నా.. ఆయన ధనకాంక్ష తీరలేదు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఇంకెంత ఆర్జించారో లెక్కాపత్రం లేదు. నిరుటి ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టినా.. 175 సీట్లు గెలుస్తామన్న ఆయన ప్రగల్భాలను 11 సీట్లతో చీల్చిచెండాడినా.. ఆయనకు కించిత్తు బాధయినా లేదు. చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వస్తుందని ముందే ఊహించేశారు. ఫలితాల రోజున ఆయన మాటల్లో ఏ మాత్రం పశ్చాత్తాపం లేదు. జనం ఎందుకు ఓడించారో ఆత్మపరిశీలన లేదు. వారేదో పాపం చేసినట్లుగా.. చంద్రబాబు మాటలు విని మోసపోయినట్లుగా.. ఆయన హామీలు నెరవేర్చరన్నట్లుగా మాట్లాడారు. ఇప్పుడూ అదే మాట్లాడుతున్నారు. వచ్చిన అవకాశాన్ని ప్రజల మేలుకు ఉపయోగించుకుండా.. వారికి ముష్టి వేసి.. అభివృద్ధి పనులను అటకెక్కించి.. లక్షల కోట్లు అప్పులు తెచ్చి.. వాటిని, ఆదాయాన్ని ఎటెటో మళ్లించుకుని.. బెంగళూరు ప్యాలెస్‌లోనే మకాం వేసి.. అడపాదడపా మాత్రమే తాడేపల్లి ప్యాలెస్‌కు వస్తున్న ఆయన.. 2029లో తానే గెలుస్తానని.. 30 ఏళ్లు అధికారంలో కొనసాగుతానని ఊహాలోకంలో బతికేస్తున్నారు. కళ్లుమూసుకుంటే చంద్రబాబు వచ్చి 9 నెలలు గడచిపోయాయని.. ఇలాగే మిగతా నాలుగేళ్ల మూడు నెలలు ముగుస్తాయని.. వైసీపీ శ్రేణులంతా బయటకు వచ్చి పోరాడాలని పిలుపిస్తున్నారు. అయితే ఆయన పిలుపిచ్చిన నిరసన కార్యక్రమాలకు జనస్పందన లేకపోగా... వైసీపీ కార్యకర్తలే పాల్గొనడం లేదు. ఐదేళ్లలో 9 సార్లు కరెంటు చార్జీలు పెంచి జనంపై భారీ భారం మోపింది తమ నాయకుడేనని, ప్రజలు తమను ఓడించడానికి ఇది ప్రధాన కారణమని వారికి తెలుసు. ఈ విషయం ఎన్నికల ముందే ముఖ్య నేతలు, ప్రభుత్వ పెద్దలకు చెప్పినా లాభం లేకపోయింది. జగన్‌కు ఈ విషయం చెప్పే ధైర్యం వారికి లేదు. ఆయనకు తెలియని విషయం కాదులే అని వారు కూడా మౌనంగా ఉండిపోయారు. విద్యార్థులకు ఫీజు బకాయిలు కింద రూ.4,100 కోట్లు బకాయిపెట్టిపోయిన జగన్.. చంద్రబాబు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తేశారని దుష్ప్రచారం చేస్తున్నారు. దీనిపై ఫీజుపోరుకు పిలుపిచ్చారు. వైసీపీ నేతలు అంగీకరించలేదు. ఒక విడత ఫీజు బకాయిలను విద్యామంత్రి లోకేశ్ చెల్లించారని.. ఇది జనంలోకి బాగా వెళ్లిందని.. ఈ పరిస్థితుల్లో రోడ్డెక్కితే పరువు పోతుందని వారు మొత్తుకున్నారు. కానీ జగన్ వినిపించుకోలేదు. జరపాల్సిందేనన్నారు. అయితే ఈలోపు పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో.. కోడ్ సాకుతో పోరును వాయిదావేశారు. ఆ ఎన్నికలు ముగిశాయి. వైసీపీ మద్దతుతో పోటీచేసిన వామపక్ష పీడీఎఫ్ అభ్యర్థులు ఘోరంగా ఓడిపోయారు.



### బాబుకు ప్రతిపక్షనేత హోదా నేనే ఇచ్చా!!

మనం మాట్లాడేది నిజమో, అబద్ధమో ప్రజలకు తెలియదని జగన్ నిశ్చితాభిప్రాయం. అసెంబ్లీలో 18 సీట్లు ఉంటే తప్ప ప్రతిపక్ష హోదా రాదన్నది ఆయనకూ తెలుసు. వైసీపీ నుంచి 11 మంది మాత్రమే గెలిచినా.. తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సిందేనని.. లేదంటే సభకు రానని 9 నెలలుగా మారాం చేస్తూనే ఉన్నారు. కోర్టుకు వెళ్లారు.. స్పీకర్‌కు లేఖలు రాశారు.. మీడియా సమావేశంలోనూ డిమాండ్ చేశారు. అసెంబ్లీలో అడుగుపెడితే తనను అవమానిస్తారని.. ఎక్కువ సేపు మైకు ఇవ్వరని ఆయన ఆందోళన చెందుతున్నట్లు కనబడుతోంది. 2019లో వైసీపీ గెలిచాక అసెంబ్లీ మొదటిసారి సమావేశమైనప్పుడు నాటి మాజీ సీఎం చంద్రబాబును సభలో అధికార పక్షం సూటిపోటి మాటలతో ఎంతగానో అవమానించింది. గతంలో పదేళ్లు విపక్షంలో ఉన్న ఆయన. చాలాకాలం ఆ బాధను దిగమింగుకుంటూ వచ్చారు. కానీ సభలో తన భార్య భువనేశ్వరి పట్ల వైసీపీ సభ్యులు అనుచితంగా మాట్లాడడం సహించలేకపోయారు. కౌరవ సభలో తాను ఉండనని.. గౌరవ సభగా మారిన తర్వాత సీఎంగానే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేశారు. అన్నట్లుగానే సీఎంగానే సభలో ప్రవేశించారు. తనను కూడా టీడీపీ కూటమి అవమానిస్తుందని జగన్ అనవసరంగా భయపడుతున్నారా.. లేక ఆ సాకుతో అసెంబ్లీకి ముఖం చాటేస్తున్నారా అని రాజకీయ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి.

ప్రతిపక్ష నేత హోదా కోసం జగన్ ఎందుకు వెంపర్లాడుతున్నారు? సభానాయకుడు అంటే సీఎం సభలో ఎంతసేపు మాట్లాడితే.. విపక్ష నేతకు కూడా అంత సేపు మాట్లాడే అవకాశం దక్కుతుందని ఆయన అంటున్నారు. అది నిజమైతే చంద్రబాబుకు ఆయన అసలు



అవకాశమిచ్చారో లేదో.. మనస్సాక్షి ఉంటే గుండెపై చేయి వేసుకుని చెప్పాలని టీడీపీ నేతలు అంటున్నారు. ప్రతిపక్ష నేతగా చంద్రబాబు మాట్లాడేందుకు నిలుచున్న వెంటనే వైసీపీ సభ్యులు అరుపులూ కేకలు వేయడం... నాటి సభాపతి తమ్మినేని సీతారాం మైక్ కట్ చేయడం.. సభ జరిగిన ప్రతి రోజూ ఇదే పరిస్థితి. సభను చంద్రబాబు బహిష్కరించినా టీడీపీ ఎమ్మెల్యేలను మాత్రం యథాప్రకారం అసెంబ్లీ సమావేశాలకు ఆయన పంపారు. ఇప్పుడు జగన్ తన పది మంది ఎమ్మెల్యేలను అసెంబ్లీ ఛాయలకైనా రానివ్వడం లేదు. తాను మాత్రం కూలి మీడియాను ముందేసుకుని గంటల కొద్దీ మాట్లాడుతున్నారు. బడ్జెట్‌పై చర్చను ప్రతిపక్ష నేత ప్రారంభించడం ఆనవాయితీ. 2022లో చంద్రబాబుకు ఆ అవకాశమివ్వలేదు. పాలక పక్షానికి మైకిచ్చారు. ప్రతిపక్ష నేతగా చంద్రబాబును తానే నియమించానంటూ జగన్ చేసిన వ్యాఖ్యలు ఆయన దురహంకారానికి నిదర్శనమని రాజకీయ వర్గాలు అంటున్నాయి. మొత్తం అసెంబ్లీ స్థానాల్లో (175) పదిశాతం సీట్లు (18) గెలిచే పార్టీ నేతకే ప్రతిపక్ష నేత హోదా దక్కుతుంది. 2019 ఎన్నికల్లో టీడీపీకి 23 స్థానాలు వచ్చాయి. సంప్రదాయాల మేరకు టీడీఎల్పీ నేత చంద్రబాబును ప్రతిపక్ష నేతగా స్పీకర్ గుర్తించారు. కానీ తన దయాదాక్షిణ్యాలతోనే ఆయనకా గుర్తింపు వచ్చిందని.. నలుగురు టీడీపీ ఎమ్మెల్యేలు వైసీపీ వైపు వచ్చారని.. మిగతావారిని కూడా లాగేద్దాం.. ఆయన విపక్షనేత హోదాను తీసేద్దామని తన పార్టీ నేతలు చెబితే తాను అంగీకరించలేదని జగన్ అన్నారు. తన అధికార పరిధిలో లేని అధికారాలను కూడా తనకు అన్వయించుకోవడం.. ఐదేళ్లు ఆయన పాలన జరిగిన తీరును ప్రతిబింబిస్తోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

### సభకు రాకుండా బడ్జెట్‌పై విశ్లేషణ

ఫిబ్రవరి 24న గవర్నర్ ప్రసంగంతో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. అనూహ్యంగా జగన్ అసెంబ్లీకి హాజరవ్వాలని నిర్ణయించుకున్నారు. కొత్త సభ కొలువు తీరాక శాసనసభ్యుడిగా ప్రమాణం చేయడానికి మాత్రమే ఆయన సభకు వచ్చారు. ఆ తర్వాత ఆయన గానీ, వైసీపీ ఎమ్మెల్యేలు గానీ రాలేదు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పుడు వరుసగా 60 రోజులు హాజరుకాకపోతే సదరు సభ్యుడిపై అనర్హత వేటు పడుతుంది. ఇదే విషయాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు ఇటీవల ప్రస్తావించారు. దీంతో బెంబేలెత్తిన జగన్.. గవర్నర్ ప్రసంగానికి హాజరయ్యారు. పట్టుమని 11 నిమిషాలు కూడా సభలో ఉండకుండా... తన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో రచ్చచేయించి బయటకు వెళ్లిపోయారు. అయితే స్పీకర్ అధ్యక్షతన సభ జరిగితేనే ఆ రోజు లెక్కలోకి వస్తుందని.. గవర్నర్ ప్రసంగం జరిగే రోజు పనిదినం కిందకు రాదని రాజ్యాంగ నిపుణులు అంటున్నారు. ఆయన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకూ వైసీపీ సభ్యులు రాలేదు. ఇక మార్చి 1న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర బడ్జెట్ పెట్టినప్పుడూ జగన్ అండ్ కో పత్తా లేరు. జగన్ బెంగళూరు యలహంక ప్యాలెస్‌కు చెక్కేసి తిరిగ్గా మార్చి 6న తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుకున్నారు. సొంత, కూలి మీడియాను పిలిపించుకున్నారు. బడ్జెట్‌పై రెండు గంటలు అనర్గళంగా మాట్లాడారు. కానీ ఆయన ఏం చెప్పదలిచారో జర్నలిస్టులకు అసలు అవగతమే కాలేదు. పైగా మీడియా ముందు తాను చెప్పినవాటికి ప్రభుత్వం వచ్చి సమాధానం చెప్పాలనడంతో వారు విస్తుపోయారు. ఘోరపరాజయం పాలైనా ఆయన ఇంకా తనను తాను సీఎంగానే భావిస్తున్నట్లుగా ఉందని పక్కకు వచ్చి నవ్వుకున్నారు.

# కేసీఆర్‌కు బాబు భయం

## తెలంగాణలోకి కూటమి వస్తుందన్న ప్రచారంతోనేనా?



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రస్తావన తెచ్చారు. ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి గెలిచి.. అధికారంలో చేపట్టి పది నెలలు అయిన తరువాత.. చంద్రబాబు గెలుపు గురించి కేసీఆర్ మాట్లాడారు. పొత్తుల వల్లనే చంద్రబాబు గెలిచారు తప్ప.. సొంతంగా కాదంటూ హాట్ కామెంట్స్ చేశారు. అయితే ఇన్నాళ్లుగా ఈ విషయంపై మాట్లాడని కేసీఆర్ ఇప్పుడు హఠాత్తుగా ఈ అంశాన్ని ప్రస్తావించడంతో రాజకీయ వర్గాల్లో దీనిపై పెద్ద చర్చే జరుగుతోంది. వాస్తవానికి తెలంగాణ ఉద్యమ సమయంలో, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తరువాత జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ చంద్రబాబునే కేసీఆర్ టార్గెట్ చేసుకున్నారు. చంద్రబాబును బూచిగా చూపించి తెలంగాణ సెంటిమెంటును రెచ్చగొట్టి ప్రయోజనం పొందారు. రెండు పర్యాయాలు అధికారంలోకి రాగలిగారు. అంతేకాదు.. తనకు మిత్రుడైన వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఏపీలో అధికారంలో రావడానికి కూడా సహకరించారు. తద్వారా చంద్రబాబును దెబ్బతీశారు. చివరికి 2023 ఎన్నికల్లో తెలంగాణలో కేసీఆర్ ఓడిపోవడం, ఏపీలో జగన్ ప్రభుత్వం కూడా పడిపోయి తిరిగి చంద్రబాబు అధికారంలోకి రావడంతో పరిస్థితులు ఒక్కసారిగా తారుమారయ్యాయి. ఊహించని పరిణామాలతో షాక్ కు గురైన కేసీఆర్ చాలా కాలంపాటు ఫాంహౌస్ దాటి బయటకు కూడా రాలేదు. ఇప్పటికీ ఫాంహౌస్ దాటడంలేదు. కానీ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో కొంత అసంతృప్తి నెలకొందన్న ప్రచారంతో కేసీఆర్‌లో కాస్త ఉత్సాహం వచ్చినట్లయింది. దీంతో పార్టీ నేతలను ఫాంహౌస్‌కు పిలిపించుకుంటూ వారిని కలుస్తున్నారు. మళ్లీ అధికారంలోకి రాబోయేది బీఆర్ఎస్సేనంటూ వారిలో భరోసా నింపే ప్రయత్నం చేస్తున్నారు.



### ఏపీ ఫార్ములాను అమలు చేసే యోచనలో బీజేపీ..

తిరిగి జవసత్వాలు పుంజుకోవాలని ఓవైపు కేసీఆర్ ప్రయత్నిస్తుంటే.. మరోవైపు ఏపీలో మాదిరిగానే తెలంగాణలోనూ కూటమి రాజకీయాలు చేయాలని బీజేపీ భావిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. టీడీపీ, జనసేనను కలుపుకొని తెలంగాణలో తమ సారథ్యంలో అధికారంలోకి రావాలని బీజేపీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఏపీలో ఈ మూడు పార్టీలూ కలిసి ఎన్డీయేగా పోటీ చేసి.. బ్రహ్మాండమైన విజయాన్ని నమోదు చేశాయి. దీనిని ఏపీకే పరిమితం చేయకుండా తెలంగాణకూ విస్తరించాలని కమలనాథులు భావిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణలో బీజేపీ రాజకీయంగా మెరుగైన స్థితిలో ఉంది. దీనిని మరింత మెరుగుపరచుకొని 2028 చివరిలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలని అనుకుంటోంది. అందువల్లనే ఏపీ ఫార్ములానే తెలంగాణలోనూ అమలు చేయాలని చూస్తోంది. తెలుగుదేశం పార్టీ తెలంగాణలోనూ ఉంది. ఆ పార్టీ లీడర్లంతా ఇతర పార్టీల్లోకి వెళ్ళిపోయినా.. క్యాడర్ మాత్రం కొంత మేరకు ఉంది. నిజామాబాద్, నల్గొండ, ఖమ్మం, హైదరాబాద్ వంటి చోట్ల టీడీపీకి బలం ఉంది. ఇక జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు తెలంగాణలో మంచి అభిమాన గణం, యువత మద్దతు ఉంది. పైగా పవన్ క్రౌడ్ పుల్లర్, బాబు వ్యూహకర్త. ఉత్తర తెలంగాణాలో బీజేపీ బలపడుతోంది. ఈ నేపథ్యంలో ఆ రెండు పార్టీలను కలుపుకొని తెలంగాణలో కూటమి కడితే కాంగ్రెస్‌ని ఓడించవచ్చునని బీజేపీ ప్లాన్ వేస్తోంది.

### పెద్ద దెబ్బ బీఆర్ఎస్ కే..

తెలంగాణలో ఎన్డీయే కూటమి బరిలో ప్రయోగం జరగబోతోందనంటూ ఇటీవలి కాలంలో చర్చ గట్టిగానే జరుగుతోంది. ఈ ప్రయోగాన్ని తొలుత జీహెచ్ ఎంసీ ఎన్నికల్లో అమలు చేస్తారని అంటున్నారు. ఆ తరువాత అసెంబ్లీ ఎన్నికల నాటికి దానిని మరింత పకడ్బందీగా ఆచరణలోకి తెస్తారనే ప్రచారం జరుగుతోంది. అయితే ఇదే కనుక జరిగితే ఇబ్బంది పడేది బీఆర్ఎస్సేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి వనరులకు కొదవ లేదు. ఏపీలో అధికారంలో ఉన్న చంద్రబాబు వ్యూహాలకు తిరుగు ఉండదు, పవన్ కల్యాణ్ సినీ గ్లామర్ ఉండనే ఉంది. ఈ కాంబినేషన్ ను తెలంగాణ జనాలు కనుక ఆమోదిస్తే.. ముందుగా దెబ్బ తినేది బీఆర్ఎస్సేనని పేర్కొంటున్నారు. ఇప్పటికే 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా దక్కలేదు. బీజేపీ మాత్రం ఎనిమిది సీట్లు గెలుచుకుంది. అలాగే ఇటీవల రెండు ఎమ్మెల్సీ సీట్లను సైతం కైవసం చేసుకుంది. ఇలా ఎన్నిక ఏదయినా బీజేపీ అంతకంతకు బలపడుతోంది. బీఆర్ఎస్‌ను, కాంగ్రెస్‌ను చూశామని, బీజేపీకి ఒక చాన్స్ ఇస్తే తప్పేంటని ఓటర్లు కనుక భావిస్తే గులాబీ పార్టీకి షాక్ తప్పదన్న అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ అధినేత ముందు జాగ్రత్తగానే చంద్రబాబుపై కామెంట్లు చేశారని అంటున్నారు. రేపటి రోజున ఎటూ బీజేపీతో పాటు బాబు మీద కూడా విమర్శలు చేయాల్సి ఉంటుందన్న విషయాన్ని గుర్తెరిగి ఇలా మాట్లాడి ఉంటారని పేర్కొంటున్నారు. అంతేకాకుండా.. తెలంగాణ వనరులపై గుంటనక్కలు కన్నేశాయంటూ వ్యాఖ్యానించడం ద్వారా మరోసారి సెంటిమెంట్‌ని రాజేయాలని చూస్తున్నట్లుగా కూడా కనిపిస్తోంది. సొంతంగా ఒంటరిగా పోటీకి దిగుతామని కేసీఆర్ పైకి చెప్పారు కానీ, ఎన్డీయే బలంగా మూడు పార్టీలతో వస్తే కాంగ్రెస్ అధికారంలో ఉంటే బీఆర్ఎస్ ఒంటరిగా ఢీ కొట్టగలదా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మొత్తమ్మీద తెలంగాణాలో ఎన్డీయే కూటమి కనుక ఎంటరైతే.. బీఆర్ఎస్‌కు ఇబ్బందులు తప్పవన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. దీనిని గుర్తించే కేసీఆర్ ఇప్పటినుంచే జాగ్రత్త పడుతున్నారని, అందుకే చంద్రబాబుపై విమర్శలు మొదలుపెట్టారని అంటున్నారు.



## బాలయ్య.. భలే కాంబో

నందమూరి బాలకృష్ణ ఒకప్పుడు ఎక్కువగా సీనియర్ డైరెక్టర్లతోనే సినిమాలు చేసేవాడు. ఐతే ఔట్ డేట్ అయిపోయారని తెలిసి కూడా వేర్వేరు కాలాల్లో బి.గోపాల్, దాసరి నారాయణరావు, కె.ఎస్.రవికుమార్ లాంటి దర్శకులతో పని చేసి ఆయన చేదు అనుభవాలు ఎదుర్కొన్నారు. ఐతే గత కొన్నేళ్లుగా మాత్రం బాలయ్య ఇలాంటి తప్పులు చేయట్లేదు. యంగ్, ట్రెండీ డైరెక్టర్లతోనే సినిమాలు చేస్తూ వస్తున్నారు. దీంతో వరుసగా హిట్లు పడుతున్నాయి. గత కొన్నేళ్లలో బాలయ్య.. గోపీచంద్ మలినేనితో 'వీరసింహారెడ్డి', అనిల్ రావిపూడితో 'భగవంత్ కేసరి', బాబీతో 'డాకు మహారాజ్' సినిమాలు చేసి మంచి ఫలితాలు అందుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన బోయపాటి శ్రీనుతో 'అఖండ-2' చేస్తున్నారు. దీని తర్వాత బాలయ్య ఒక క్రేజీ కాంబోతో రెడీ అవుతున్నట్లు సమాచారం.

గబ్బర్ సింగ్ దర్శకుడు హరీష్ శంకర్‌తో బాలయ్య జట్టు కట్టబోతున్నాడటన్నది లేటెస్ట్ న్యూస్. బాలయ్య-హరీష్ కాంబినేషన్లో సినిమాను అస్సలు ఊహించలేం. హరీష్ ఎక్కువగా యంగ్ హీరోలతోనే సినిమాలు చేశారు. బాలయ్య తరం సీనియర్లతో పని చేయలేదు. ఆయన ఎక్కువగా సినిమాలు చేసింది కూడా మెగా హీరోలతోనే. నందమూరి హీరోల్లో జూనియర్ ఎన్టీఆర్‌తో 'రామయ్యా వస్తావయ్యా' చేశాడు. కానీ అది డిజాస్టర్ అయింది. హరీష్ సినిమాల శైలికి, బాలయ్య చిత్రాల స్టైల్‌కు తేడా ఉంటుంది. కానీ గోపీచంద్, అనిల్, బాబీ లాంటి దర్శకులతో సినిమాలు చేశాక బాలయ్య లుక్, ఇమేజ్ పరంగా మేకోవర్ వచ్చింది. హరీష్ శంకర్ సైతం బాలయ్యను కొత్తగా ప్రెజెంట్ చేయగలడని ఆశించవచ్చు. పవన్ కళ్యాణ్‌తో చాలా ఏళ్ల కిందట హరీష్ శంకర్ దర్శకత్వంలో మొదలైన సినిమాకు ఎప్పటికప్పుడు బ్రేకులు పడుతూనే ఉన్నాయి. ఒక కథ అనుకున్నాక దాన్ని మార్చి, 'ఉస్తాద్ భగత్ సింగ్' పేరుతో మరో సినిమా మొదలుపెట్టారు. అది కూడా ముందుకు కదల్లేదు. దీంతో మధ్యలో 'మిస్టర్ బచ్చన్' చేశాడు హరీష్. కానీ అది డిజాస్టర్ అయింది. 'ఉస్తాద్..' ఇప్పుడిప్పుడే మొదలయ్యే సంకేతాలు కనిపించకపోవడంతో ఈలోపు మరో సినిమా చేయాలని హరీష్ డిసైడయ్యాడు. తనతో సినిమాకు బాలయ్య సుముఖంగానే ఉన్నట్లు కనిపిస్తోంది. 'అఖండ-2' పూర్తి చేశాక ఈ సినిమా పట్టాలెక్కొచ్చు.





# ప్రభుత్వం మారినా కన్సల్టెంట్ల పెత్తనమే!

అన్ని శాఖల్లో కలిపి వందమందికిపైనే
ఉద్యోగులకు సమాంతరంగా ప్రైవేటు వ్యవస్థ
వాళ్లే కావాలంటున్న కొందరు సెక్రటరీలు
ఎస్‌వోలు, ఏఎస్‌వోలు ఇచ్చే సమాచారానికి
హైఫై ఇంగ్లీషు అద్దడమే వీరి పని




రాష్ట్ర సచివాలయం అంటే.. ప్రధాన కార్యదర్శి, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, సెక్షన్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు! అయితే జగన్ జమానాలో వీరిని కాదని.. మరో కొత్త వర్గాన్ని పాదుగొల్పారు. వారే.. కన్సల్టెంట్లు! 'భగవంతుడికీ–భక్తుడికీ మధ్య' అన్నట్లుగా... కార్యదర్శులు, సెక్షన్ ఆఫీసర్ల మధ్య వీరు తయారయ్యారు! అయితే.. వీరిది అనుసంధానం కాదు.. అచ్చంగా అడ్డుగోడ. ఈ కన్సల్టెంట్ల వ్యవహారం సచివాలయంలో అతిపెద్ద చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం కన్సల్టెంట్ల సేవలు తీసుకోవడం కొత్తేమీ కాదు! ఎప్పటి నుంచో జరుగుతున్నదే! కానీ కొన్ని ప్రత్యేకమైన ప్రాజెక్టులు, అంతర్జాతీయ స్థాయి ప్రణాళికలు, వినూత్నమైన ఆలోచనల అమలు తదితర సేవలకు మాత్రమే కన్సల్టెంట్లను వినియోగించుకోవడం రివాజు! ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారిని అలా నియమించుకుంటే ప్రాజెక్టు నివేదికల తయారీ, సంప్రదింపులు సులువుగా, సాఫీగా సాగుతాయి. అయితే ఐదేళ్లుగా పరిస్థితి 'అంతకు మించి' అన్నట్లుగా తయారైంది. ప్రభుత్వ యంత్రాంగం చేయగలిగే రొటీన్ కార్యకలాపాల్లోనూ కన్సల్టెంట్లు వేలు పెడుతున్నారు. సచివాలయంలోని అన్ని శాఖల్లో కలిపి ఏకంగా వంద మందికిపైగా కన్సల్టెంట్లు ఉన్నారు. ఆర్థిక శాఖ, దాని పరిధిలోని ప్రణాళిక శాఖలోనే ఏకంగా 31 మంది ఉండటం గమనార్హం. వీరందరికీ ప్రభుత్వ అధికారులతో సమానంగా, కొందరికి ఇంకా ఎక్కువగానే వేతనాలు అందిస్తున్నారు. వెరసి.. సెక్రటేరియట్‌లో ప్రభుత్వ యంత్రాంగానికి సమాంతరంగా ఒక ప్రైవేటు వ్యవస్థ నడుస్తోంది.

### బడ్జెట్ రూపకల్పనతో వారికేం పని?

అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నిధులతో చేపట్టే ప్రాజెక్టుల అమలుకు కన్సల్టెంట్ల నియామకం తప్పనిసరి. ఆయా నిధుల వినియోగం, నివేదికల రూపకల్పనకు వీరిని నియమిస్తారు. ఒప్పందంలోనే దీని గురించి ఉంటుంది. అంతర్జాతీయ విధానాలకు అనుగుణంగా వినూత్నమైన పాలసీలు రూపొందించేందుకు కన్సల్టెంట్లను నియమించుకోవడంలో తప్పులేదు. కానీ... జగన్ ప్రభుత్వం వచ్చాక భారీ స్థాయిలో 'కన్సల్టెన్సీ రాజ్' తీసుకొచ్చారు. ఇప్పుడు అది మరింత పెరిగింది. బడ్జెట్ రూపకల్పన కోసం ఎవరైనా ఆర్థిక నిపుణుడి సలహా తీసుకోవచ్చు. సలహాదారుగా నియమించవచ్చు. కేంద్రం నుంచి, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి నిధులు ఎలా సమీకరించవచ్చు. తదితర అంశాలపై సలహాలు ఇచ్చేందుకు కన్సల్టెంట్లను నియమించుకోవడంలో తప్పులేదు. కానీ... ఏటా జరిగే బడ్జెట్ రూపకల్పనకూ వీరినే ఆశ్రయిస్తున్నారు. బిల్లులు, చట్టాలను కూడా కన్సల్టెంట్లతో చేయిస్తున్నారు. ప్రస్తుతం 16వ ఆర్థిక సంఘాన్ని అడగాల్సిన నిధుల కోసం ఆర్థిక శాఖలో ఏకంగా 11 మంది కన్సల్టెంట్లు పనిచేస్తున్నారు. వీరిలో ఎక్కువమంది బెంగళూరు, చెన్నై నుంచి వస్తారు. ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో... అంతా వాళ్ల ఇష్టం. జీతాలు మాత్రం లక్షల్లోనే!

### ఉద్యోగులను దూరం చేస్తూ...

సచివాలయంలో ఎస్‌వోలు, ఏఎస్‌వోలు అనుభవజ్ఞులు! విషయ పరిజ్ఞానం ఎక్కువ. అయితే కన్సల్టెంట్లకు ఉన్న అర్హత... హైఫై ఇంగ్లీష్ వాడడమే! ప్రభుత్వంలో సెక్రటరీల పేరుతో పాలనా వ్యవహారాలు నడుస్తాయి. వారికి సాయం చేయడానికి ప్రభుత్వ ఉద్యోగులు వివిధ కేడర్లలో ఉంటారు. కానీ ఇప్పుడు చాలామంది కార్యదర్శులు కన్సల్టెంట్లు లేకుండా ఒక్క అడుగు కూడా వేయడం లేదు. పోనీ ఆయా సబ్జెక్టుల్లో నైపుణ్యం ఉన్న వారినే నియమించుకుంటున్నారా అంటే అదీ లేదు. కేవలం ప్రపంచ స్థాయి ఇంగ్లీషు వస్తే చాలన్నట్టుగా కన్సల్టెంట్ల నియామకాలు



జరుగుతున్నాయి. వీరికి ప్రత్యేకమైన టాస్కులు కూడా అప్పగించడంలేదు. ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇవ్వాలన్నా, నోట్ రాయాలన్నా, కేంద్ర ప్రభుత్వ శాఖలకు ప్రతిపాదనలు పంపాలన్నా వీరినే పిలుస్తున్నారు. వీరు కూడా.. సంబంధిత సబ్జెక్టు చూసే సెక్షన్ ఆఫీసర్ల దగ్గరకు వెళ్లి వివరాలు తీసుకుని, వాటి ఆధారంగా ప్రజంటేషన్లు, లేఖలు సిద్ధం చేస్తున్నారు. ఈ మాత్రం పని ఎస్‌వోలు, ఏఎస్‌వోలు చేయలేరా? కచ్చితంగా చేయగలరు. అయినప్పటికీ కన్సల్టెంట్లదే పెత్తనం! దీంతో సెక్రటరీలకు, సచివాలయ అధికారులకు మధ్య అంతరం పెరుగుతోంది. కొన్ని శాఖల్లో సెక్రటరీలు, ఉద్యోగులు నెలల తరబడి నేరుగా మాట్లాడుకోకుండానే పాలనా వ్యవహారాలు సాగుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

### అనుభవాన్ని పక్కనపెట్టి...

సచివాలయంలో కార్యదర్శులు నిర్ణయం తీసుకునేందుకు ఒక విధానం అమలులో ఉంది. కొందరు కార్యదర్శులు తన కింది స్థాయిలో ఉండే అధికారులను పిలిచి మాట్లాడతారు. మరికొందరు ఆ సెక్షన్‌కు సంబంధించిన ఏఎస్‌వో, ఎస్‌వో, ఏఎస్, డీఎస్ ఇలా అందరినీ పిలిచి అభిప్రాయాలు తీసుకుని.. ఒక నిర్ణయం తీసుకుంటారు. ఎందుకంటే.. ఆ శాఖలో సెక్రటరీల కంటే ఉద్యోగులకే ఎక్కువ అనుభవం ఉంటుంది. ఉదాహరణకు... రాష్ట్రంలో పన్ను ఆదాయం ఎలా పెంచాలి.. ఎందుకు తగ్గుతోంది.. ఎక్కడ లోపం జరుగుతోందని ప్రశ్నిస్తే ఆర్థిక శాఖ అధికారులే సాధికారికంగా జవాబు చెప్పగలరు. ఎందుకంటే వారికి బదిలీలు ఉండవు. రిటైరయ్యే వరకు అదే శాఖలో పని చేస్తారు. అన్ని పరిణామాలనూ గమనిస్తుంటారు. చెల్లింపులు, వసూళ్ల గురించి వారికి కొట్టిన పిండి. నిద్రలోనైనా ఇట్టే చెప్పేస్తుంటారు. ఇదే ప్రశ్న కన్సల్టెంట్లను అడిగితే వారి ముఖం ప్రశ్నార్థకమవుతుంది. వెంటనే ఫోన్ తీసి గూగుల్‌లో సెర్చ్ చేస్తారు. కన్సల్టెంట్ల కంటే ఉద్యోగంలో చేరినప్పటి నుంచి రిటైర్ అయ్యే వరకు అదే శాఖలో ఉండే ఉద్యోగులకు రాష్ట్రానికి అవసరమైన నిధులపై అవగాహన ఉంటుంది. అయినప్పటికీ కన్సల్టెంట్లదే పెత్తనంగా మారింది. పోనీ... నిధులు రాబట్టడంలో వీళ్లేమైనా అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారా అంటే అదీ లేదు. ఉద్యోగులను నమ్మలేం, అందుకే కన్సల్టెంట్లతో పనులు చేయిస్తున్నామని కొందరు అధికారులు బాహాటంగానే చెబుతున్నారు. ఉద్యోగులకు చెప్పలేని రహస్యాలను ప్రైవేటు వ్యక్తులైన కన్సల్టెంట్లకు ఎలా చెబుతారు? పైగా డేటా లీకైతే ప్రభుత్వ ఉద్యోగులను శిక్షించడానికి నిబంధనలు ఉన్నాయి. ప్రైవేటు వ్యక్తులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేరు కదా! అదీగాక వీరిలో అత్యధికులు జగన్ తాబేదార్లు. అధికారం పోయినా వారి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడుస్తున్నాయి. ఆర్థిక శాఖలో జరిగేవన్నీ జగన్‌కు తెలిసిపోతున్నాయి. కాంట్రాక్టులు పొందిన ఆయన అనుయాయకులకు సజావుగా చెల్లింపులు జరిగిపోతున్నాయి. ఇదంతా కన్సల్టెంట్ల మహత్యమే. చంద్రబాబు సీఎం అయిన తర్వాత వీరిని తొలగించకపోగా.. మరింత మందిని తెచ్చి అధికార వ్యవస్థపై రుద్దుతున్నారు. అందుకే పాలనలో మార్పులు కనిపించడమే లేదని జనం, క్షేత్రస్థాయి సిబ్బంది పెదవివిరుస్తున్నారు.

### 'నైపుణ్యం' ఎందుకు?

ప్రభుత్వ ఉద్యోగుల్లో నైపుణ్యాలు పెంచడం కోసమంటూ ప్రణాళిక శాఖ ఆ మధ్య ఒక జీవో జారీ చేసింది. ఏపీ స్టేట్ కెపాసిటీ బిల్డింగ్ కమిటీ, కేంద్రం పరిధిలోని కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ఆధ్వర్యంలో ఏపీ నాలెడ్జ్ సొసైటీ, కెపాసిటీ బిల్డింగ్ పాలసీ–2025ని ఆమోదిస్తున్నట్టు అందులో అత్యాధునిక టెక్నాలజీకి అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడం దీని ఉద్దేశం. ఓ వైపు కన్సల్టెంట్లను మితిమీరి ప్రోత్సహిస్తూ... ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి భవిష్యతలో ప్రభుత్వ అవసరాలకు తగినట్టుగా తీర్చిదిద్దుతామనడమే విచిత్రం! అసలీ కన్సల్టెంట్ల పరిజ్ఞానమేంటో ఎవరు నిర్ధారిస్తున్నారన్నది అంతుపట్టకుండా ఉంది.

# వైఎస్, రోశయ్య జోడీలా.. రేవంత్, భట్టి !



తెలంగాణాలో కొన్ని నెలల క్రితంతో పోలిస్తే.. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిలాక్స్‌డ్‌గా ఉన్నట్లు కనిపిస్తున్నారు. ఓవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా, ప్రజలకు ఇచ్చిన హామీలేవీ నెరవేర్చడం లేదని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నా.. ఇంకా చెప్పాలంటే ప్రభుత్వం పట్ల క్షేత్ర స్థాయిలో ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోతోందనే ప్రచారం జరుగుతున్నా.. రేవంత్ రెడ్డి పెద్దగా పట్టించుకోవడంలేదు. ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ఎవరైనా చెప్పినా పెద్దగా హైరానా పడటంలేదు. తన మంత్రివర్గంలోనే మంత్రుల్లో ఎక్కువ మంది తనకన్నా సీనియర్లు కావడంతో ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో.. ముఖ్యమంత్రి రేవంత్ కొంత ఇబ్బంది పడ్డారని పార్టీలో చెప్పుకొనేవారు. కానీ, ఇప్పుడు అలాంటిది కూడా ఏమీ లేదని, రేవంత్ అన్ని సమస్యల నుంచి బయటపడి ప్రశాంతంగా పాలనపై దృష్టి పెట్టారని అంటున్నారు. అయితే ఈ మొత్తం సానుకూల పరిణామాలకు కారణం మాత్రం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అని కాంగ్రెస్ పార్టీలో చెప్పుకొంటున్నారు. నిజానికి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొంది.. మెజారిటీ సాధించాక భట్టి విక్రమార్క కూడా ముఖ్యమంత్రి అభ్యర్థిగా రేసులో నిలిచారు. కానీ, హైకమాండ్ మాట మేరకు ఉప ముఖ్యమంత్రిగా ఉండేందుకు అంగీకరించారు.

వాస్తవానికి భట్టి విక్రమార్కది ఎంతో సుదీర్ఘమైన అనుభవం కలిగిన రాజకీయం. పైగా దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. ఆయన ఎంతో సహనంతో ఉంటారు. బాధ్యతల పట్ల ఎంతో నిబద్ధతతో వ్యవహరిస్తారు. కాంగ్రెస్ పట్ల ఉన్న విధేయత ఆయనకు ఒక వరంగా మారింది. అయితే ముఖ్యమంత్రి పదవి రాకపోయినా.. తన కన్నా జూనియర్ అయిన రేవంత్ రెడ్డి ఆ పీఠంపై కూర్చున్నాక.. భట్టి ఆయనకు కుడి భుజంగా మారిపోయారు. రేవంత్ రెడ్డికి అన్ని విధాలుగా అండగా ఉంటూ ముఖ్యమంత్రి భారాన్ని తాను భరిస్తూ ఒక విధంగా బెస్ట్ జోడీ అయ్యారు. రేవంత్ రెడ్డి అందుకే భట్టిని విపరీతంగా నమ్ముతూ ఆయనకు ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు చెప్పుకొంటున్నారు. రేవంత్ ఎప్పుడు ఢిల్లీ వెళ్ళినా భట్టి విక్రమార్కనూ వెంట తీసుకెళ్తున్నారు. ఇద్దరూ హైకమాండ్ వద్ద ఒకే బాటగా, ఒకే మాటగా ఉండడం చూసిన ఢిల్లీ పెద్దలు కూడా తెలంగాణాపై తాము పెద్దగా





దృష్టి పెట్టాల్సిన అవసరం లేదనే భావనకు వచ్చారని తెలుస్తోంది. సాధారణంగా ఉప ముఖ్యమంత్రి పదవిలో ఉన్నవారు తరువాత టార్గెట్ ముఖ్యమంత్రి పదవేనన్న భావనలో ఉంటారు. దాని కోసం కుర్చీ ఎక్కిన మొదటి రోజు నుంచి  రాజకీయం చేస్తారు. దాంతో సీఎంది ఒక వర్గం, డిప్యూటీ సీఎంది మరో వర్గం అన్నట్లుగా ఉంటుంది. పార్టీలో, ప్రభుత్వంలో ఇదే తీరు కనిపిస్తుంది. ముఖ్యంగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో ఇది సహజంగా కనిపిస్తుంది.

పక్కనే ఉన్న కర్ణాటకలో చూస్తే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య గ్యాప్ చాలానే ఉంది. అట పార్టీ, ఇటు ప్రభుత్వ వర్గాలు రెండు శిబిరాలుగా చీలిపోయాయన్న వార్తలు ప్రచారంలో ఉన్నాయి. కానీ, తెలంగాణాలో ఆ పరిస్థితి కనిపించడంలేదు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఒక్కమాట మీదనే ఉంటున్నారు. తనకు పదవుల కంటే పార్టీ అప్పగించిన బాధ్యతలు ముఖ్యమనుకునే భట్టి ఉండడం రేవంత్ రెడ్డి అదృష్టం అని అంటున్నవారూ ఉన్నారు. అలాగే రేవంత్ రెడ్డి కూడా సీనియర్ నేతగా భట్టికి తగిన గౌరవం, విలువ ఇస్తున్నారని, ఆయన మాటనే చెల్లుబాటు అయ్యేలా చూస్తున్నారని చెబుతున్నారు. అంతేకాదు.. కీలకమైన సమావేశాలు ఏమైనా భట్టినే అధ్యక్షత వహించమని సీఎం చెబుతున్నారు. పార్టీ, ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని కూడా భట్టి విక్రమార్కే చూసుకుంటున్నారు. ప్రతిపక్షాలను పిలిచి అఖిల పక్ష సమావేశాన్నిఆయనే నిర్వహిస్తున్నారు. వీటన్నింటిని మించి.. ప్రతిపక్ష బీఆర్ఎస్ పై ఎదురుదాడి చేయడంలోనూ భట్టి ముందుంటున్నారు. సీనియర్ నేతగా, గత పర్యాయం కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతగా వ్యవహ రించిన అనుభవాన్నంతా రంగిరించి అసెంబ్లీలో బీఆర్ఎస్ పై తనదైన శైలిలో విమర్శలు గుప్పిస్తూ ఇరుకున పెడుతున్నారు. ఇతర మంత్రులు పెద్దగా చొరవ చూపని పరిస్థితుల్లో భట్టి తీసుకుంటున్న ఈ బాధ్యత రేవంత్‌కు పెద్ద ఊరటనిస్తోందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. మరో వైపు రాష్ట్ర ఖజానాను బీఆర్ఎస్ పదేళ్ళ కాలంలో దివాలా తీయించింని రేవంత్ రెడ్డి తరచూ ఆరోపిస్తున్నారు. నిధులు లేవని అంటున్నారు. కానీ, ముఖ్యమంత్రి ఇచ్చే హామీలకు, పథకాలకు ఏదో విధంగా నిధులను సమకూర్చేందుకు భట్టి విక్రమార్క ఎంతో కృషి చేస్తున్నారని చెబుతున్నారు. ఇది కూడా రేవంత్‌కి  కలిసివస్తోందని పేర్కొంటున్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డి ఎన్నాళ్లు లాగగలుగుతారు? ఐదేళ్లు పూర్తిగా సీఎం పదవిలో ఉంటారా? అని చాలా మందిలో కొన్ని అనుమానాలు ఇప్పటికీ ఉన్నాయి. అయితే భట్టి విక్రమార్క నుంచి ఆయనకు అందుతున్న సహకారం చూసి వారంతా తమ అభిప్రాయాలు మార్చుకుంటున్నారని చెబుతున్నారు. వీరిద్దరిని చూస్తే ఒకప్పటి వైఎస్సార్, రోశయ్యల జోడీ గుర్తు కొస్తోందని అంటున్నవారూ ఉన్నారు. వీరి కాంబినేషన్ ఇలాగే సవ్యంగా కొనసాగితే.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకూ రేవంత్ కు



## పదునైన ఆయుధాలతో పూరి

బద్రి, ఇడియట్, అమ్మ నాన్న ఓ తమిళ అమ్మాయి, పోకిరి, దేశముదురు.. ఇలా ఒకప్పుడు పూరి జగన్నాథ్ హవా మామూలుగా సాగలేదు టాలీవుడ్లో. చాలామంది స్టార్లకు ఇమేజ్ మేకోవర్ ఇచ్చి హీరోయిజాన్ని ఒక రేంజిలో పండించిన దర్శకుడిగా పూరికి పేరుంది. కానీ ఎలాంటి దర్శకుడైనా ఒక దశ దాటాక ఔట్ డేట్ అయిపోయి ఫెయిల్యూర్లు ఎదుర్కోవడం మామూలే. పూరి కూడా అందుకు మినహాయింపు కాలేకపోయాడు. ‘టెంపర్’ తర్వాత ఆయన దారుణమైన ఫలితాలు ఎదుర్కొన్నారు. మధ్యలో ఒక్క ‘ఇస్మార్ట్’ శంకర్ మాత్రమే సక్సెస్ అయింది. కానీ అది ఫ్లూక్ హిట్ అని రుజువు చేస్తూ ‘లైగర్’, ‘డబుల్ ఇస్మార్ట్’ డిజాస్టర్లే అయ్యాయి. దీంతో పూరి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ‘డబుల్ ఇస్మార్ట్’ రిలీజై ఏడు నెలలు దాటినా ఇంకా ఆయన కొత్త చిత్రం ఖరారు కాలేదు. ఆయనతో పని చేయడానికి హీరోలు ముందుకు రాని పరిస్థితి.



చాలా మంది హీరోల కోసం ట్రై చేసి విసిగిపోయిన పూరి.. చివరికి తమిళ విలక్షణ నటుడు విజయ్ సేతుపతిని టచ్ చేసి చూశాడు. ఆయనకు పూరి స్క్రిప్టు నచ్చి సినిమా ఓకే చేసేశాడు. సేతుపతి హీరోగా తక్కువ సినిమాలే చేస్తుంటాడు. బలమైన స్క్రిప్టులుంటే తప్ప ఓకే అనడు. గత ఏడాది తన నుంచి వచ్చిన ‘మహారాజా’ ఎంత పెద్ద హిట్ అయిందో తెలిసిందే. అలాంటి హిట్ తర్వాత పూరి సినిమా ఓకే చేశాడంటే విశేషమే. సేతుపతి లాంటి హీరో దొరకడమే సగం సక్సెస్ అన్నట్లు. ఇక మిగతా సగం సక్సెస్ స్క్రిప్టు మీదే ఆధారపడి ఉంది. ఐతే ఈసారి కొత్త రైటర్లను పెట్టుకుని ఒక బలమైన కథనే రెడీ చేశాడట పూరి. ఈ కథ ఒక బాలీవుడ్ హీరో దగ్గరికి కూడా వెళ్లిందట. అతడికి స్క్రిప్టు నచ్చినా ఖాళీ లేక సినిమా చేయలేకపోయాడట. ఆ కథనే సేతుపతికి చెప్పి ఒప్పించాడట పూరి. తన గత చిత్రాలతో పోలిస్తే భిన్నమైన కథ అట ఇది. మొత్తానికి ఈసారి మంచి హీరో, బలమైన స్క్రిప్టు కుదిరాయని.. పూరి బౌన్స్ బ్యాక్ కావడం ఖాయమని సన్నిహితులు అంటున్నారు. మరి రిజల్ట్ ఎలా ఉంటుందో చూడాలి.

నమస్తే ఆంధ్ర.కామ్
VOICE OF TELUGU PEOPLE
NAMASTEANDHRA.COM
FOR THE STATE # OF THE STATE # BY THE STATE
MAR 2025

# విశాఖ భూస్కాం భూంఫట్!

అటకెక్కిన విచారణ.. అక్రమాలకు సమాధి?

అసలు అక్రమాలే లేవంటూ తొలి నివేదిక

మళ్లీ విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

ఈసారి 64 ఎకరాలతో యంత్రాంగం మమ

వైసీపీ హయాంలో విచ్చలవిడిగా దోపిడీ

విశాఖ, చుట్టుపక్కల భూముల స్వాధీనం

నాడు చెలరేగిపోయిన విజయసాయిరెడ్డి

ఆ తర్వాత వచ్చిన సుబ్బారెడ్డిదీ అదే తీరు

పనిలోపనిగా కొందరు అధికారుల దందా

వారిని కాపాడేందుకు చంద్రబాబు ప్రభుత్వంలోనూ కొందరి యత్నం

విచారణ కమిటీలో 'సొంత మనుషులు'

అక్రమాలే లేవంటూ క్లీన్‌చిట్



నవ్యాంధ్ర ఆర్థిక నగరాన్ని చెరబట్టిన జగన్ అండ్ కో ఆ ఐదేళ్లూ యథేచ్ఛగా భూదోపిడీ కొనసాగించారు. ప్రధానంగా ఉత్తరాంధ్ర వైసీపీ ఇన్‌చార్జిగా వెళ్లిన విజయసాయిరెడ్డి ఏకంగా బీచ్‌లే కబ్జాచేసి కుమార్తెకు కట్టబెట్టారు. ఆ కాలంలో జరిగినవి ఆషామాషీ కుంభకోణాలు కాదు! అవి కూడా ఒకటీ, రెండూ కాదు! బంగారంకంటే విలువైన భూములున్న విశాఖ నగరాన్ని, జిల్లాను తమ కబంధ హస్తాల్లోకి తీసుకుని నలిపేశారు. ఐదేళ్లు ప్రభుత్వ పెద్దలు విచ్చలవిడిగా దోచుకున్నారు. ఏకంగా ప్రాజెక్టులనే హస్తగతం చేసుకున్నారు. వందలు, వేల ఎకరాల భూములను సొంతం చేసుకున్నారు. నాడు విపక్షంలో ఉండగా... 'ఘోరం... నేరం... దారుణం' అని టీడీపీ నేతలు వాపోయారు. ఇప్పుడు అదే పార్టీ అధికారంలోకి వచ్చి 9 నెలలు. మరి.. విశాఖ భూముల స్కామ్‌లో ఏం తేల్చారు? ఇది ఆ పార్టీ, టీడీపీ కూటమి శ్రేణులే కాదు.. రాష్ట్ర ప్రజలంతా అడుగుతున్న ప్రశ్న! దీనికి పై నుంచి సమాధానం శూన్యం.

ఇప్పుడు వైసీపీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి.. ఆయనకు 'జీ హుజూర్' అన్నట్లుగా పని చేసిన కొందరు అధికారులు కలిసి విశాఖ చుట్టూ భారీ స్థాయిలో భూములు భోంచేశారు. రీ సర్వే పేరిట భూముల రికార్డులను తారుమారు చేశారు. ప్రభుత్వ భూములను ప్రైవేటు ఖాతాలో చూపించారు. ఇనాం భూముల రికార్డులను తారుమారు చేశారు. మరోవైపు పేదలకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములకు 20 ఏళ్ల గడువు తీరిన తర్వాత శాశ్వత హక్కులు కల్పిస్తామని జగన్ సర్కారు 2023 ఆగస్టులో చట్ట సవరణ చేసింది. దీనికి అనుగుణంగా జీవో 596 జారీ చేసింది. ఆ భూముల క్రయ, విక్రయాలకు అనుమతి ఇవ్వాలన్నది ప్రభుత్వ అసలు ఉద్దేశం. అసైన్డ్ చట్టసవరణ గురించి వైసీపీ నేతలకు ముందే తెలుసు. విలువైన అసైన్డ్, ఇనాం, ప్రభుత్వ భూములను చేజిక్కించుకునేందుకు కొందరు అస్మదీయ అధికారులను ఏరికోరి విశాఖలో నియమించారు. విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, నాటి సీఎం జగన్‌కు దగ్గరి బంధువు, వైసీపీలో మరో కీలక ప్రజాప్రతినిధి, ఆనాటి ప్రభుత్వంలో అత్యంత ప్రధాన అధికారి పోస్టును నిర్వహించిన కేఎస్ జవహర్‌రెడ్డి, జగన్ వద్ద పని చేసిన మరో కీలక అధికారి ధనుంజయరెడ్డి కలిసి విశాఖ, భీమిలి, వాటి పక్కనే ఉన్న భోగాపురంలో భారీగా అసైన్డ్, ఇనాం భూములు కొన్నారు. విశాఖ, భీమిలి, ఎండాడ, పరవాడ తదితర ప్రాంతాలను సాయిరెడ్డి చెరబట్టారు. కంటికి కనిపించిన భూములను చేజిక్కించుకున్నారు. నాటి సీఎస్ జవహర్‌రెడ్డి, ఆయన వారసుడు ఈ భూపందేరం నిర్వహించారు. రాత్రిళ్లు అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేయించడం, తెల్లారేసరికి ఆ భూములను చేజిక్కించుకోవడమే పనిగా ఆయన కుమారుడు, మేనల్లుడు భూయజ్ఞం నిర్వహించారు. ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు కూడా విశాఖలోని విలువైన ఇనాం, అసైన్డ్ భూములను చేజిక్కించుకున్నారు. బలవంతపు సెటిల్‌మెంట్లు కూడా చేశారు. వైసీపీ నేతల భూ దోపిడీపై నాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, జనసేన పెద్ద పోరాటమే చేశాయి. విశాఖను కాపాడాలని ఉద్యమాలు చేశాయి. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు 'సేవ్ విశాఖ' అంటూ నినదించారు. తాము అధికారంలోకి వస్తే భూములు కాపాడతామని ప్రకటించారు. పేదల భూములు వారికి ఇప్పిస్తామన్నారు. వైసీపీ అరాచకాలపై విసిగిపోయిన ప్రజలు టీడీపీ కూటమికి పట్టం కట్టారు. అధికారంలోకి రాగానే మదనపల్లెలో జరిగిన ఫైళ్ల 'దహనం'తో ఉలిక్కిపడిన సర్కారు అసైన్డ్, ఇనాం, షరతుగల పట్టా భూముల ఫ్రీహోల్డ్‌పై విచారణకు ఆదేశించింది. దీంతో సహజంగానే విశాఖలో జగన్ జమానాలో జరిగిన భూముల అక్రమాలు బయటకొస్తాయని అంతా అనుకున్నారు.

### సీన్ రివర్స్..

రాష్ట్రవ్యాప్తంగా అసైన్డ్, ఇనాం భూముల్లో అక్రమాలను గుర్తించేందుకు... డిప్యూటీ కలెక్టర్ ర్యాంకు అధికారులతో విచారణ కమిటీలు ఏర్పాటు చేయించి.. అనుమానాలున్న ప్రతి మండలంలో భూమి రికార్డులు పునఃపరిశీలన చేయించారు. రాష్ట్రవ్యాప్తంగా 13 లక్షల ఎకరాల భూముల రికార్డులను పరిశీలించగా... అందులో 5.65 లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్ చేయడంలో అక్రమాలు జరిగాయని లెక్కతేలింది. చిత్రంగా... విశాఖలో మాత్రం ఎలాంటి అక్రమం జరగలేదని తేల్చారు. సెంటు భూమి కూడా పరాధీనం కాలేదని నిరుడు అక్టోబరులో అధికారులు నివేదిక ఇచ్చారు. ఇది బయటకు రావడంతో చంద్రబాబు ప్రభుత్వం ఉలిక్కిపడింది. డిసెంబరులో అధికారులు రెండో దఫా విచారణ జరిపారు. మరీ ఏబీ జరగలేదంటే ఏమైనా అనుకుంటారని కాబోలు.. ఓ 64 ఎకరాలను జీవో 596కి విరుద్ధంగా ఫ్రీ హోల్డ్ చేశారని తేల్చారు. అయితే ఆ భూమి పదిలంగానే ఉందని, ఎలాంటి రిజిస్ట్రేషన్‌లు జరగలేదని నివేదించారు. రాష్ట్రంలో ఎక్కడా అనుమానాలు, ఆరోపణలు లేనిచోట పరిశీలన జరిపితేనే వేలాది ఎకరాలు చేతులు మారినట్లుగా తేలింది. అలాంటిది ఐదేళ్లు వైసీపీ నేతల చెరలో ఉన్న విశాఖ జిల్లాలో ఏ అక్రమమూ లేదని అధికారులు తేల్చడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. విశాఖ భూ దందాలో వైసీపీ నేతలు, ఉన్నతాధికారు పాత్ర సుస్పష్టం. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే విశాఖ రాజధాని అవుతుందన్న నమ్మకంతో తాము పోగేసిన అక్రమ సంపాదనను భూములపై ఖర్చుపెట్టారు. కానీ... వారు అనుకున్నదొకటి, అయ్యిందొకటి! విచారణలో ఈ విషయాలు బయటకు రావడం ఆ నేతలకు, అధికారులకు ఇష్టం లేదు. అప్పుడు విజయసాయిరెడ్డితో అంటకాగి.. అక్రమాలకు పాల్పడిన అధికారులను కాపాడేందుకు కూటమిలోని కొందరు సీనియర్లు రంగంలోకి దిగారని... వారివల్లే భూస్కాంపై విచారణ అటకెక్కిందని ప్రచారం జరుగుతోంది. భూ రికార్డుల పరిశీలన, విచారణ బృందాల్లో అంతా సొంత మనుషులే ఉండేలా జాగ్రత్త తీసుకుని అక్రమాలకు సమాధి కట్టినట్లు తెలుస్తోంది. ఇంకోసారి విచారణ జరిపించినా నివేదికలు ఆశిస్తాయనుకోవడం భ్రమేనని విశాఖ ప్రముఖులు అంటున్నారు.

### 'పంచ' గ్రామాల సమస్యకు పరిష్కారం!

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సింహాచలం పంచ గ్రామాల సమస్యకు చంద్రబాబు త్వరలో పరిష్కారం చూపనున్నారు. ఆయన ఈ వ్యవహారంలో రెవెన్యూ, దేవదాయ శాఖల అధికారులతో కీలక సమీక్ష నిర్వహించారు. పంచగ్రామాల్లో 12,149 ఇళ్లను క్రమబద్ధీకరించాలని నిర్ణయించారు. దీనికి ప్రత్యామ్నాయంగా రూ.5,300 కోట్ల విలువైన 610 ఎకరాల ప్రభుత్వ భూమిని సింహాచలం దేవస్థానానికి ఇవ్వనున్నారు. ఈ నిర్ణయానికి సింహాచల దేవస్థానం అనువంశిక ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు కూడా ఆమోదం తెలిపారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు 338, 296 జీవోలు జారీ చేసింది. ఈ జీవోల కింద విశాఖలో 70వేల మంది క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. వీటి ప్రకారం రెండేళ్లలో ఆ భూములపై లబ్ధిదారులకు సర్వ హక్కులు లభించేలా కన్వేయన్సు డీడ్ కూడా ఇవ్వాల్సి ఉంది. అయితే జగన్ ప్రభుత్వం ఈ జీవోలను తుంగలో తొక్కింది. లబ్ధిదారులకు న్యాయం చేయకపోగా.. వైసీపీ నేతలు వారిని బెదిరించి ఆ భూముల్లో చాలామటుకు కాజేసే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో ఈ సమస్యను పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యేలు కోరడంతో సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. 2017లో జీవో జారీ చేసిన నేపథ్యంలో అప్పటి నుంచే ఈ భూములను క్రమబద్ధీకరించాలని, అప్పటి నుంచి రెండేళ్లలో కన్వేయన్సు డీడ్‌లు కూడా జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదేవిధంగా రైతులు సాగు చేసుకునే భూములు, కొన్ని ఖాళీ స్థలాలకు సంబంధించి కోర్టులో పలు కేసులు ఉన్నాయి. వాటిని కూడా దశలవారీగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోనుంది. పట్టణ భూగరిష్ఠ పరిమితి (యూఎల్‌సీ)కి మించి అదనపు భూములు ఏవైనా ఆక్రమణకు గురైనా, వాటిని పీవోటీ చట్ట ప్రకారం పదేళ్లలో అలియనేట్(స్వాధీనం) చేయాల్సి ఉంది. వీటికి కూడా కన్వేయన్సు డీడ్స్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.




happy
Ugadi
Date, History, Significance,
Celebrations & Wishes


THIS
FESTIVE SEASON
WEAR YOUR
ROYAL CHARM!
FLAT
5% OFF*
ON GOLD JEWELRY
FLAT
30% OFF*
ON DIAMOND JEWELRY
Offer valid till 4th May 2025
PNG
JEWELERS
*T&C Apply
FACETIME US AT 408-245-6764 FOR VIRTUAL SHOPPING. VISIT THE SUNNYVALE STORE. VISIT WWW.PNGJEWELERS.COM



# సమర్థుడికీ, అసమర్థుడికీ తేడా!



- ఐదేళ్ల విధ్వంసం తర్వాత క్రమంగా గాడినపడుతున్న నవ్యాంధ్ర
- పోలవరం నిర్మాణం చకచకా
- అమరావతిని కాదన్న సంస్థ నుంచే వేల కోట్లు
- ఆగిపోయిన రైల్వేజోన్ పరుగులు
- ప్రైవేటీకరణ భయంలో ఉన్న విశాఖ స్టీల్‌కు భారీ ప్యాకేజీ

ప్రజాసేవలో సామర్థ్యాన్ని చాటుకోవాలి. లేదంటే తప్పుకోవాలి. ఈ రెండూ జరక్కపోతే జనాలే ఇంటికి పంపిస్తారు. ఇందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రత్యక్ష ఉదాహరణ. రాష్ట్రానికి, ప్రజలకు రక్షణ కవచంలా ఉండాల్సిన నాయకుడు.. తన స్వప్రయోజనాల కోసమే పరిపాలిస్తే ఎలా ఉంటుందో ఆయన చూపించారు. కానీ చంద్రబాబు మాత్రం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ఒక పద్ధతిగా, ప్రణాళికాబద్ధంగా నెరవేరుస్తూ పోతున్నారు. అసమర్థ ముఖ్యమంత్రికీ, సమర్థ ముఖ్యమంత్రికీ గల తేడాను కేవలం 6 నెలల్లోనే చంద్రబాబు చూపించారు. జగన్ అమరావతిని చంపేసి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారు. అభివృద్ధి కోసం అప్పులిస్తామన్న ప్రపంచబ్యాంకును వెనక్కిపంపేశారు. పోలవరం ప్రాజెక్టును ధ్వంసం చేశారు. జాతీయ ప్రాజెక్టు కాబట్టి కేంద్రానిదే తుదినిర్ణయమంటూ కనీసం పరిహారం కూడా ఇవ్వకుండా పారిపోయారు. జోనల్ కార్యాలయం కోసం స్థలం కేటాయిస్తే పట్టాలెక్కే రైల్వే జోన్‌ను ఐదేళ్లపాటు నిర్లక్ష్యం చేశారు. రైల్వే శాఖ ఎన్నిసార్లు అడిగినా భూములివ్వకుండా ఉత్తరాంధ్రకు తీరని ద్రోహం చేశారు. తీవ్రమైన అప్పుల్లో కూరుకుపోయిందంటూ విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తామన్న కేంద్రం ప్రతిపాదనపై జగన్ మౌనంగా ఉన్నారు. అస్మదీయులకు పెండింగ్ బిల్లుల రూపంలో వేల కోట్లు దోచిపెట్టిన జగన్ చిన్నాచితకా కాంట్రాక్టర్లు, వెండర్లకు బిల్లులు చెల్లించకుండా మోసం చేశారు. పోలవరం, అమరావతి, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, రైల్వేజోన్, పెండింగ్ బిల్లుల అంశాల్లో చంద్రబాబు సూపర్ సక్సెస్ అయ్యారు. పోలవరం నిర్వాసితుల ఖాతాల్లో పరిహారం ప్యాకేజీ డబ్బులు వేశారు. పోలవరం పనులు జరుగుతున్నాయి. అమరావతి

మునిగిపోతుందన్న కారణంతో అప్పులివ్వడం మానేసిన ప్రపంచబ్యాంకు నుంచే రూ.6,800 కోట్ల అప్పులు తెస్తున్నారు. రైల్వే జోన్‌ను పట్టాలెక్కించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపడమే కాకుండా రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ సాధించారు. ఇన్ని ఆర్థిక కష్టాల్లో ఉండి కూడా సంక్రాంతి సందర్భంగా రూ.6,700 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించారు.

### అసమర్థుడి ఢిల్లీ యాత్ర..

జగన్ సీఎంగా ఉన్నప్పుడు తరచుగా ఢిల్లీ వెళ్లేవారు. ఐదేళ్లపాటు దాదాపు ఒకేరకం ప్రతిపాదనలతో ఉన్న పేపర్లను జగన్ మీడియాకు మాత్రమే విడుదల చేసేవారు. ప్రధాని మోదీకో, కేంద్ర మంత్రులకో ఇచ్చేవారు కాదు. రాష్ట్ర ప్రయోజనాల గురించి చర్చించే వారు కాదు. కేవలం తనపై, తన తమ్ముడు వైఎస్ అవినాశ్‌రెడ్డిపై కేసులు, కోర్టు తీర్పులు ముంచుకురాకుండా రక్షణ కల్పించాలని మాత్రమే కేంద్రాన్ని కోరేవారు. అవే జరిగేవి. అందుకే రాష్ట్ర ప్రయోజనాల గురించి కేంద్రాన్ని అడిగే ధైర్యం జగన్‌కు ఉండేది కాదు. కానీ ఈ 6 నెలల్లో చంద్రబాబు అనేక సార్లు రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీ వెళ్లారు. ప్రధాని, కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. పోలవరానికి డబ్బు, అమరావతికి అప్పు, రైల్వేజోన్ ప్రారంభం, స్టీల్‌ప్లాంట్‌కు నిధులు అన్నీ సాధించారు. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వంలో టీడీపీ భాగస్వామి. 2019–24లో వైసీపీ ప్రభుత్వం ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామి కాకపోయినప్పటికీ బయటి నుంచి సంపూర్ణ మద్దతు ఇచ్చారు. రాజ్యసభలో ఎన్డీయేకి బేషరతుగా అన్ని బిల్లులకూ మద్దతిచ్చారు. ఇందుకు బదులుగా రాష్ట్రానికి









ఏమైనా ఇవ్వాలని ప్రధాని మోదీని అడగలేదు. తనపై సీబీఐ, ఈడీ కేసులు విచారణకు రాకుండా చూసుకోవడం.. చిన్నాన్న హత్య కేసులో అవినాశ్‌రెడ్డి అరెస్టు కాకుండా అడ్డుకోవడం.. ఇదే ఆయన చేసిన పని. రాష్ట్రాన్ని గాలికొదిలేశారు. 2019 ఎన్నికల ముందు ప్రత్యేక హోదా కోసం తన లోక్‌సభ ఎంపీలతో రాజీనామా చేయించిన జగన్.. అధికారంలోకి వచ్చాక కేంద్రంపై ఏ కోశానా ఒత్తిడి తేలేదు.

### పోలవరానికి పండుగ

పోలవరం ప్రాజెక్టుకు ఇటీవల పరిహారం, భూసేకరణ, నిర్మాణ పనుల నిమిత్తం కూటమి ప్రభుత్వం రూ.996.47 కోట్ల మేర చెల్లించింది. పునరావాస కాలనీల నిర్మాణ కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు కూడా చెల్లిస్తున్నారు. 90 శాతం వరకు పరిహారం పంపిణీ పూర్తి చేశారు. స్థిరాస్థి విలువలు కూడా చాలా వరకు ప్రభుత్వం చెల్లించింది. మిగిలిన భూములను సేకరించి వాటికి పరిహారం అందజేత, తదితర అంశాలను పూర్తి చేసేందుకు అధికారుల్ని నియమించింది. గత ఏడాది డిసెంబరు 17వ తేదీన పోలవరం వచ్చిన సీఎం చంద్రబాబు ఖాళీలను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా ఏలూరు, అల్లూరి జిల్లాల్లో ఆర్ అండ్ ఆర్, భూసేకరణ విభాగాలకు అధికారుల నియామకాన్ని పూర్తి చేశారు.

జగన్ హయాంలో ఐదేళ్లూ కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసినా పరిహారం అందలేదు. ఎకరాకు అదనంగా రూ.10 లక్షలు చెల్లిస్తానని హామీ ఇచ్చారు. ఆర్భాటాలేమీ లేకుండా కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. బ్యాంకు మెసేజ్‌లు చూసుకుని గిరిజనులు ఆనందంలో మునిగిపోయారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు పోలవరం ప్రాంతం ముంపుప్రాంతానికి వరదలొచ్చినప్పుడు పర్యటించారు. నష్టపరిహారంపై ప్రకటన చేస్తారని బాధితులంతా ఆశించారు కానీ కేంద్రం నిధులు ఇస్తేనే పరిహారం చెల్లిస్తానని, లేదంటే తాను చేసేదేమీ లేదని నిస్సిగ్గుగా







చేతులెత్తేశారు.

### రైల్వే జోన్‌పై స్పష్టమైన నిర్లక్ష్యం

విభజన చట్టంలో స్పష్టమైన హామీ ఉన్నప్పటికీ రైల్వేజోన్ ఏర్పాటును వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. విశాఖ ముడసర్లోవ వద్ద స్థలం అప్పగిస్తే జోన్ కార్యాలయం ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు రైల్వే శాఖ పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదు. అయితే చంద్రబాబు అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే ప్రభుత్వం రైల్వేజోన్ ఏర్పాటును కార్యరూపంలోకి తెచ్చారు. ముడసర్లోవ వద్ద స్థలం అప్పగించడం.. ప్రధాని మోదీ వచ్చి శంకుస్థాపన చేయడం.. ఆ వెంటనే రైల్వేశాఖ జోనల్ కార్యాలయం నిర్మాణానికి టెండర్లు పిలవడం, భవనాల డిజైన్లపై డీపీఆర్ సమర్పించడం చకాచకా జరిగిపోయాయి. బిడ్లు ఖరారు కాగానే నిర్మాణ పనులు మొదలుకానున్నాయి.

### స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు జగన్ సై

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీని ప్రకటించింది. చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారీ ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కు మంత్రి కుమారస్వామితో సమావేశమై స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణ కోసం చర్చలు జరుపుతూనే ఉన్నారు. ఇటీవల ప్రధానిని కలిసినప్పుడు కూడా విశాఖ ఉక్కుకు ఆర్థికసాయం చేయాలని కోరారు. కుమారస్వామిని స్వయంగా విశాఖ ప్లాంటుకు తీసుకొచ్చారు. కేంద్రం ప్యాకేజీతో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశం వెనక్కి వెళ్లిపోయింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా 75 వేల మందికి ఉపాధి కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకణను జగన్ ఏ దశలోనూ ఆపే ప్రయత్నం చేయలేదు. పైగా దానిని జిందాల్‌కు కట్టబెట్టడానికి తొలుత సాయం చేశారు. ఆనక అదానీ రంగ ప్రవేశంతో అటువైపు పావులు కదిపారు. రాజ్యసభలో ఎన్డీయేకి మద్దతిచ్చిన జగన్ తనకున్న ఎంపీలతో కలిసి గట్టిగా ప్రశ్నిస్తే ప్రైవేటీకరణ ఆగేది. కానీ కేసుల భయంతో ఆ పనిచేయలేదు.





నమస్తే ఆంధ్ర.కామ్
VOICE OF TELUGU PEOPLE
NAMASTEANDHRA.COM
FOR THE STATE # OF THE STATE # BY THE STATE
MAR 2025

# టీ-బీజేపీలో అసమ్మతి

## రాష్ట్ర అధ్యక్షుడి నియామకంలో జాప్యంతో అసహనం



అత్యంత క్రమశిక్షణ కలిగిన పార్టీగా గుర్తింపు ఉన్న బీజేపీలో సైతం.. తెలంగాణలో అసమ్మతి స్వరాలు వినిపిస్తున్నాయి. నాయకత్వం మాత్రమే పార్టీ విధానాలను వెల్లడించే బీజేపీలో నేతలు సొంత అభిప్రాయాలను, అది కూడా మీడియా ముందు వెల్లడిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో కమలం పార్టీలో గ్రూపులు తయారయ్యాయి. అంతా ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అయితే ఇందుకు ప్రధాన కారణం.. రాష్ట్ర పార్టీకి పూర్తి స్థాయి అధ్యక్షుడిని నియమించడంలో జరుగుతున్న జాప్యమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు దాకా తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా వ్యవహరించిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్.. పార్టీని రాకెట్ వేగంతో పరుగులు పెట్టించారు. నాటి అధికార పార్టీ అయిన బీఆర్ఎస్ పై, అప్పటి సీఎం కేసీఆర్ పై పదునైన విమర్శలు చేయడం, వ్యవహార శైలిలో దూకుడు ప్రదర్శించడం, ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వ్యక్తిగా, బలమైన హిందుత్వ వాదిగా ముద్ర ఉండడంతో పార్టీ శ్రేణులను తక్కువ సమయంలోనే ఆకట్టుకోగలిగారు. దానికితోడు రాష్ట్రంలో పాదయాత్ర కూడా చేయడం ద్వారా కార్యకర్తలకు దగ్గరయ్యారు. ఫలితంగా రాష్ట్రంలో బీజేపీ కూడా బలపడింది. ఆ ఊపు అలాగే కొనసాగి ఉంటే.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఇప్పటికన్నా మరింత మెరుగైన ఫలితాలు సాధించి ఉండేది. కానీ, ఎవరూ ఆ ఎన్నికలకు ముందు జాతీయ నాయకత్వం అనూహ్యమైన నిర్ణయం తీసుకుంది. అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్‌ను తప్పించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఆ బాధ్యతలు అప్పగించింది.

కిషన్ రెడ్డి నియామకం పట్ల పార్టీలో ఎవరికీ వ్యతిరేకత లేకపోయినా.. దూకుడుగా సాగుతున్న బండి సంజయ్‌ను తొలగించడం శ్రేణులను అసంతృప్తికి గురి చేసింది. చివరికి 2023 ఎన్నికల్లో బీజేపీకి రావాల్సినన్ని ఎమ్మెల్యే సీట్లు రాలేదు. కేవలం 8 సీట్లతో ఆ పార్టీ సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆ తరువాత 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ తెలంగాణలో 8 ఎంపీ సీట్లు గెలుచుకున్నా.. అవి పూర్తిగా ప్రధాని మోదీ కరిష్మా కారణంగానే దక్కాయి. అయితే ఆ ఎన్నికలు ముగిసి ఇన్నాళ్లయినా, కిషన్ రెడ్డి మరోసారి కేంద్ర మంత్రి అయినా.. రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను మాత్రం ఆయనే నిర్వర్తిస్తున్నారు. కానీ, కేంద్ర క్యాబినెట్ మంత్రిగా ఆయన నిర్వర్తించాల్సిన బాధ్యతలు ఉండడంతో పూర్తి స్థాయిలో పార్టీని సమర్థంగా నడిపించలేకపోతున్నారనే విమర్శ ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర పార్టీకి కొత్త అధ్యక్షుడిని నియమిస్తారని చాలా కాలంగా ప్రచారం జరుగుతున్నా.. జాతీయ నాయకత్వం





మాత్రం దీనిని ఎప్పటికప్పుడు నాన్చుతూ వస్తోంది. ఫలితంగా రాష్ట్రంలో బీజేపీ శ్రేణుల్లో నిస్తేజం నెలకొంది. కొత్త అధ్యక్షుడు రావాలని, పార్టీని పరుగులు పెట్టించాలని వారు కోరుకుంటున్నారు. త్వరలో జీహెచ్ఎంసీ సహా రాష్ట్రంలో మునిసిపల్, స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో త్వరగా సారథిని నియమించాలని ఎదురుచూస్తున్నారు.

తెలంగాణ కమల సారథిగా పలువురు నేతల పేర్లు ఎప్పటికప్పుడు ప్రచారంలో ఉంటున్నా.. అధినాయకత్వం మాత్రం ఎటూ తేల్చుకోలేకపోతోంది. అధ్యక్ష పదవిపై చాలా మంది సీనియర్ నేతలు ఆశలు పెట్టుకోవడంతో ఎవరిని వరించేది ఉత్కంఠగా మారింది. మరోవైపు కొందరు నేతలు పార్టీ అధ్యక్ష పదవిపై అంతర్గత సమావేశాల్లో మాట్లాడుతుండగా.. మరికొందరు మాత్రం బహిరంగంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఏకంగా మీడియాకు ఎక్కారు. కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునేది రాష్ట్ర కమిటీనా, జాతీయ నాయకత్వమా? అని ప్రశ్నించారు. అంతేగాక, తెలంగాణ బీజేపీ రాష్ట్ర కమిటీ నిర్ణయిస్తే కొత్త అధ్యక్షుడు రబ్బరు స్టాంప్‌గానే ఉంటారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ కొత్త అధ్యక్షుడిని జాతీయ కమిటీ నిర్ణయిస్తేనే బాగుంటుందన్నారు. గత అధ్యక్షుడు పార్టీలో గ్రూపులు తయారు చేసుకుని పార్టీకి నష్టం చేశారని ఆరోపించారు. బీజేపీ సీనియర్ నాయకులను, జైలుకెళ్లిన కార్యకర్తలను పక్కన పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చే అధ్యక్షుడు కూడా ఇలాగే గ్రూపులను ప్రోత్సహిస్తే పార్టీకి నష్టమని, ప్రస్తుతం పార్టీలో మంచి నాయకుల చేతులు కట్టి పడేశారని అన్నారు.

పార్టీలో సీనియర్ నాయకులకు స్వేచ్ఛ ఇస్తే తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం వస్తుందని అన్నారు. అంతటితో ఆగకుండా.. పార్టీ కొత్త అధ్యక్షుడు తెలంగాణ ముఖ్యమంత్రితో రహస్య భేటీలు నిర్వహించవద్దంటూ పరోక్షంగా ప్రస్తుత అధ్యక్షుడు కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డితో స్నేహం ఉందన్నారు. సీనియర్ నేతలు, కార్యకర్తల మనసులో మాటనే తాను బయటపెడుతున్నానని చెప్పారు. ఇలాంటి విషయాలను పార్టీ నేతలకు చెప్పాలే తప్ప మీడియాకు చెప్పవద్దని కొందరు అంటున్నారని, కానీ.. పార్టీ పెద్దల దృష్టికి తీసుకువెళ్లినా వినకపోవడం వల్లే ప్రజల ముందు పెట్టాల్సి వస్తోందని అన్నారు.

మరోవైపు ఆర్మూరు ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి.. తెలంగాణలో పొత్తుల గురించి మీడియా ముందే వ్యతిరేకతను వ్యక్తం చేశారు. తెలంగాణలోనూ బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి కూటమిగా పనిచేస్తాయని, రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలతోపాటు స్థానిక ఎన్నికలు, ఆ తరువాత 2028 అసెంబ్లీ ఎన్నికల వరకు కూటమి కొనసాగుతుందనే ప్రచారం మొదలైంది. అయితే ఇది సాధ్యమా, కాదా అన్న విషయంపై బీజేపీ నాయకత్వం స్పందించక ముందే ఆ పార్టీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి తన వ్యతిరేకతను వ్యక్తపరిచారు. ఇలా రేపు మరో అంశంపై మరో నేత, ఆ తరువాత మరికొందరు నేతలు అసమ్మతి గళం వినిపించే అవకాశాలు లేకపోలేదు. ఇలాంటి విషయాల్లో కఠినంగా వ్యవహరించే బీజేపీ నాయకత్వం నుంచి మాత్రం ఇంకా ఎటువంటి స్పందన రావడంలేదు. దీంతో బీజేపీ కూడా కాంగ్రెస్ అడుగు జాడల్లో నడుస్తుందా అంటూ అందరూ ఆశ్చర్యపోతున్నారు.



## కొలికపూడిని ఏం చేద్దాం?

ఇటీవలికాలంలో తరచుగా వివాదాలు, విమర్శలతో వెలుగులోకి వస్తున్న తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు.. తాజాగా మరో వివాదానికి కేంద్రంగా మారారు. సీనియర్ నాయకుడు, టీడీపీ యువ నేత రమేష్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నది ఆయన డిమాండ్. ఆయనతో ఏదైనా సమస్య ఉంటే.. పార్టీలో అంతర్గతంగా చర్చించుకుని పరిష్కరించుకునే అవకాశం ఉందని పార్టీ సీనియర్ నేతలు.. సాక్షాత్తూ సీఎం చంద్రబాబు చెబుతున్నా కూడా కొలికపూడి వినట్లేదని సమాచారం. " కొలికపూడి తానే 'సర్వంసహా చక్రవర్తి' అనుకుంటున్నారో.. లేక తాను ఏం చేసినా ఫర్వాలేదని విర్రవీగుతున్నారో మాకు అర్థం కావడం లేదు. ఇలాంటివారు పార్టీకి చెద పురుగుల లాంటివారు" అని తిరువూరుకే చెందిన నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు. తిరువూరులో సర్పంచ్ భార్య ఆత్మహత్యాయత్నం, రైతులు, జర్నలిస్టులు, ప్రత్యర్థులలపై ఎమ్మెల్యే చేస్తున్న వ్యాఖ్యలు.. ఇలా కొలికపూడి వివాదాల విషయంలో తొలి నుంచీ ఓపిక పడుతూ వస్తున్న చంద్రబాబు.. తాజా వివాదంతో సీరియస్ అయ్యారు. ఎట్టి పరిస్థితిలోనూ ఈ దఫా కొలికపూడిని వదిలేది లేదన్నట్టుగానే చంద్రబాబు వ్యవహరించే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్నమాట. ఇప్పటికే నాలుగు సార్లకు పైగా.. చంద్రబాబు ఆయనకు అవకాశం ఇచ్చారు. అప్పట్లో ప్రతి సందర్భంలోనూ పార్టీ సీనియర్లు ఆయనకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయిన ప్పటికీ కొలికపూడి మారలేదు. ఆయనలో కించిత్తు మార్పు కూడా రాలేదు. దీంతో ఇప్పుడు పార్టీ ఆయనను మార్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఎస్సీ నాయకుడు, ఎన్నికలకు ముందు పలు టీవీ డిబేట్లలో టీడీపీని సమర్థిస్తూ, జగన్ సర్కారు చేసిన తప్పులను ధైర్యంగా విమర్శించిన కొలికపూడికి చంద్రబాబు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం ద్వారా పెద్ద గుర్తింపే ఇచ్చారు. తిరువూరు టికెట్‌ను.. సౌమ్యుడు, మాజీ మంత్రి జవహర్ ఆశించినా.. ఆయనను పక్కన పెట్టి మరీ కొలికపూడికి ఇచ్చారు. గెలిపించుకున్నారు. కట్ చేస్తే.. ఇప్పుడు ఆయన కొరకరాని కొయ్యగా మారడం పార్టీని ఇబ్బంది పెడుతోంది. అలాగని ఇప్పుడు ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నా.. లేక క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నా పలు ఇబ్బందులున్నాయి. ఎస్సీ సామాజిక వర్గంపై చంద్రబాబు చర్యలు తీసుకున్నారన్న ప్రచారం తెరమీదకు వస్తుందన్న ఆందోళన ఒకవైపు ఉంది. అలాగని వదిలేస్తే.. మరింత మంది రెచ్చిపోయేందుకు కొలికపూడి దారి చూపినట్టు అవుతుందన్న బెంగా ఉంది. ఈ రెండు పరిణామాలతో అటు చర్యలు తీసుకోలేక.. ఇటు.. మౌనంగా ఉండలేక చంద్రబాబు మథన పడుతున్నారన్నది వాస్తవం.


NAC JEWELLERS
X
PATTERNS
HYDERABAD
PRESENTED BY
TATTVA
EXHIBITS
SONESTA SILICON VALLEY
1820 BARBER LN
MILPITAS
APR' 25 - 12th & 13th
11:00 AM to 7:00 PM
1820 Barber Ln, Sonesta Silicon Valley
MILPITAS
APR' 25
12th & 13th
11:00 AM to 7:00 PM



# ‘తాడేపల్లి’ ముందు ఢిల్లీ స్కాం దిగదిడుపే!

లిక్కర్ తయారీ నుంచి ఆర్డర్ల వరకు అంతా మాఫియా తీరులోనే!!

చిన్న ఉద్యోగి నుంచి ఎండీ దాకా పాత్రధారులే

వైసీపీ ఎంపీ, మాజీ సలహాదారు ప్రమేయంపై ఆధారాలు

నాటి ఎండీ వాసుదేవరెడ్డి సహా ఐదుగురి వాంగ్మూలాలు కోర్టులో నమోదు

సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే మాజీ సీఎం జైలుకే!!

ఐదేళ్ల మద్యం, ఇసుక, గనుల మాఫియా ఉచ్చులో చిక్కుకున్న నవ్యాంధ్ర.. ఇప్పుడిప్పుడే వాటి కబంధ హస్తాలను విడిపించుకునే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా అరవింద్ కేజ్రీవాల్‌ను రాజకీయంగా భూస్థాపితం చేసిన ఢిల్లీ లిక్కర్‌ను తలదన్నే రీతిలో తాడేపల్లి ప్యాలెస్ మద్యం మాఫియా దోపిడీ సాగించిన వైనం బయటపడింది. జగన్ హయాంలో జరిగిన లిక్కర్ స్కాంలో సంచలనాలు వెలుగులోకి వస్తున్నాయి. నాసిరకం మద్యంతో వేల కోట్లు దోచుకోవడమే గాక లక్షలాది మంది జీవితాలను నాశనం చేశారు. మద్యం కొనుగోలు ఆర్డర్ల నుంచి సరఫరా, కమీషన్ల వరకూ ఇప్పటికే కొందరి పేర్లు బయటపడగా.. ఈ భాగోతంలో ప్రైవేటు వ్యక్తులు, చిరు ఉద్యోగుల పాత్రపైనా ఆశ్చర్యం గొలిపే వ్యూహాలు బయట పడుతున్నాయి. రూ.వేల కోట్లు వసూలు చేసిన వైసీపీ కీలక ప్రజాప్రతినిధి మొదలుకొని సాధారణ కంప్యూటర్ ఆపరేటర్ వరకూ ఎవరి స్థాయిలో వారు మందుబాబుల రక్తాన్ని పీల్చేశారు. మద్యం షాపుల్లో ఆర్డర్లు పెట్టినట్లు చెబుతున్న కంప్యూటర్లు, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్‌లో సీజ్ చేసిన కంప్యూటర్లు, హార్డ్ డిస్కుల వరకూ అన్నింటినీ ల్యాబ్‌కు పంపి రిపోర్ట్ తెచ్చుకున్న ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్).. వాటిలోని వివరాలు చూసి అవాక్కవుతోంది. సమాచారం అందుకున్న ప్రభుత్వ పెద్దలు.. ఇంత పకడ్బందీగా దోపిడీ చేశారా అంటూ ముక్కున వేలేసుకున్నారు. ఇప్పటికే కొందరు కీలక అధికారులు, వ్యక్తుల వాంగ్మూలాలను సిట్ అధికారులు కోర్టులో న్యాయాధికారి ముందు రికార్డు చేశారు. తాడేపల్లి ప్యాలెస్‌లో అడుగుపెట్టేందుకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. జగన్ మరోసారి జైలుపాలయ్యే అవకాశాలు మెండుగా ఉంటాయని ఉన్నత స్థాయి ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### ఖజానాకు 18,860 కోట్ల నష్టం

అధికారంలోకి వస్తే మద్య నిషేధాన్ని అమలు చేస్తామని 2019 ఎన్నికలకు ముందు మాటిచ్చి.. తీరా గద్దెనెక్కాక మడమ తిప్పి వంచించిన జగన్.. అంతటితో ఆగకుండా కూలీలు, నిరుపేదలు తాగే చీప్ లిక్కర్ నుంచి కూడా వేల కోట్ల రూపాయలు కమీషన్ల రూపంలో దండుకున్నారు. ఆ ఐదేళ్లలో ప్రభుత్వ ఖజానాకు 18,860కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఈ భారీ కుంభకోణంలో వైసీపీ నేతలు ఒక్కో మద్యం కేసుపై రూ.150 నుంచి 200 వరకూ కమీషన్ రూపంలో మేసింది రూ.4వేల కోట్లకు పైమాటేనని సమాచారం. మిగిలిన రూ.10 వేల కోట్లు ఎక్కడకు వెళ్లాయనేది పెద్ద క్వశ్చన్‌మార్క్. ఈ డబ్బంతా తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లినట్లు వాంగ్మూలాలు ఇచ్చిన సిబ్బంది వెల్లడించినట్లు సమాచారం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనంతగా మద్యం ధరలు విపరీతంగా పెంచేసి నిరుపేదల కష్టాన్ని కొల్లగొట్టి తాడేపల్లి ప్యాలెస్‌లోని గదులను నోట్ల మూటలతో నింపినట్లు తెలుస్తోంది. ఈ దోపిడీలో ప్రస్తుత వైసీపీ పార్లమెంటు సభ్యుడితో పాటు అదే పార్టీలో నిన్నమొన్నటిదాకా చక్రం తిప్పిన మాజీ ఎంపీ కూడా క్రియాశీలంగా వ్యవహరించినట్లు ఆధారాలు లభించాయి. వారితోపాటు బేవరేజెస్ కార్పొరేషన్‌లో కీలక స్థానాల్లో ఉన్న అధికారుల నుంచి చిన్న ఉద్యోగి అయిన డేటా ఎంట్రీ ఆపరేటర్ వరకూ ఎవరి పాత్ర ఏమిటో ఐదుగురు ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తులు పూసగుచ్చినట్లు విజయవాడ కోర్టులో వివరించారు. వీరిలో కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, స్కాంలో కీలకంగా వ్యవహరించిన డిప్యూటీ కమిషనర్ సత్యప్రసాద్, ఎస్ఎన్‌జే షుగర్స్ అండ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఉద్యోగి, వైసీపీ హయాంలో రైల్వే శాఖ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చి ఎన్నికల తర్వాత తిరిగి వెళ్లిన రమేశ్‌కుమార్‌రెడ్డి, కార్పొరేషన్ కార్యాలయంలో ఏరికోరి సీనియర్ ఐఏఎస్ అధికారి నియమించిన డీటీపీ ఆపరేటర్ అనూష కోర్టులో వాంగ్మూలాలు ఇచ్చారు. వీరిలో సత్యప్రసాద్ ఒక్కరే న్యాయమూర్తి ఎదుట సుమారు 3 గంటల పాటు సుదీర్ఘంగా వాంగ్మూలం ఇచ్చినట్లు తెలిసింది. గత నెలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ అన్నీ గుట్టుగా కూపీ లాగుతోంది. కీలక వ్యక్తుల ప్రమేయాన్ని ఆధారాలతో సేకరించి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిస్తోంది. ఈ భారీ స్కామ్‌లో డిస్టిలరీస్‌ను దౌర్జన్యంగా చేజిక్కించుకోవడం నుంచి ఎప్పుడూ వినని పేర్లతో నాసిరకం బ్రాండ్ల మద్యం తయారీ, సరఫరా, ఆర్డర్లు, కమీషన్ల వసూలు అంతా మాఫియా తరహాలో జరిగిందని తేల్చింది.

### చిన్న ఉద్యోగమే కానీ..!

కార్పొరేషన్లో అవుట్ సోర్సింగ్ ఆపరేటర్‌గా పనిచేసి అనూష పేరు కొత్తగా వెలుగులోకి వచ్చింది. సిట్ దర్యాప్తులో వెలుగు చూసిన అంశాల ఆధారంగా ఆమెను విచారించిన అధికారులు.. ఇటీవల కోర్టులో వాంగ్మూలం రికార్డు చేయించారు. ఇంత చిన్న ఉద్యోగి చేయగలిగింది ఏముంటుందని ఆరా తీస్తే.. నిబంధనల ప్రకారం మద్యం షాపుల్లో పనిచేసే సూపర్‌వైజర్లు ఆ షాపులకు ఏ రకమైన లిక్కర్ కావాలో ఇండెంట్ పెడతారు. అయితే జగన్ జమానాలో ఆ పని సూపర్‌వైజర్లు కాకుండా నేరుగా మద్యం డిపోల మేనేజర్ల ద్వారానే పెట్టించారు. ఏ రకమైన బ్రాండ్లకు ఇండెంట్లు పెట్టాలో కార్పొరేషన్లో పనిచేసిన రమేశ్‌కుమార్‌రెడ్డి సూచనలిచ్చేవారు. రోజువారి మద్యం అమ్మకాల వివరాలను అనూష హైదరాబాద్‌లోని కసిరెడ్డి సొంత మనిషి సైఫ్‌కు చేరవేసేది. ప్రభుత్వం నుంచి సదరు కంపెనీకి పేమెంట్ జరగ్గానే... కంపెనీలు కమీషన్ చెల్లించేవి. ‘ఫలానా రోజు, ఫలానా చోటకు రండి. అక్కడ మిమ్మల్ని కలిసే వ్యక్తికి కమీషన్ ఇచ్చి వెళ్లండి’ అని చెప్పగానే.. అత్యంత నాటకీయంగా చెల్లింపులు జరిగేవి.

### కంపెనీ కబ్జా..

లీలా మద్యం కంపెనీ యాజమాన్యాన్ని కసిరెడ్డి బెదిరించి లాక్కున్నట్లు సీఐడీకి ఫిర్యాదు

## సలహాదారు మద్యం వసూళ్లు

రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో భారీ స్థాయిలో సలహాదారులను నియమించుకున్న జగన్.. ఐటీ అడ్వయిజర్‌గా కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని పెట్టుకున్నారు. ఐటీ రంగంలో ఆయన సలహాలిచ్చారో లేదో తెలియదు గానీ.. మద్యం కమీషన్ల వసూళ్లలో మాత్రం ఆయన పాత్ర కీలకం. జగన్ అండ్ కోకు అత్యంత సన్నిహితుడైన కసిరెడ్డి పాత్ర ఈ కుంభకోణంలో ఉన్నట్లు ఏపీ సీఐడీ ఎప్పుడో ప్రాథమిక ఆధారాలు సేకరించింది. అయితే దర్యాప్తులో జాప్యం కారణంగా రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో ఐజీ ర్యాంకు అధికారి రాజశేఖర్‌బాబు నేతృత్వంలో ఏడుగురితో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందం ఆధారాలు సేకరిస్తున్న తరుణంలో వైసీపీలో కీలకంగా వ్యవహరించిన విజయసాయిరెడ్డి ఇటీవల విజయవాడలో సీఐడీ విచారణకు వచ్చినప్పుడు కసిరెడ్డే అన్నింటికీ సూత్రధారి అని కుండబద్దలు కొట్టారు. ఇప్పట్లో అన్ని విషయాలు చెప్పలేనని, త్వరలోనే అన్నీ చెబుతానని అనడంతో సిట్ అధికారులకు ఒక స్పష్టత వచ్చింది. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. మద్యం డిస్టిలరీస్ నుంచి ఆర్గనైజర్లు వసూలు చేసిన మొత్తం కసిరెడ్డి ద్వారా పార్టీలో కీలక నేతకు చేరేది. అక్కడి నుంచి బిగ్ బాస్‌కు ఎలా చేరిందో చైన్ లింక్‌లో కీలక ఆధారాలు లభించినట్లు సమాచారం. ముఖ్యంగా కుంభకోణం తీరును వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ వెల్లడించినట్లు తెలిసింది. వారిద్దరూ ఇచ్చిన సమాచారాన్ని విశ్లేషించుకున్న అధికారులు మరింత లోతుగా కూపీ లాగగా ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి భారీగా లబ్ధి పొందినట్లు అంచనాకు వచ్చారు. మద్యం బాటిళ్లు విక్రయించిన తర్వాత మిగిలే ఖాళీ అట్టపెట్టెల ద్వారా వచ్చిన సొమ్ములో కూడా ఆయన వాటా అడిగేవారని సమాచారం. ‘సీఐడీలో 1.19 కోట్లు దుర్వినియోగం చేశారని ఒక ఐపీఎస్‌పై కేసు నమోదైంది. మద్యం కుంభకోణంలో సీనియర్ ఐఏఎస్ ఇంతకు వంద రెట్లు ఎక్కువగా తీసుకుని రిటైరై వెళ్లిపోయారు’ అంటూ అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

అందింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక మొదట్లో లీలా దానికి అనుకూలంగానే ఉంది. అయితే ఎస్ఎన్‌జే ఉద్యోగి ఒకరు అందులో డైరెక్టర్‌గా ప్రవేశించారు. కొంత కాలానికే తనను బెదిరించి మొత్తం లాగేసుకుని.. తన బ్రాండ్లు కూడా వైసీపీ పెద్దలు విక్రయించుకున్నట్లు సదరు యజమాని ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపైనా దర్యాప్తు అధికారులు కూపీ లాగుతున్నారు.

### ఎక్కడి నుంచి వచ్చింది..?

ఎక్సైజ్ శాఖ అంటే అందరికీ కనిపించేది మద్యమే. కానీ ప్రభుత్వపరంగా చూస్తే అది కీలక ఆదాయార్జన విభాగం. నిత్యం అనేక పన్నులు, లెక్కలతో గందరగోళంగా ఉండే శాఖ అది. అందులో నుంచి వాటాలు ఎలా సహకరిస్తున్నారు.

### మిగిలిన మద్యం లెక్కలు మాయం


వైసీపీ హయాంలో ప్రభుత్వ మద్యం షాపుల లెక్కలన్నీ గందరగోళంగా ఉండేవి. డిస్టిలరీల్లో ఉత్పత్తి చేసిన మద్యానికి, షాపుల్లో విక్రయించిన మద్యానికి చాలా సార్లు వ్యత్యాసం వచ్చింది. ఆ లెక్కలు ఏమయ్యాయో ఇప్పటికీ తేలలేదు. ఇక ప్రభుత్వం మారిన తర్వాత మిగులు మద్యం లెక్కలనూ విశిష్ట కంపెనీ మాయం చేసింది. గతేడాది అక్టోబరు 15 వరకు ప్రభుత్వ మద్యం షాపులు పనిచేశాయి. ఆ రోజు రాత్రి తర్వాత మద్యం షాపుల్లో మిగిలిన మద్యాన్ని డిపోలకు వెనక్కి పంపారు. కోట్ల రూపాయల విలువైన మద్యాన్ని ఎక్సైజ్ సిబ్బంది డిపోలకు అప్పగించారు. అయితే డిపోల్లో డిస్టిలరీల నుంచి

## తాడేపల్లి... అన్నీ చూస్తోంది

ప్రభుత్వం మారిపోయింది. కీలక శాఖల అధికారులూ మారారు. వ్యవస్థ మొత్తం కూటమి ప్రభుత్వ కనుసన్నల్లో నడుస్తోందని ప్రజలు అనుకుంటే పొరబడినట్లే! ఎక్సైజ్ శాఖలో ఇప్పటికీ కీలక సమాచారమంతా తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుతోంది. అదేదో అడపాదడపా కాదు. చీమ చిటుక్కుమన్నా తాడేపల్లి ప్యాలెస్‌కు, నాటి సకల శాఖ మంత్రి–సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి మొత్తం తెలిసిపోతోంది. కార్పొరేషన్ ప్రతి రోజూ మద్యం సరఫరాకు ఇచ్చే ఆర్డర్లు, డిస్టిలరీల నుంచి మద్యం డిపోలకు చేరుతున్న మద్యం లెక్కలు, అక్కడి నుంచి ఏ షాపులు, ఏ బార్లకు వెళ్తోంది.. మద్యం కంపెనీలకు ప్రభుత్వం చేస్తున్న చెల్లింపులు.. అన్నీ తాడేపల్లి ప్యాలెస్ స్పష్టంగా చూస్తోంది. సజ్జలకు చెందిన కంపెనీ ఎక్సైజ్‌లో సర్వీసు ప్రొవైడర్‌గా ఇప్పటికీ కొనసాగుతుండడమే ఇందుకు కారణం. అప్పట్లో ఏపీఎస్‌బీసీఎల్ వద్దన్నా సజ్జల ఆదేశాలతో విశిష్ట అనే కంపెనీని తీసుకొచ్చి కార్పొరేషన్‌లో పెట్టారు. ఒకరకంగా మొత్తం శాఖను దాని చేతిలో పెట్టారు. అయితే ప్రభుత్వం మారి పది నెలలవుతున్నా ఇప్పటికీ ఎక్సైజ్ శాఖ ఆ కంపెనీనే కొనసాగిస్తోంది. ఇదే అదనుగా భావించిన విశిష్ట.. రోజువారీ ఆర్డర్లు, అమ్మకాలు మొత్తం లెక్కలను తాడేపల్లి ప్యాలెస్‌కు చేరవేస్తోంది. తమ పాలనలో మద్యంలో భారీగా అక్రమాలకు పాల్పడిన వైసీపీ పెద్దలకు ఇది మంచి అవకాశంగా మారింది. ప్రభుత్వం మారిన తర్వాత కూడా మద్యం అమ్మకాల వివరాలను ట్రాక్ చేసి గత అక్రమాల లెక్కల నుంచి ఎలా తప్పించుకోవాలో ఎత్తులు వేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ సైతం ఆ సర్వీసు ప్రొవైడర్‌పై ఎందుకో అమిత ప్రేమ చూపుతోంది.

రాబట్టుకోవచ్చో వైసీపీ ప్రభుత్వం పక్కాగా అమలుచేసి చూపించింది. అందుకోసం ఏరికోరి ఒక సర్వీస్ ప్రొవైడర్‌ను ఎంపిక చేసింది. అంతకుముందు ఏపీఆన్‌లైన్, సీటెల్ అనే రెండు కంపెనీలు సర్వీసు ప్రొవైడర్లుగా ఉండేవి. ఒక కంపెనీ డిస్టిలరీల నుంచి డిపోల వరకు మద్యాన్ని ట్రాక్ చేస్తే.. మరో కంపెనీ డిపోల నుంచి షాపులు, బార్ల వరకు అమ్మకాలను ట్రాక్ చేసేది. అయితే ఇలా రెండు కంపెనీలు పనిచేస్తే తమ బ్రాండ్లు అమ్ముకోవడానికి, కమీషన్ల వసూలుకు సాధ్యం కావట్లేదని భావించిన తాడేపల్లి ప్యాలెస్ వాటిని తప్పించి 2022లో విశిష్ట అనే కంపెనీని తెరపైకి తెచ్చింది. అప్పటి ఎండీ వాసుదేవరెడ్డి దీనిని వ్యతిరేకించగా సజ్జల ఆదేశాలతో బలవంతంగా దానికే మొత్తం బాధ్యతలు అప్పగించారు. అన్ని స్థాయుల్లో ఆన్‌లైన్ సేవలు అందించినందుకు గాను ఆ కంపెనీకి ఏటా కోట్ల రూపాయలు చెల్లిస్తున్నారు. గత ప్రభుత్వంలో షాపులు ప్రభుత్వం నిర్వహించడంతో ఏ బ్రాండ్లు షాపులకు అవసరమో విశిష్టే నిర్ణయించింది. తాడేపల్లి పెద్దలు, హైదరాబాద్‌లో ఉండే కసిరెడ్డి సూచనలతో పాపులర్ బ్రాండ్లను పక్కనపెట్టి ‘జే’ బ్రాండ్లు కావాలని ఆన్‌లైన్లో ఆర్డర్లు పెట్టేది. ఏ రోజు ఏం ఆర్డర్లు పెట్టారు? మద్యం షాపుల్లో ఎంత స్టాకు విక్రయించారనే వివరాలను తాడేపల్లి ప్యాలెస్‌కు పంపేది. ప్రభుత్వం మారిన తర్వాత కూడా అదే పంథా కొనసాగిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చినా తమను నియమించిన సజ్జల ఆదేశాలకు అనుగుణంగా విశిష్ట సిబ్బంది పనిచేస్తున్నారు. ఇందుకు కార్పొరేషన్‌లోని కొందరు అధికారులు

వచ్చే మద్యానికే లెక్క ఉంటుంది. షాపుల నుంచి తిరిగి వచ్చిన మద్యం లెక్కలు చూపేందుకు విశిష్ట ఆప్షన్ పెట్టలేదు. కొన్ని డిపోల మేనేజర్లు ఆ మద్యాన్ని కూడా షాపులు, బార్లకు అమ్మారు. ఆ లెక్కలు మాత్రం ఆన్‌లైన్‌లో ఇప్పటికీ చూపించడం లేదు. ఇక కొన్ని డిపోల్లో దానిని ఏం చేశారో తెలియట్లేదు. కొందరు పాడైపోయిందని ధ్వంసం చేస్తామని డిస్టిలరీలకు లేఖలు రాశారు. ఆ మద్యానికి సంబంధించిన బిల్లులను మద్యం కంపెనీలకు చెల్లించలేదు. మా మద్యం ఎంత ఉందని కంపెనీలు అడుగుతుంటే బేవరేజెస్ కార్పొరేషన్ సరైన సమాధానం చెప్పట్లేదు. విశిష్ట చేసిన ఘనకార్యంతో ఇప్పుడు దాదాపు రూ.50 కోట్ల మద్యం లెక్కలు మాయమైపోయాయి. విశిష్టను సర్వీస్ ప్రొవైడర్‌గా పెట్టిన సజ్జల మద్యం సీసాలపై అతికించే హీల్స్‌ను కూడా తన చేతిలోనే పెట్టుకున్నాడు. తమిళనాడుకు చెందిన కుంబత అనే కంపెనీని తీసుకొచ్చి హీల్స్ కాంట్రాక్టు అప్పగించారు. కుంబతకు, విశిష్టకు అంతర్గతంగా సంబంధాలు ఉన్నాయని తెలుస్తోంది. టీడీపీ ప్రభుత్వంలో ఒక్కో హీల్‌కు 28 పైసలు డిస్టిలరీలు చెల్లించేవి. వైసీపీ ప్రభుత్వం దానిని ఒకేసారి 40 పైసలకు పెంచింది. ప్రతినెలా ఎక్సైజ్ శాఖకు 11కోట్ల హీల్స్ అవసరం అవుతాయి. ఆ లెక్కన ఐదేళ్లలో హీల్స్‌లో ఎంత దోపిడీ చేశారో అర్థమవుతోంది. పైగా ఇటీవల కుంబత కంపెనీకి వెంటనే నిధులు చెల్లించేలా ఆదేశాలివ్వాలని ఓ అధికారి ఒత్తిడి చేశారు. వైసీపీ తీసుకొచ్చిన కంపెనీకి నిధులు చెల్లింపు విషయంలో ప్రస్తుత అధికారులకు అంత అత్యుత్సాహం ఎందుకో!



# ఎలాంటి సినిమాను ఎలా చేసి పెట్టారో..

క్రిష్ దర్శకత్వంలో పవన్ కళ్యాణ్.. తొలిసారి ఈ వార్త బయటికి వచ్చినపుడు పవన్ అభిమానులు మాత్రమే కాదు, సగటు తెలుగు ప్రేక్షకులందరూ ఎంతో ఎగ్జైట్ అయ్యారు. పవన్ లాంటి టాప్ స్టార్‌తో క్రిష్ లాంటి విలక్షణ దర్శకుడు సినిమా చేయడం ఎంతో ఆసక్తికరంగా అనిపించింది. ఈ సినిమా నుంచి ఫస్ట్ టీజర్ రిలీజైనపుడు.. ఇది కదా కావాల్సింది అనుకున్నారు పవన్ ఫ్యాన్స్. ఒక స్టార్‌గా తనలో ఎంతో పొటెన్షియాలిటీ ఉన్నప్పటికీ.. అందుకు తగ్గ సినిమాలు చేయట్లేదన్నది పవన్ అభిమానుల కంప్లైంట్. రీఎంట్రీ తర్వాత వకీల్ సాబ్, భీమ్లా నాయక్, బ్రో.. ఇలా వరుసగా రీమేక్ సినిమాలు చేయడం ఫ్యాన్స్‌కు ఒకింత నిరాశనే కలిగించింది. అయినా సరే.. వకీల్ సాబ్, భీమ్లా నాయక్ ఒక రేంజ్ హైప్ తెచ్చుకున్నాయి. ఈ నేపథ్యంలో ‘వీరమల్లు’ టీజర్ చూశాక దీని బాక్సాఫీస్ పెర్ఫామెన్స్ వేరే లెవెల్లో ఉంటుందని అనుకున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం సెన్సేషన్ క్రియేట్ చేయగలదని అంచనా వేశారు. మేకింగ్ కొంచెం ఆలస్యం అవుతున్నా సరే.. అభిమానులు ఓపిగ్గా ఎదురు చూశారు.





కానీ ఎప్పుడైతే ఈ సినిమా నిరవధికంగా వాయిదా పడి, క్రిష్ ఈ చిత్రం నుంచి తప్పుకున్నాడో అప్పట్నుంచి కథ మారిపోయింది. అంతకుముందున్న హైప్ నెమ్మదిగా కరిగిపోతూ వచ్చింది. ఎంత క్రేజీ ప్రాజెక్ట్ అయినా మేకింగ్ దశలోనే నాలుగైదేళ్లు ఉంటే హైప్ కంటిన్యూ కావడం కష్టం. పైగా క్రిష్ లాంటి గొప్ప అభిరుచి ఉన్న దర్శకుడు ఈ చిత్రం నుంచి తప్పుకుని.. డిజాస్టర్ డైరెక్టర్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన జ్యోతికృష్ణ ఈ సినిమాను టేకప్ చేశాడో అప్పుడే పవన్ ఫ్యాన్స్ దీని మీద అంచనాలు తగ్గించేసుకున్నారు. జ్యోతికృష్ణ నుంచి చివరగా వచ్చిన ‘రూల్స్ రంజన్’ చూసిన వాళ్లు ‘వీరమల్లు’ లాంటి భారీ చిత్రాన్ని అతడి చేతికి అప్పగించారంటే ఇంకేం ఆశలు పెట్టుకోగలరు? అతను తీస్తున్నది తక్కువ పార్ట్ అయినా సరే.. అది ప్రాజెక్టు మీద ప్రతికూల ప్రభావం చూపేదే. పెండింగ్ షూట్ చకచకా లాగించేసి త్వరగా రిలీజ్ చేసి ఉన్నా పరిస్థితి కొంచెం మెరుగ్గా ఉండేది. కానీ మార్చి 28కి రిలీజ్ డేట్ ఇచ్చి మళ్లీ యధావిధిగా సినిమాను వాయిదా వేయడం.. అసలెప్పుడు సినిమా పూర్తవుతుందో, ఎప్పుడు రిలీజ్ అవుతుందో తెలియని అయోమయ స్థితిలోకి ‘వీరమల్లు’ వెళ్లిపోవడంతో అభిమానులు పూర్తిగా దీనిపై ఆశలు వదులుకున్న పరిస్థితి కనిపిస్తోంది. ఈ సినిమా రిలీజ్ టైంకి అసలు హైపే లేకుంటే ఆశ్చర్యమేమీ లేదు. అసలు పవన్ కెరీర్లోనే అత్యంత హైప్ తెచ్చుకున్న సినిమా ఇప్పుడు ఇలాంటి స్థితికి చేరడానికి పవన్ సహా టీంలో అందరూ కారణమే.

నమస్తే ఆంధ్ర.కామ్
VOICE OF TELUGU PEOPLE
NAMASTEANDHRA.COM
FOR THE STATE # OF THE STATE # BY THE STATE
MAR 2025

# పాదయాత్రకు సమయమేనా?

## మూడేళ్ల ముందే సిద్ధమవుతున్న కేటీఆర్




తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో పాదయాత్ర ఓ గేమ్ చేంజర్ అన్న సెంటిమెంటు ఉంది. రాష్ట్రంలో పాదయాత్ర చేసిన రాజకీయ పార్టీల నేతలు అధికారంలోకి వస్తారని, వారిలో పార్టీలో అగ్రనేతలైన వారు ముఖ్యమంత్రి అవుతారని అందరూ నమ్ముతారు. నిజానికి గత చరిత్ర కూడా ఇదే చెబుతుంది. ఈ క్రమంలోనే.. భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాదయాత్ర చేసేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో గతంలో అందరిలాగే కేటీఆర్‌కూ ఆ సెంటిమెంట్ కలిసివస్తుందా? ఆయనకు కూడా సీఎం అయ్యే యోగం దక్కుతుందా? అన్న చర్చ మొదలైంది. అయితే కేటీఆర్ పాదయాత్రకు పూనుకుంటున్న సమయం విషయంలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నది అందరూ అంటున్న మాట. కానీ, ఎన్నికలు జరిగి ఇంకా ఏడాదిన్నర కూడా కాకపోవడం, మళ్లీ ఎన్నికలు జరిగేందుకు ఇంకా దాదాపు మూడున్నరేళ్లు ఉండడంతో ఇంత ముందుగా కేటీఆర్ పాదయాత్రకు సిద్ధం కావడం తొందరపాటే అవుతుందని పలువురు రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఎన్నికల ముందర చేస్తే ప్రయోజనం ఉంటుంది తప్ప.. ఇంత ముందుగా పాదయాత్ర మొదలుపెడితే ఫలితం ఎలా ఉంటుందోనన్న అనుమానాలను వారు వ్యక్తం చేస్తున్నారు.



### అందరూ ఎన్నికలు ముందే..

గతంలో పాదయాత్ర చేపట్టిన నేతలంతా ఎన్నికలకు ఇంకా ఏడాదికి అటు, ఇటుగా సమయం ఉందనగా బయలుదేరిన వారే. తెలుగుదేశ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు గతంలో ఉమ్మడి రాష్ట్రానికి వరుసగా రెండుసార్లు ముఖ్యమంత్రి అయి.. తన 'హైటెక్' పాలనతో కొనసాగుతున్న వేళ.. రైతులు, నిరుద్యోగుల్లో వ్యతిరేకత నెలకొనగా.. 2004 ఎన్నికల ముందు వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన పాదయాత్ర ఆయనకు ముఖ్యమంత్రి పీఠం దక్కేందుకు దోహదపడింది. 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు చేసిన పాదయాత్ర టీడీపీకి అధికారాన్ని సిద్ధింపజేస్తే.. 2019కి ముందు వైఎస్ షర్మిల, జగన్ లు చేసిన పాదయాత్ర వైసీపీకి అధికారాన్ని సాధించి పెట్టింది. రాష్ట్ర విభజన తరువాత 2024 ఎన్నికల ముందు నారా లోకేష్ పాదయాత్ర టీడీపీకి అధికారాన్ని సాధించి పెట్టింది. తెలంగాణలోనూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనను దించడానికి రేవంత్ రెడ్డి 2023 ఎన్నికలకు ముందు చేసిన పాదయాత్ర ఆయననూ సీఎంను చేసింది. ఇక.. గతంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా





ఉన్న బండి సంజయ్ చేసిన పాదయాత్ర బీజేపీకి గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ ఎన్నికల్లో గణనీయమైన సీట్లను తెచ్చిపెట్టింది. ఆ తరువాత ఆయనను అధ్యక్షుడిగా తొలగించినా.. గత ప్రభావంతో ఆ పార్టీకి ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు దక్కాయి.

### కోయిల ముందే కూస్తోంది..

పాత ఉదాహరణలు ఇలా ఉండగా.. కేటీఆర్ ఎన్నికలకు మూడేళ్ల ముందే పాదయాత్రకు పూనుకుంటున్నారు. బీఆర్ఎస్‌ను తిరిగి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా వచ్చే ఏడాది (2026) పాదయాత్ర చేపట్టనున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. ప్రస్తుతం జిల్లాల పర్యటనలతో ప్రజల్లో



ఉంటూ పార్టీని బలోపేతం చేసే కార్యక్రమాల్లో నిమగ్నమైన కేటీఆర్, ఈ ఏడాది చివరి వరకు ఇదే తరహా కార్యాచరణ కొనసాగుతుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించడమే ప్రధాన అజెండాగా తమ పార్టీ ముందుకు సాగుతోందని ఆయన ఉద్ఘాటించారు. "యాత్ర గురించి కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం జిల్లాల పర్యటనలు ప్రారంభించాను. ఈ ఏడాది చివరి వరకు పార్టీని బలోపేతం చేసే కార్యక్రమాల్లో ఉంటాను. వచ్చే ఏడాది యాత్ర ప్రారంభిస్తాను" అని కేటీఆర్ వెల్లడించారు. ఆయన ప్రకటనతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆశించిన ఫలితాలు రాకపోవడంతో పార్టీ శ్రేణులు కొంత నిరాశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేటీఆర్ పాదయాత్ర ప్రకటన వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర పార్టీకి ఎంతగానో ఊతమిచ్చింది. అదే తరహాలో కేటీఆర్ కూడా ప్రజల్లోకి నేరుగా వెళ్లి వారి సమస్యలు తెలుసుకుంటూ, పార్టీని మరింతగా ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ యాత్రను చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

### బీఆర్ఎస్‌కు కీలకమయ్యే చాన్స్


కేటీఆర్ ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పార్టీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ వారిలో మనోధైర్యాన్ని నింపుతున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల సమస్యలపై గళం విప్పుతున్నారు. ఈ క్రమంలోనే ఆయన పాదయాత్రకు సంబంధించిన సంకేతాలు ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. వచ్చే ఏడాది కేటీఆర్ చేపట్టనున్న ఈ పాదయాత్ర బీఆర్ఎస్ రాజకీయ భవిష్యత్తుకు అత్యంత కీలకమని విశ్లేషకులు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీని మళ్లీ గాడిలో పెట్టడానికి, ప్రజల్లో విశ్వాసం నింపడానికి ఈ యాత్ర ఎంతగానో ఉపయోగపడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఈ పాదయాత్ర ద్వారా కేటీఆర్ ప్రజల నాడిని పట్టుకునే అవకాశం ఉంది. ఇదంతా బాగానే ఉన్న పాదయాత్రను కేటీఆర్ ఇంత ముందుగా మొదలు పెట్టడంపైనే కొందరు భిన్నాభిప్రాయాలు కలిగి ఉన్నారు. టైంతోపాటు టైమింగ్ కూడా ముఖ్యమని.. అప్పుడే ప్రజల్లో ముద్ర వేయగలరని విశ్లేషకులు అంటున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ఆపసోపాలు పడుతోందన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల్లో ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేకతను ఎన్నికల వేళ సొమ్ము చేసుకుంటే ఫలితం ఉంటుందని అంటున్నారు. కేటీఆర్ ఇంతముందుగా ప్రజల్లోకి వెళితే.. ఎన్నికల వేళకు ప్రజలు దాన్ని మర్చిపోతే.. పడ్డ కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరవుతుందని, కాబట్టి ఎన్నికల వేడిలో పాదయాత్ర చేస్తే ఫలితం ఉంటుందని అంటున్నారు. ఏదేమైనా పార్టీని బలోపేతం చేసేందుకు కేటీఆర్ చేస్తున్న కృషి ఫలిస్తుందా లేదా అనేది కాలమే నిర్ణయిస్తుంది.



# పుష్ప-2 తర్వాత ఇలాంటి సమస్యా?



గత ఏడాది చివర్లో విడుదలై ఇండియన్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన సినిమా.. పుష్ప: ది రూల్. విదేశాల్లో సైతం ఈ సినిమా భారీ వసూళ్లు సాధించింది. ఈ సినిమాతో అల్లు అర్జున్ మార్కెట్ అమాంతం పెరిగిపోయింది. పాన్ ఇండియా స్థాయిలో అతను సూపర్ స్టార్ అయిపోయాడు. 'పుష్ప-2' తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో బన్నీ నటించాల్సింది కానీ.. ఎందుకో ఆ సినిమా వెనక్కి వెళ్లింది. తమిళ దర్శకుడు అట్లీతో మూవీ చేయడానికి బన్నీ రెడీ అయ్యాడు. అట్లీకి ఇప్పటిదాకా కెరీర్లో ఫ్లాప్ అన్నదే లేదు. 'రాజా రాణి' దగ్గర్నుంచి 'జవాన్' వరకు అన్నీ బ్లాక్ బస్టర్లే ఇచ్చాడు. ఇలాంటి కాంబినేషన్లో సినిమా అంటే నిర్మాతకు జాక్ పాట్ అనే చెప్పాలి. కానీ ఈ సినిమాకు ప్రొడక్షన్ హౌస్ సెట్ కావట్లేదనే వార్త ఆశ్చర్యం కలిగిస్తోంది. బన్నీ-అట్లీ కాంబినేషన్లో వచ్చే సినిమాను సన్ పిక్చర్స్ సంస్థ ప్రొడ్యూస్ చేస్తుందని ముందుగా వార్తలు వచ్చాయి.



ఐతే ఇప్పుడు సన్ పిక్చర్స్ ఈ ప్రాజెక్టు నుంచి వెనక్కి తగ్గినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాకు పారితోషకాల రూపంలోనే వందల కోట్లు ఖర్చవుతుండడంతో దీన్ని వర్కవుట్ చేయడం కష్టమని సన్ పిక్చర్స్ వాళ్లు వెనక్కి తగ్గారంటున్నారు. కేవలం దర్శకుడు అట్లీనే వంద కోట్ల రెమ్యూనరేషన్ అడిగాడని.. 'పుష్ప-3' తర్వాత పెరిగిన బన్నీ రేంజికి తగ్గట్లు అట్లీ కన్నా ఇంకో 50 కోట్లు ఎక్కువై ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని.. మిగతా పారితోషకాలు కూడా కలిపితే రూ.300 కోట్లు దాటిపోతుందని.. ప్రొడక్షన్ కోసం కూడా భారీగా ఖర్చు చేయాల్సి ఉండడంతో అన్ని లెక్కలూ చూసుకుని ఇది లాభదాయకమైన ప్రాజెక్టు కాదని సన్ పిక్చర్స్ వెనుకంజ వేసిందని అంటున్నారు. సన్ పిక్చర్స్ స్థానంలోకి వెంటనే మరే సంస్థా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతానికి టాలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజుతో చర్చలు జరుగుతున్నట్లు చెబుతున్నారు. కానీ కాంబినేషన్ క్రేజ్‌తో ఎగ్జైట్ అయి చేసిన 'గేమ్ చేంజర్' దారుణంగా దెబ్బకొట్టిన నేపథ్యంలో రాజు మళ్లీ అలాంటి రిస్క్ చేస్తారా అన్నది ప్రశ్న. మొత్తానికి 'పుష్ప-2' తర్వాత బన్నీ చేయబోయే సినిమాకు నిర్మాణ పరంగా సమస్యలు ఎదురవుతున్నాయంటే వినడానికి ఆశ్చర్యంగానే అనిపిస్తోంది. మరి చివరికి ఈ ప్రాజెక్టు ఏ నిర్మాత చేతికి వెళ్తుందో?

నమస్తే ఆంధ్ర.కామ్
VOICE OF TELUGU PEOPLE
NAMASTEANDHRA.COM
FOR THE STATE # OF THE STATE # BY THE STATE
MAR 2025

# చట్టంతో చెలగాటం

**జగన్ ఆశీస్సులతో రౌడీషీటర్ బోరుగడ్డ విన్యాసాలు**
**తల్లికి అనారోగ్యమంటూ తప్పుడు మెడికల్ సర్టిఫికెట్**
**దాని ఆధారంగా బెయిల్ పొడిగించిన హైకోర్టు**
**మరోసారి పొడిగించుకునేందుకు విశ్వప్రయత్నాలు**
**గుంటూరు, బెంగళూరు, రాజమండ్రిల్లో రహస్య మకాం**
**విషయం అర్థమై లొంగిపోవాలని కోర్టు ఆదేశం**
**ఒక రోజు ఆలస్యంగా రాజమండ్రి జైల్లో లొంగుబాటు**
**అయినా వివరణ కోరని జైలు అధికారులు**




క్రిమినల్స్‌తో రాజకీయ నేతలకు సాన్నిహిత్యం ఉంటే ఏమవుతుందో రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్ ఉదంతమే నిదర్శనం. జగన్ ఐదేళ్ల హయాంలో రెచ్చిపోయిన ఈ రౌడీషీటర్.. ఆయన ఓడిపోయిన తర్వాత కూడా ఏకంగా వ్యవస్థలతోనే చెలగాటమాడడం విస్మయపరుస్తోంది. తప్పుడు మెడికల్ సర్టిఫికెట్‌తో హైకోర్టునే బురిడీ కొట్టించి బెయిలు తెచ్చుకోవడం నిర్ఘాంతపరుస్తోంది. పరారయ్యేందుకు వేసిన పథకం పారకపోవడంతో వెంటనే జైల్లో లొంగిపోవడం కూడా విచిత్రంగానే ఉంది. జగన్ దన్నుతో ఆ ఐదేళ్లలో రాజ్యాంగేతర శక్తిగా చెలరేగిన బోరుగడ్డ.. బెదిరింపులు, డబ్బు వసూళ్లకు పాల్పడడమే గాక చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టాడు. బహిరంగంగా మీడియా ముందు వారిని, మాజీ ఎంపీ రఘురామరాజు, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను దూషించాడు. అతడిపై రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14 కేసులు నమోదయ్యాయి. గుంటూరులోని ఏఈఎల్‌సీ చర్చి ట్రెజరర్ బాబు ప్రకాశ్‌ను కత్తితో బెదిరించి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో బోరుగడ్డను గత ఏడాది అక్టోబరు 16వ తేదీ రాత్రి అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన కేసుల్లో ఆయా పోలీసులు పీటీ వారెంట్లపై సంబంధిత కోర్టుల్లో హాజరుపరిచారు. తాను కేంద్ర మంత్రి పీఏనంటూ అనంతపురం కలెక్టర్, ఎస్పీకి ఫోన్ చేసి అక్కడి చర్చి ఆస్తుల వివాదంలో బోరుగడ్డ తలదూర్చాడు. దీంతో అనంతపురం నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. మిగతా కేసుల్లో అతడికి బెయిల్ వచ్చినప్పటికీ.. ఈ కేసులోనే రిమాండ్‌పై రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నాడు. అయితే తన తల్లి పద్మావతికి ఊపిరితిత్తులు, గుండె సంబంధిత సమస్యలున్నందున.. ఆమెకు చికిత్స చేయించాలంటూ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించాడు. కొడుకు ఎలాంటి వాడైనా.. తల్లి బాగోగులు చూసుకోవలసిందే. కోర్టు ఈ మానవీయ కోణంలో పరిశీలించి.. ఈ ఏడాది ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. బోరుగడ్డ తల్లికి అనారోగ్యం నిజం.. ఆమెకు చెన్నై అపోలోలో శస్త్ర చికిత్స జరగడమూ నిజం. అయితే... బోరుగడ్డకు బెయిలు రావడానికి రెండు రోజుల ముందే.. అంటే గతనెల 12వ తేదీనే ఆమె ఆస్పత్రిలో చేరారు. 18న ఆమెకు శస్త్రచికిత్స జరిగింది. 23వ తేదీన డిశ్చార్జి అయ్యారు. బోరుగడ్డ 28వ తేదీ వరకు బెయిలుపైనే ఉన్నాడు. కానీ చెన్నైకి వెళ్లనే లేదు. ఫిబ్రవరి 28న రాజమండ్రి సెంట్రల్ జైలులో లొంగిపోయాడు. అయితే మధ్యంతర బెయిల్‌ను పొడిగించాలని మర్నాడే మళ్లీ హైకోర్టును ఆశ్రయించాడు. తన తల్లికి శస్త్రచికిత్స జరిగినందున కొన్నాళ్లపాటు ఆమె బాగోగులు చూసుకోవాలని నిజాయితీగా కోరితే సరిపోయేది! కానీ తప్పుడు మార్గం ఎంచుకున్నాడు. ఫిబ్రవరి 23నే ఆమె డిశ్చార్జి అయినప్పటికీ... 'ఆమె ఇంకా చెన్నై అపోలోలో చికిత్స పొందుతున్నారు' అని పిటిషన్‌లో పేర్కొన్నాడు. అంతేకాదు... 'ఆమె పరిస్థితి క్షీణిస్తోంది. అత్యవసరంగా ఆమెను చెన్నై అపోలో ఆస్పత్రిలో అడ్మిట్ చేసి చికిత్స అందించాలి' అంటూ గుంటూరు లలితా హాస్పిటల్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రాఘవ శర్మ ఇచ్చినట్లుగా ఒక నకిలీ మెడికల్ సర్టిఫికెట్‌ను కోర్టు ముందుంచాడు. అది నిజమైన సర్టిఫికెట్ అవునో కాదో తనకు తెలియదని ఏపీపీ కోర్టుకు చెప్పారు. అయితే... కుమారుడిగా తల్లి బాగోగులను చూసుకోవాల్సిన అవసరాన్ని మానవీయ కోణంలో చూసిన హైకోర్టు.. మధ్యంతర బెయిల్‌ను మార్చి 11 వరకు పొడిగించింది. సర్టిఫికెట్ నకిలీదని తేలితే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

### అలా వదిలేస్తారా?

హైకోర్టు బెయిలు ఇచ్చిన తర్వాత.. రిమాండ్ ఖైదీని విడుదల చేయడానికి కొన్ని నిబంధనలు పాటించాలి. బెయిలు విషయాన్ని జైలు సూపరింటెండెంట్ తనపై అధికారులకు తెలియజేయాలి. అలాగే... ఆ కేసు నమోదైన పోలీసు స్టేషన్‌కు కూడా సమాచారం పంపించాలి. బోరుగడ్డలాంటి వ్యక్తి విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉండగా.. రాజమండ్రి సెంట్రల్ జైలు అధికారులు.. అతడికి హైకోర్టు అలా బెయిలు ఇవ్వగానే, ఇలా గుట్టుగా బయటకు పంపించేశారు. హైకోర్టు మధ్యంతర బెయిలు ఇచ్చి, రెండోసారి దానిని పొడిగించినప్పటికీ ఈ విషయం ప్రభుత్వం దృష్టికి రాలేదు. బోరుగడ్డ బయటికి వచ్చిన సంగతి మీడియాకు కూడా తెలియదు. అంత రహస్యంగా, భద్రంగా జైలు దాటించేశారన్న మాట.



### రంగారెడ్డి.. సంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో బోరుగడ్డ కదలికలు

జైలు నుంచి విడుదలయ్యాక బోరుగడ్డ చెన్నై వెళ్లలేదు. తల్లి వద్ద ఉండనే లేదు. తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి , సంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో సంచరించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. అతడికి వైసీపీ ముఖ్య నేత సహకరించినట్లు సమాచారం. బోరుగడ్డ తప్పించుకుపోయాడని గుప్పుమనడంతో అతడు ఓ వీడియోను విడుదల చేశాడు. తన హత్యకు చంద్రబాబు ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నాడు. నకిలీ సర్టిఫికెట్ సృష్టించలేదని, జైల్లో ఉంటే ఇలాంటి పనిచేయగలనని బుకాయించాడు. తనకు తల్లయినా, తండ్రయినా జగనేనని.. కోర్టులన్నా, న్యాయవ్యవస్థ అన్నా ఎంతో గౌరవమని చెప్పాడు. అజ్ఞాతంలో ఉన్న బోరుగడ్డ ఈ వీడియోను ఎక్కడ రికార్డు చేశాడు..? ఎవరి ఫోన్ ద్వారా దానిని రికార్డు చేసి ఎవరి ద్వారా బయటకు విడుదల చేశాడనేది పోలీసులు గుర్తించలేకపోయారు.

### గుంటూరు పోలీసుల విచారణ..

తల్లి అనారోగ్యంపై బోరుగడ్డ హైకోర్టుకు అందించిన మెడికల్ సర్టిఫికెట్ నిజమైనదో కాదో నిర్ధారించాలని అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు.. గుంటూరు పోలీసులను కోరారు. కార్డియాలజిస్టుగా డాక్టర్ రాఘవశర్మకు మంచి పేరుంది. క్లిష్టమైన కేసులకు సైతం గుంటూరులోనే చికిత్స అందించగల సమర్థులు. అలాంటిది... బోరుగడ్డ తల్లిని చెన్నై అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పారనడంతో గుంటూరు పోలీసులకు అనుమానం వచ్చింది. స్పెషల్ బ్రాంచ్ పోలీసులు రంగంలోకి దిగడంతో అసలు విషయం బయటపడింది. లలితా ఆస్పత్రిలో బోరుగడ్డ తల్లి అసలు చేరనేలేదు. ఆమెను చెన్నై అపోలోకు రిఫర్ చేస్తూ తానెలాంటి సర్టిఫికెట్ ఇవ్వలేదని డాక్టర్ రాఘవశర్మ స్పష్టంచేశారు. ఆ మెడికల్ సర్టిఫికెట్‌పై ఉన్న సంతకం తనది కాదని తేల్చిచెప్పారు. ఆయన పేరుతో ఉన్న లెటర్‌హెడ్‌పై ఫోర్జరీ సర్టిఫికెట్ సృష్టించారని తేలింది. ఈలోపు బోరుగడ్డ పత్తా లేకుండా పోయాడు. గుంటూరు, అనంతపురం పోలీసులు ఎంత ప్రయత్నించినా ఆచూకీ తెలియలేదు. అతడి ఫోన్‌తో పాటు తల్లి ఫోన్ కూడా స్విచాఫ్ చేసి ఉన్నాయి. కేసులు, అరెస్టులు, కారాగారవాసం నుంచి తప్పించుకుని.. పరారయ్యేందుకే తల్లి అనారోగ్యాన్ని వాడుకుని బెయిల్ కోసం పథకం వేసినట్లు తేలిపోయింది.

### విమానంలో వచ్చయినా తక్షణమే లొంగిపోవాలి!

ఇంత వివాదం జరుగుతున్నా.. మళ్లీ బెయిలు పొడిగించాలని బోరుగడ్డ హైకోర్టులో పిటిషన్ వేశాడు. అతడి తీరుతెన్నులను పోలీసులు నివేదించడంతో బెయిలు పొడిగించేందుకు న్యాయస్థానం నిరాకరించింది. చెన్నైలో ఉన్నాడంటున్నారని.. అక్కడి నుంచి విమానంలో వచ్చయినా జైలులో వెంటనే లొంగిపోవలసిందేనని తేల్చిచెప్పింది. మార్చి 11 సాయంత్రం 5 గంటల వరకే గడువు విధించింది. హైకోర్టు ఆగ్రహంతో బోరుగడ్డకు అంతా బోధపడింది. మార్చి 12న ఉదయాన్నే రాజమండ్రి జైల్లో లొంగిపోయాడు. అంటే.. అతడు అక్కడ గానీ, గుంటూరులో గానీ తలదాచుకున్నట్లు తేలింది. అంతకుముందు బెంగళూరులో కూడా మకాం వేసినట్లు పోలీసులు గుర్తించారు. లొంగిపోయిన బోరుగడ్డను జైలు అధికారులు వివరణ కోరలేదు. ముందురోజే రావలసి ఉన్నా ఎందుకు రాలేదో అడగనేలేదు.

### బోరుగడ్డకు అండగా సీనియర్ ఐపీఎస్?

ఈ యావత్ ఉదంతంలో బోరుగడ్డకు ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి సహకరించినట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వంలోని ఓ కీలక ప్రజాప్రతినిధి కూడా అండగా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పోలీసులు కూపీ లాగుతున్నారు. అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు నమోదు చేసిన కేసులో కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించగా.. తనను అనంతపురం జైలులో కాకుండా రాజమహేంద్రవరం జైలుకు పంపాలని అతడు ఎందుకు కోరాడన్నది పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది. సీనియర్ ఐపీఎస్ సాయంతో రాజమహేంద్రవరం జైలుకు చేరినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలోని కీలక ప్రజాప్రతినిధికి ఎన్నికల ముందు బోరుగడ్డ కొంత ఫండ్ ఇచ్చాడని.. ఇప్పుడాయన సహాయ సహకారాలు అందిస్తున్నట్లు అతడి అనుచరులు ప్రచారం చేసుకుంటున్నారు.

# పట్టాల పేరుతో స్వాహా



## జగనన్న ఇంటిస్థలాల కేటాయింపులో భారీ గోల్‌మాల్

28 లక్షల మందికి ఇంటిపట్టాలు ఇచ్చినట్లు జగన్ హడావుడి

నేటికీ పట్టాలు తీసుకోనివారు 9.2 లక్షల మంది

మిగిలిన 18 లక్షల్లో 6.50 లక్షల ఇళ్లు ఇతర పథకాల కింద ఇచ్చినవే

నిజమైన లబ్ధిదారులు ఎందరు?

వైసీపీ కార్యకర్తలకే ఇచ్చారా?

బినామీల పేరిట నేతలే కొట్టేశారా?



జగన్ జమానాలో పేదింటి స్థలాల పేరిట ఆయన అనుచరులు, ప్రభుత్వ పెద్దలు భారీ భూ చక్రమే తిప్పారు. పేదల పేరుచెప్పి తొండలు కూడా గుడ్లుపెట్టని భూములపై కోట్లాది రూపాయలు కుమ్మరించి భారీ ధరలకు కొన్నారు. ఎకరం లక్ష కూడా పలకని భూములను ఏకంగా రూ.ఐదారు కోట్లకు కొన్నారు. భూ కొనుగోలు దందాలో ఇదో కోణం. ఇంతకుమించిన దారుణం ఇంటి స్థలాల కేటాయింపులో జరిగింది. 28 లక్షల మంది పేదలకు జగనన్న కాలనీల్లో పట్టాలు ఇచ్చామని జగన్ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దీనిపై ఆరా తీస్తే.. మేడిపండు చందమే అయింది. నేటికి 9.2 లక్షల మంది ఇంటిపట్టాలు తీసుకునేందుకు ముందుకు రాకపోవడం విశేషం. కానీ జగన్ సర్కారు 28 లక్షల మందికి ఇంటిపట్టాలు ఇచ్చేశామంటూ బిల్లులు సెటిల్ చేసేసింది. దీంతో కొత్త అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 18.8 లక్షల మంది లబ్ధిదారుల్లో 6.5 లక్షల మంది ఇంతకు ముందే వివిధ పథకాల కింద లబ్ధిపొందారు. ఇక మిగిలినవారిలోనైనా నిజమైన లబ్ధిదారులున్నారా? లేక వైసీపీ నేతలు, వారి బినామీలకే కేటాయించారా అన్న సందేహాలు రేకెత్తుతున్నాయి. వీటిని బలపరిచేలా వైసీపీ నేతల బినామీలు, అనర్హులకు భారీగా ఇంటిపట్టాలు కేటాయించారంటూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. అవి ఒకటో పదో కాదు ఏకంగా 8,700 ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. మరోవైపు జగనన్న కాలనీల కోసం భారీగా ఇంటిస్థలాల సేకరణ చేసి కోట్లరూపాయల చెల్లింపులు జరిపిన మండలాలపై సీఐడీ దృష్టిసారించింది. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని మూడు మండలాల కార్యాలయాల్లో తనిఖీలు జరిపి కీలక రికార్డులను స్వాధీనం చేసుకుంది.

### రూ.24 వేల కోట్లతో 32 వేల ఎకరాల భూమి కొనుగోలు..

పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకంటూ జగన్ సర్కారు 2019-24 మధ్య 32 వేల ఎకరాల భూములు కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.24 వేల కోట్లు ఖర్చుచేసినట్లు చూపింది. ఇంతా ఖర్చుపెట్టి పేదలకు సగటున సెంటు స్థలమే ఇంటికోసం ఇచ్చింది. ఇంటిపట్టాలను కన్వేయెన్స్ డీడ్‌లుగా ఇచ్చింది. అంటే, అసైన్‌మెంట్ చట్టం -1974 కింద ఇంటిపట్టాలు ఇచ్చినా నిబంధనల ప్రకారం 20 ఏళ్లలోపు అమ్ముకోకూడదని చట్టం ఉంది. జగన్ చట్టసవరణ చేశారు. 20 ఏళ్ల గడువును పదేళ్లకు కుదించారు. పదేళ్ల తర్వాత ఆ ఇంటిపట్టాలను అమ్ముకునేలా, ఇందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నిరభ్యంతర పత్రాలు(ఎన్‌ఓసీ) అవసరం లేకుండా చేసేందుకు కన్వేయెన్స్ డీడ్‌ల రూపంలో ఇచ్చారు. పట్టాలను నేరుగా లబ్ధిదారుల పేరిటే ఇచ్చారు. ప్రభుత్వాలు ఏవైనా ప్రజలకు శాశ్వత నివాసం కల్పించి, దానిని వారు కాపాడుకునేలా చూస్తాయి. అసైన్‌మెంట్ చట్టం కూడా అదే చెబుతోంది. కానీ జగన్ అందుకు విరుద్ధంగా పట్టా పొందిన ఐదేళ్లలోనే అమ్ముకోవచ్చంటూ ప్రచారం చేసి పట్టాలు ఇచ్చారు. తాజా అధికారిక లెక్కల ప్రకారం.. 28 లక్షల మందికి కన్వేయెన్స్ డీడ్‌లు ఇచ్చినట్లుగా జగన్ ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఈ లెక్క డొల్ల అని ఇప్పుడు తేలింది. మొత్తం 28 లక్షల మంది లబ్ధిదారుల్లో ఈ నాటి వరకు 9.2 లక్షల మంది ప్రభుత్వం వద్దకు వచ్చి తమకు కేటాయించిన కన్వేయెన్స్ డీడ్‌లు తీసుకోలేదు. ఇప్పటికే కూటమి సర్కారు వచ్చి ఏడు నెలలు దాటింది. నిజంగా ఇంటిపట్టా మంజూరైనా 9.2 లక్షల మందికి ధైర్యంగా ముందుకొచ్చి ఎందుకు తీసుకోవడం లేదన్నదే అసలు ప్రశ్న. బినామీ లబ్ధిదారులున్నారా? లేక వైసీపీ కార్యకర్తల పేరిట పట్టాలు మంజూరు చేశారా అన్నదానిపై ప్రభుత్వం ఇప్పుడు ఆరా తీస్తోంది. జిల్లాల వారీగా లబ్ధిదారుల జాబితాలను ర్యాండమ్‌గా పరిశీలించగా ఎక్కువ మంది వైసీపీ నేతల అనుచరులు, వారి సొంత మనుషులే ఉన్నట్లు ప్రాథమికంగా తేలింది. మిగిలిన 18.8 లక్షల లబ్ధిదారుల్లో 6.5 లక్షల మంది టిడ్కో, ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్కీమ్‌ల పరిధిలోని లబ్ధిదారులున్నారు. ఇక నికరంగా జగన్ సర్కారు ద్వారా ఇంటిపట్టాలు పొందినవారు 12 లక్షలేనని స్పష్టమవుతోంది. వీరయినా అసలైన లబ్ధిదారులేనా.. వైసీపీ నేతలు, వారి కార్యకర్తలేనా అని అధికారులు కూపీలాగుతున్నారు. దీంతో వైసీపీ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.




### అనర్హులకే పట్టాలు..

అసైన్‌మెంట్ ఇంటిస్థలాలపై రెవెన్యూశాఖకు 8,700 ఫిర్యాదులు వచ్చాయి. అందులో వైసీపీ నేతలు, వారి బినామీలకే జగనన్న కాలనీల్లో స్థలాలు ఇచ్చారన్న కంప్లయింట్లు 4,200 వరకు ఉన్నాయి. ఇవి ఎక్కువగా విశాఖ, విజయనగరం, కృష్ణా, గుంటూరు, కడప, అనంతపురం, కర్నూలు తదితర జిల్లాల నుంచే వచ్చాయి. వీటిపై రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో ఆరాతీయగా అనర్హులకు పట్టాలు ఇచ్చారని తేలింది. గతంలోనే స్థలాలు పొందిన వారు, అధిక ఆదాయం ఉన్నవారికి పట్టాలు ఇచ్చినట్లు రుజువైంది. వారిలో అధికులు వైసీపీ నేతల బినామీలు, వారి సొంత మనుషులేనని గుర్తించారు. ఈ మొత్తం వ్యవహారంపై రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి నివేదిక ఇచ్చారు. ఇంటి స్థలాల గోల్‌మాల్ భారీగా జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని సీఎం ఆదేశించారు. ఇప్పటివరకు కన్వేయెన్స్ డీడ్స్ తీసుకోని లబ్ధిదారులెవరో తేల్చాలని స్పష్టం చేశారు. జిల్లాల నుంచి అందిన ఫిర్యాదులు, అనుమానాలున్న కేసుల్లో లోతుగా విచారించాలని నిర్దేశించారు. ఈ విచారణ సీఐడీతో జరిపించాలా.. విజిలె న్స్ విభాగంతో చేయించాలా అన్నదానిపై రెవెన్యూశాఖ నిర్ణయం తీసుకోవలసి ఉంది. అయితే, విచారణ మాత్రం తప్పరిసరిగా చేస్తామని మంత్రి అనగాని చెప్పారు. అక్రమార్కులను వదిలిపెట్టేది లేదన్నారు.

### జగనన్న కాలనీల్లో రూ.460 కోట్ల 'చదును' దోపిడీ

జగనన్న కాలనీ పనుల్లో మరో స్కాం వెలుగులోకి వచ్చింది. ఉపాధి హామీ పథకం నిధులతో జగచేపట్టిన ఇంటి చదును పనుల్లో అడ్డగోలు దోపిడీకి తెరదీశారు. వైసీపీ కార్యకర్తలు చేపట్టిన ఈ పనుల్లో ఏకంగా ఎంబుక్‌లు మార్చేసి దొంగ బిల్లులు చేసుకుని రూ.వందల కోట్లు స్వాహా చేశారు. ఉపాధి హామీ పథకంలో ఈ తరహా పనులకు అనుమతి లేకపోయినా ఇంటి స్థలాల చదును పనులను ఉపాధి నిధులతో జగన్ ప్రభుత్వం చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం గుర్తించి హెచ్చరిక చేయడంతో ఈ పనులను హౌసింగ్ శాఖకు బదలాయించారు. సందట్లో సడేమియా అన్న రీతిలో అప్పటి వరకు రూ.1,125 కోట్లు మేర చదును పనులు చేసిన వైసీపీ కార్యకర్తలు ఎంబుక్‌లు ట్యాంపరింగ్ చేసి రూ.1,585 కోట్ల మేర పనులు చేసినట్లు రికార్డుల్లో చూపించారు. సుమారు రూ.460 కోట్ల పనులు చేయకుండానే వైసీపీ కార్యకర్తలకు ఉపాధి నిధులు అప్పనంగా చెల్లించారు. చేయని పనులకు ఇప్పటికే రూ.220 కోట్లు చెల్లించిన అధికారులు కోర్టు ఆదేశించిందంటూ మరో 240 కోట్లు చెల్లించేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వ స్థలంలో తవ్విన మట్టిని తెచ్చి దానిని కొనుగోలు చేసినట్లు బిల్లులు చేసుకునే వినూత్న దోపిడీకి జగన్ అండ్ కో శ్రీకారం చుట్టారు. ఇంటి స్థలాల చదును చేసేందుకు ఒక్కో ఎకరాకు సుమారు 4 వేల క్యూబిక్ మీటర్ల మట్టి అవసరమని అప్పట్లో అంచనా వేశారు. ఇందుకోసం ఒక్కో క్యూబిక్ మీటర్‌కు రూ.230 నుంచి రూ.300 దాకా రేట్లు నిర్ణయించి.. ఎకరా స్థలం లెవలింగ్‌కు రూ.10 లక్షలకు పైగా అంచనాలను తయారుచేశారు. అయితే దేశంలో ఎక్కడా లేని విధంగా నిబంధనలకు విరుద్ధంగా అచ్చంగా ఇందులో కాస్ట్ ఆఫ్ గ్రావెల్ అనే పేరుతో క్యూబిక్ మీటర్‌కు రూ.134.34 ధరగా నిర్ణయించారు. ఇది కాకుండా మట్టిని తీసుకురావడం, చదును చేయడం తదితర ఇతర కార్యక్రమాలకు వేరుగా రేట్లు రూపొందించారు. వాస్తవానికి క్యూబిక్ మీటర్ మట్టి తవ్వి తీసేందుకు ఏ రకంగా చూసినా రూ.34కు మించదు. మట్టి రాష్ట్ర ప్రభుత్వం లేక ఆయా పంచాయతీల ఆస్తి అనుకుంటే.. ఆ నిధులు వాటి ఖాతాల్లో జమ చేయాలి. అలా కాకుండా వైసీపీ నేతలు, కార్యకర్తలకు ఎందుకు చెల్లించారన్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పడం లేదు.

### చెల్లింపుల కోసం కోర్టుకు సైతం..

ఓ వైపు జగనన్న కాలనీ చదును పేరుతో భారీగా అందినకాడికి దోచుకున్న వైసీపీ నేతలు.. తమకు బిల్లులు చెల్లించాలంటూ హైకోర్టుకు వెళ్లారు. తమకు రూ.240 కోట్లు ఇప్పించాలని కోరారు. 8,630 పనులకు సంబంధించి వారికి ఆ మొత్తం చెల్లించాలని హైకోర్టు కూడా ఆదేశాలిచ్చింది. ఉపయోగపడని జగనన్న కాలనీల్లో చేపట్టిన చదును పనులకు రూ.1,125 కోట్ల నిధులు వృధా కావడమే కాకుండా, చేయని పనులకు మరో రూ.460 కోట్లు వైసీపీ నేతలకు అప్పనంగా చెల్లించాల్సి రావడం చూసి అధికారులకు మతిపోతోంది. ఆ రూ.240 కోట్ల బిల్లుల చెల్లింపులను నిలిపేసి విజిలెన్స్, సోషల్ ఆడిట్ విభాగాలతో సమగ్ర విచారణ జరిపించాలని వారు కోరుతున్నారు.

నమస్తే ఆంధ్ర.కామ్
VOICE OF TELUGU PEOPLE
NAMASTEANDHRA.COM
FOR THE STATE # OF THE STATE # BY THE STATE
MAR 2025


**టాలీవుడ్లో ప్రస్తుతం మోస్ట్ బ్యాంకబుల్ హీరో ఎవరు అంటే.. నాని పేరు చెప్పేయొచ్చు. నాని కంటే పెద్ద స్టార్లు టాలీవుడ్లో చాలామంది ఉన్నారు. కానీ పెట్టుబడి-రాబడి కోణంలో చూస్తే నాని అంత సేఫ్ బెట్ మరొకరు కనిపించరంటే అతిశయోక్తి కాదు. హీరోగా అలాంటి సక్సెస్ స్ట్రీక్‌లో ఉన్నాడతను. మరోవైపు నిర్మాతగా కూడా తన అభిరుచిని చాటుకుంటూ, ఘనవిజయాలందుకుంటూ తన క్రెడిబిలిటీని పెంచుకుంటున్నాడు నాని. దీంతో టాలీవుడ్లో నేచురల్ స్టార్ చాలా స్పెషల్ అనే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. రాజకీయాల్లో 'డబుల్ ఇంజిన్' సర్కారు అనే మాట వాడుతుంటారు. సినీ రంగంలో నాని సైతం హీరోగా, నిర్మాతగా డబుల్ ఇంజిన్‌తో దూసుకెళ్తున్నాడు.**

# నాని.. డబుల్ ఇంజిన్










టాలీవుడ్లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రయాణం మొదలుపెట్టి.. 'అష్టాచెమ్మా' చిత్రంతో అనుకోకుండా నటుడిగా మారాడు నాని. ఆ సినిమా హిట్టవడం.. ఆ తర్వాత మరి కొన్ని విజయాలు అందడం.. స్టార్ ఇమేజ్ సంపాదించడం.. 'నేచురల్ స్టార్'గా ఎదగడం.. ఇదంతా ఒక స్ఫూర్తిదాయక ప్రయాణం. ఇప్పుడు తన కొత్త చిత్రం 'ది ప్యారడైజ్'కు రూ.200 కోట్ల మేర బిజినెస్ జరగబోతున్న సంకేతాలు కనిపిస్తున్నాయంటే తను ఏ స్థాయికి చేరుకున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఏ బ్యాగ్రౌండ్ లేకుండా, అసలు హీరో అవ్వాలన్న ఉద్దేశమే లేని వ్యక్తి.. ఇప్పుడీ స్థాయిలో ఉండడం అనూహ్యం. ఇదంతా నాని ప్రతిభ, కథల ఎంపికలో తన అభిరుచి వల్లే సాధ్యమైంది. నటుడిగా నానిని ఇష్టపడని వారు అరుదు. తన సినిమాలను ఇంటిల్లిపాదీ చూస్తాయి. ఒకప్పుడు క్లాస్ హీరోగా పేరుండేది కానీ.. గత కొన్నేళ్లలో మాస్‌లోనూ ఫాలోయింగ్ పెంచుకున్నాడు. దీంతో తన సినిమాల రీచ్ ఇంకా పెరిగింది. 2023 వేసవిలో వచ్చిన 'దసరా' తన కెరీర్లో గొప్ప మలుపు. ఆ సినిమాతో తొలిసారి వంద కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయిని అందుకున్నాడు. అందులో ఊర మాస్‌గా కనిపించిన నాని.. ఎనిమిది నెలల తర్వాత 'హాయ్ నాన్న' లాంటి పక్కా క్లాస్, ఎమోషనల్ మూవీతో ప్రేక్షకులను పలకరించాడు. అందులోనూ మెప్పించి హిట్ కొట్టాడు. ఇక గత ఏడాది వచ్చిన 'సరిపోదా శనివారం' ఇటు మాస్‌ను, అటు క్లాస్‌ను మెప్పించి హిట్టయింది. హ్యాట్రిక్ హిట్లతో నాని రేంజే మారిపోయింది. ఇప్పుడు తన నుంచి రాబోతున్న 'హిట్-3'పై




అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. ఈ సినిమా టీజర్లో నాని హీరోయిజం, వయొలెన్స్ చూసి జనాలకు మతిపోయింది. ఈ మూవీ అంచనాలకు తగ్గట్లు ఉంటే నాని స్టార్ వాల్యూ ఇంకా పెరుగుతుందనడంలో సందేహం లేదు. ఇవన్నీ ఒకెత్తయితే.. కేవలం చిన్న టీజర్‌తో నాని కొత్త చిత్రం 'ది ప్యారడైజ్' రేపిన సంచలనం మరో ఎత్తు. ఇటీవలే రిలీజైన దీని టీజర్ ప్రకంపనలు రేపింది. అందులో నాని లుక్.. కథా నేపథ్యంలో టీజర్లో వినిపించిన ఒక బూతు డైలాగ్.. విజువల్స్.. బీజీఎం అన్నీ కూడా చర్చనీయాంశంగా మారాయి. షూటింగ్ మొదలు కాకముందే బంపర్ హైప్ తెచ్చుకున్న ఈ సినిమాకు ఆల్రెడీ డిజిటల్ డీల్ పూర్తయిందన్నది తాజా సమాచారం. ఒక ప్రముఖ ఓటీటీ సంస్థ ఏకంగా రూ.65 కోట్లు పెట్టి వివిధ భాషలకు స్ట్రీమింగ్ రైట్స్ తీసుకుందట. నాని సినిమాలు ఓటీటీలో వస్తే మంచి వ్యూయర్ షిప్ ఉంటుంది. వేర్వేరు భాషల వాళ్లు తన సినిమాలను బాగా చూస్తారు. దసరా, హాయ్ నాన్న, సరిపోదా శనివారం చిత్రాల డిజిటల్ రిలీజ్ టైంలో కొన్ని వారాల పాటు ఆన్ లైన్లో ట్రెండ్ అయ్యాయి. మంచి ఆప్లాప్ వచ్చింది. పెద్ద స్టార్ల సినిమాలకు దీటుగా వ్యూయర్ షిప్ వస్తుండడంతో నాని చిత్రాల స్ట్రీమింగ్ రైట్స్‌కు మంచి డిమాండ్ ఉంటోంది. ది ప్యారడైజ్ టీజర్‌కు వచ్చిన రెస్పాన్స్ చూసి ఈ సినిమా రేంజే వేరుగా ఉంటుందనే అంచనాతో రూ.65 కోట్ల రేటు పెట్టి సినిమాను కొందట ఒక ఓటీటీ ప్లాట్ ఫామ్. నాని రేంజికి ఇది చాలా ఎక్కువ మొత్తమే. కేవలం డిజిటల్ రైట్సే ఇంత పలికాయంటే ఈ సినిమాకు మొత్తం రూ.200 కోట్ల మేర బిజినెస్ జరుగుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ చిత్రం అంచనాలకు తగ్గట్లు ఉంటే నాని ఒకేసారి ఇంకొన్ని మెట్లు పైకి ఎక్కేయడం ఖాయం.

### నిర్మాతగానూ సూపర్

ప్రతి హీరోకూ కెరీర్లో ఫ్లాపులు తప్పవు కానీ.. నాని కెరీర్ సక్సెస్ రేట్ మాత్రం వేరే హీరోలతో పోలిస్తే ఎక్కువ. ఇంకో ముఖ్యమైన విషయం ఏంటంటే.. అతను మరీ భరించలేని, చెత్త సినిమాలు చేయడు. తన కెరీర్లో డిజాస్టర్లు అయిన సినిమాల్లో కూడా ఏదో ఒక విశేషం ఉంటుంది. వాచబుల్ అనిపిస్తాయి. అలాగే ఎప్పటికప్పుడు కొత్త కథలు ప్రయత్నిస్తూ, ప్రయోగాలు చేస్తూ, సినిమాకు సినిమాకు వైవిధ్యం చూపిస్తూ సాగిపోతుంటాడు నేచురల్ స్టార్. అందుకే నాని సినిమా వస్తోందంటే థియేటర్లు జనాలతో కళకళలాడుతాయి. హీరోగానే కాక తాను ప్రొడ్యూస్ చేసే సినిమాల విషయంలోనూ నాని సంపాదించుకున్న క్రెడిబిలిటీనే వేరు అని చెప్పాలి. అ!, హిట్, హిట్-2.. ఇలా ఇప్పటిదాకా నాని ప్రొడక్షన్లో వచ్చిన ప్రతి సినిమా స్పెషలే. ఇప్పుడు నాని బేనర్ నుంచి వచ్చిన కోర్ట్ సినిమా ఇంకా స్పెషల్ అని చెప్పాలి. కోర్ట్ మూవీ నచ్చకపోతే తన హిట్-3 మూవీ చూడొద్దని బోల్డ్ స్టేట్మెంట్ ఇచ్చాడు ఇటీవల నాని. కొందరు ఇది రిస్కీ స్టేట్మెంట్ అని.. తేడా కొడితే సోషల్ మీడియాలో ట్రోలింగ్ తప్పదని అన్నారు. కానీ రెండు రోజుల ముందే ప్రిమియర్స్ వేసి మీడియాకు, ప్రేక్షకులకు ఈ సినిమా చూపించాడు నాని. చూసిన వాళ్లందరూ సూపర్ సినిమా అనే అన్నారు. పాజిటివ్ టాక్ బాగా స్ప్రెడ్ అయిపోయింది. పేరున్న హీరో నటించకపోయినా.. క్రేజీ కాన్సెప్ట్ కాకపోయినా.. ఒక థాట్ ప్రొవోకింగ్ మూవీకి బుక్ మై షోలో ఒక రేంజిలో బుకింగ్స్ జరిగాయి. ముందే పాజిటివ్ టాక్ స్ప్రెడ్ అయిపోవడంతో తొలి రోజు ఈ చిన్న సినిమాకు హౌస్ ఫుల్స్ పడ్డాయి. తొలి వీకెండ్లోనే పాతిక కోట్ల వసూళ్లతో ఈ సినిమా ట్రేడ్ వర్గాలను షాక్‌కు గురి చేసింది. ఈ సినిమా మీద పెట్టిన బడ్జెట్, ఇందులోని కాస్టింగ్ ప్రకారం చూస్తే ఇది చాలా పెద్ద నంబర్. ఫుల్ రన్లో రూ.50 కోట్ల మార్కును అందుకోబోతోందీ చిత్రం. బడ్జెట్లో చాలా వరకు రిలీజ్‌కు ముందే డిజిటల్ రైట్స్ ద్వారా రికవర్ అయిపోగా.. మిగతాదంతా లాభాలన్నట్లే. నిర్మాతగా నానికి ఉన్న గుడ్ విల్‌ను ఈ సినిమా ఇంకా పెంచింది. ప్రొడ్యూసర్‌గానూ నాని బ్రాండ్ ఇంకా బలపడింది. తన బేనర్ ద్వారా కొత్త కథలను తెరపైకి తెస్తూ.. కొత్త టాలెంట్‌ను వెలుగులోకి తెస్తూ ప్రశంసలు అందుకుంటూనే.. ఇంకోవైపు మంచి లాభాలూ అందుకుంటున్నాడు నేచురల్ స్టార్.




సిలికానాంధ్ర
మనబడి
ACCREDITED
(అమెరికా మరియు కెనడాలో ACS-WASC గుర్తింపు పొందిన ఏకైక తెలుగు విద్యాలయం)
తెలుగు
చదవడం,
వ్రాయడం,
మాట్లాడడం,
నేర్చుకోండి.
17+ సం॥ లు
10+ దేశాలు
30+ రాష్ట్రాలు
95,000+ విద్యార్థులు
250+ ప్రాంతాలు
2000+ భాషా సేవకులు
ఉత్సాహంగా, ఉల్లాసంగా, ఆడుతూ, పాడుతూ తెలుగు నేర్చుకొనడానికి తేలికైన పాఠాలు.. అందమైన పుస్తకాలు, సుశిక్షితులైన గురువులు...
క్రొత్త విద్యార్థులు
• 4 - 6 సం॥ బాలబడి - 1
• 6 సం॥ బాలబడి - 2 లేదా ప్రవేశం(తల్లిదండ్రుల ఇష్టం)
• 7+ సం॥ ప్రవేశం
తరగతుల నమోదు ప్రారంభమైనది
ప్రవేశం
ప్రసూనం
ప్రకాశం
ప్రమోదం
ప్రభాసం
ప్రబోధం
బాలబడి*
* BALABADI -1 admissions are open throughout the year in USA & Canada
గుర్తింపు
• పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గుర్తింపు
• అమెరికాలోని వివిధ స్కూల్ డిస్ట్రిక్ట్‌లలో ప్రపంచభాషగా (World Language Credit) గుర్తింపు
• ప్రఖ్యాత WASC సంస్థచే గుర్తింపు
సెప్టెంబర్ 7, 2024 నుండి తరగతులు ప్రారంభం
పరీక్షలు
• ప్రకాశం, ప్రభాసం విద్యార్థులకు తెలుగు విశ్వవిద్యాలయం పరీక్షలు
• సుశిక్షితులైన ఉపాధ్యాయులచే శిక్షణ
కార్యక్రమాలు
పిల్లల పండుగ, తెలుగు మాట్లాట, బాలానందం, తెలుగుకుపరుగు, పలుకుబడి, పద్యనాటకం, నాటకోత్సవం.
బాలరంజని
తెలుగు సాధన కోసం - కథలు, పాటలు, ఆటలతో ఉచితంగా ఆప్!
మనబడిలో చేర్పిద్దాం - తెలుగు భాష నేర్పిద్దాం
For more details and to register:
manabadi.siliconandhra.org
info@manabadi.siliconandhra.org
1-844-626-BADI (2234)
Follow us on :

నమస్తే ఆంధ్ర.కామ్
VOICE OF TELUGU PEOPLE
NAMASTEANDHRA.COM
FOR THE STATE # OF THE STATE # BY THE STATE
MAR 2025

**బాయ్‌కాట్.. బాయ్‌కాట్.. కొన్నేళ్ల ముందు సోషల్ మీడియాలో బాగా ట్రెండ్ అయిన మాట ఇది. ముఖ్యంగా నార్త్ ఇండియాలో ఇది ప్రమాదకర ట్రెండ్‌కు దారి తీసింది. కొంతమంది అదే పనిగా బాలీవుడ్ సినిమాలను టార్గెట్ చేస్తూ.. వాటిని బహిష్కరించాలని సోషల్ మీడియాలో పిలుపునివ్వడం.. ఆ చిత్రాల గురించి ప్రతికూల ప్రచారం చేయడం.. నెగెటివ్ టాక్‌ను స్ప్రెడ్ చేయడం.. ఇదంతా ఒక ప్రణాళిక ప్రకారం జరిగింది. దీంతో వీరిని చూసి బాలీవుడ్ భయపడే పరిస్థితి వచ్చింది. ఈ బ్యాచ్‌ను ఎలా డీల్ చేయాలో తెలియక బాలీవుడ్ పెద్దలు తలలు పట్టుకునే పరిస్థితి వచ్చింది. వారి భయం చూసి బాయ్‌కాట్ బ్యాచ్ మరింత రెచ్చిపోయి.. రిలీజవుతున్న ప్రతి సినిమానూ టార్గెట్ చేయడం మొదలుపెట్టింది. కానీ ప్రేక్షకులు ఈ బాయ్‌కాట్ బ్యాచ్‌కు గట్టిగానే వాతలు పెట్టారు. దీంతో ఆ బ్యాచ్ సైలెంట్ అయింది. ఐతే ఇప్పుడు తెలుగు సినిమాలను టార్గెట్ చేస్తూ ఒక బ్యాచ్ రెడీ అవుతోంది. తాము సినిమాల ఫలితాలను శాసిస్తామని విర్రవీగుతోంది. కానీ ఈ బ్యాచ్‌కు నిజంగా అంత సత్తా ఉందా అన్నది ప్రశ్న.**









# వీళ్లు సినిమాల ఫలితాలను తేలుస్తారా?

సరైన కారణం ఏమీ ఉండదు.. ఏదో ఒక చిన్న కామెంట్‌ను పట్టుకుని గొడవ చేయడం.. ఎన్నో ఏళ్ల ముందు చేసిన కామెంట్లను కూడా ఇప్పుడు తెరపైకి తెచ్చి నెగెటివిటీ స్ప్రెడ్ చేయడం.. సినిమాతో ఏమాత్రం సంబంధం లేని విషయాలపై కాంట్రవర్సీ రాజేసి సినిమాను బాయ్‌కాట్ చేద్దాం అనడం.. ఇదీ కొన్నేళ్ల ముందు బాయ్‌కాట్ బ్యాచ్ వరస. కొవిడ్ టైంలో సినిమాల పరిస్థితి ప్రమాదకరంగా మారిన సమయంలో ఈ బ్యాచ్ రెచ్చిపోయింది. ఒక ఏడాది పాటు బాలీవుడ్‌ను వేధించింది. ఆమిర్ ఖాన్ సినిమా 'లాల్ సింగ్ చడ్డా', రణబీర్ కపూర్ మూవీ 'షంషేరా' సహా పలు చిత్రాలను టార్గెట్ చేసి సోషల్ మీడియాలో రోజుల తరబడి నెగెటివిటీని స్ప్రెడ్ చేసి ఆ సినిమాలను దెబ్బ తీయడం చర్చనీయాంశంగా మారింది. పూర్తిగా ఒక సినిమాను వీళ్లు కిల్ చేసేశారని చెప్పలేం కానీ.. అదే పనిగా నెగెటివిటీ స్ప్రెడ్ చేయడం ద్వారా కొంత మేర డ్యామేజ్ అయితే చేయగలిగారు. వీళ్లను ఎలా డీల్ చేయాలో తెలియక తలలు పట్టేసుకున్నారు బాలీవుడ్ ప్రముఖులు. వీళ్ల తీరును ఖండించి, విభేదించిన వాళ్ల సినిమాలను సైతం టార్గెట్ చేయడం గమనార్హం. ఐతే కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఏదో ఒక దశలో మార్పు తప్పదు. తర్వాత అదే జరిగింది. కొన్ని నెలల నుంచి అదే పనిగా షారుఖ్ ఖాన్ సినిమా 'పఠాన్'ను టార్గెట్ చేస్తూ వచ్చిన బాయ్‌కాట్ బ్యాచ్‌కు ప్రేక్షకులు గట్టిగా బుద్ధి చెప్పారు. హీరోయిన్ దీపికా పదుకొనే కాషాయ డ్రెస్ వేసుకుని ఎక్స్‌పోజింగ్ చేసిందనే సిల్లీ రీజన్‌తో ఆ



సినిమాను కొన్ని వారాల పాటు టార్గెట్ చేయడం.. చివరికి ఆ పాటను ఎడిట్ చేసుకోవాల్సిన పరిస్థితిని చిత్ర బృందానికి కల్పించడం సామాన్య ప్రేక్షకుల్లో సానుభూతి పెంచింది. అందుకే బాయ్‌కాట్ బ్యాచ్ పీచమణిగేలా ఈ సినిమాకు అదిరిపోయే అడ్వాన్స్ బుకింగ్స్ ఇచ్చారు. ఆ సినిమా ఏకంగా రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. సినిమాకు వచ్చిన టాక్‌ను మించి అది సక్సెస్ అయింది. షారుఖ్ తర్వాతి చిత్రం 'జవాన్', రణబీర్ కపూర్ మరో మూవీ 'బ్రహ్మాస్త్ర'ను కూడా ఇలాగే టార్గెట్ చేశారు. కానీ అవి కూడా సక్సెస్ కావడంతో ఈ బాయ్‌కాట్ బ్యాచ్ తోకముడిచింది. తర్వాత హిందీ చిత్రాలను టార్గెట్ చేయడం మానేసింది.

### టాలీవుడ్లో ఇదీ వరస..

సోషల్ మీడియా అన్నది రెండు వైపులా పదునున్న కత్తి. దీని వల్ల సినిమాల ప్రచారం కొత్త పుంతలు తొక్కుతోంది. సినిమాల రీచ్ పెరుగుతోంది. కానీ అదే సమయంలో సినిమాల మీద ఉద్దేశపూర్వకంగా నెగెటివిటీని స్ప్రెడ్ చేసి దెబ్బ తీసే ప్రయత్నాలూ జరుగుతున్నాయి. టాలీవుడ్లో ఈ మధ్య సినిమాలను అదే పనిగా కిల్ చేసే ప్రయత్నాలు గట్టిగా జరుగుతున్నాయి. ఒక స్టార్ హీరో అభిమానులు, ఇంకో స్టార్ హీరో సినిమాను టార్గెట్ చేయడం.. వాళ్లు ఈ హీరో సినిమా వచ్చినపుడు బదులు తీర్చుకోవడం జరుగుతోంది. ఐతే సినిమాలో కంటెంట్‌తో సంబంధం లేకుండా వీళ్లు వాటి రిజల్ట్‌ను నిర్దేశిస్తారా అంటే ఔనని సమాధానం చెప్పలేం. దేవర, పుష్ప-2 చిత్రాల మీద ఎంత నెగెటివిటీ స్ప్రెడ్ చేసినా అవి సక్సెస్ కాకుండా ఆపలేకపోయారు. 'గేమ్ చేంజర్' మీద బాగా నెగెటివిటీ స్ప్రెడ్ అయింది కానీ.. అందులో కంటెంట్ వీక్ కావడం వల్లే ఆడలేదన్నది వాస్తవం. సోషల్ మీడియా నెగెటివిటీ ఎఫెక్ట్ కొంతమేరే ఉంటోందన్నది స్పష్టం. ఏదైనా కంటెంట్‌ను బట్టే ఫలితం ఉంటుందన్నది వాస్తవం. కానీ కొందరు మాత్రం ఫలానా సినిమాను మేమే హిట్ చేశాం అని.. ఇంకో సినిమాను డిజాస్టర్ చేశాం అని జబ్బలు చరుచుకోవడం ట్రెండుగా మారింది. సినీ అభిమానులకు తోడు.. రాజకీయ పార్టీల మద్దతుదారులు కూడా ఈ విషయంలో క్లెయిమ్ చేసుకోవడం విడ్డూరం. ప్రస్తుతం వైసీపీ సోషల్ మీడియా హడావుడి ఇలాగే ఉంది. తాము పెద్ద హిట్ చేసిన, అలాగే డిజాస్టర్లు చేసిన సినిమాల లిస్ట్ పోస్ట్ చేస్తూ వాళ్లకు వాళ్లు ఎలివేషన్లు ఇచ్చుకుంటున్నారు. మెగా ఫ్యాన్స్ వ్యతిరేకించిన అల్లు అర్జున్ సినిమా 'పుష్ప-2'కు తాము సపోర్ట్ చేసి పెద్ద హిట్ చేశామని వైసీపీయన్స్ అంటున్నారు. వరుణ్ తేజ్ సినిమా 'మట్కా' డిజాస్టర్ కావడానికి.. సంక్రాంతికి వచ్చిన 'గేమ్ చేంజర్' దెబ్బ తినడానికి తామే కారణం అంటున్నారు. అంతే కాక లేటెస్ట్‌గా వాళ్లు బాయ్‌కాట్ చేయాలని పిలుపు ఇవ్వడం వల్లే 'లైలా' కూడా డిజాస్టర్‌గా తేలిందని అంటున్నారు. ఐతే ఆయా చిత్రాలకు రిలీజ్ ముంగిట ఉన్న హైప్, కంటెంట్‌ను బట్టి వీటి ఫలితాలు ఉన్నాయి తప్ప ఎవరో పనిగట్టుకుని డిజాస్టర్లు చేయడం ఏంటన్నది ఇక్కడ ప్రశ్న. 'మట్కా' సినిమాకు ముందు నుంచి హైప్ లేదు. వరుణ్ తేజ్ ట్రాక్ రికార్డు దెబ్బ తింది. అన్ సీజన్ అయిన నవంబరులో రిలీజైంది. పైగా బ్యాడ్ టాక్ తెచ్చుకుంది. కాబట్టే ఆ ఫలితం వచ్చింది. 'గేమ్ చేంజర్' వీక్ మూవీ అనే విషయంలో ఎవరికీ సందేహాలు లేవు. చాలా ఆలస్యం కావడం వల్ల ప్రి రిలీజ్ హైప్ కూడా తక్కువే. దీనికి డివైడ్ టాక్ వస్తే.. 'సంక్రాంతికి వస్తున్నాం', 'డాకు మహారాజ్' పాజిటివ్ టాక్ తెచ్చుకున్నాయి. ఇక ఆ సినిమా ఎలా నిలబడుతుంది? ఇక లేటెస్ట్ మూవీ 'లైలా' విషయానికి వస్తే.. వైసీపీ వాళ్లు రిలీజ్ ముంగిట 'బాయ్‌కాట్' ట్రెండ్ చేశారు. ఇప్పుడు సినిమా డిజాస్టర్ టాక్ తెచ్చుకోవడంతో దాని రిజల్ట్‌ను తమ ఖాతాలోకి వేసుకుంటున్నారు. కానీ 'లైలా' ఎంత పేలవమైన సినిమా అన్నది ఫస్ట్ షో పడగానే అందరికీ అర్థమైంది. విశ్వక్ కెరీర్లో ఇది వరస్ట్ మూవీ అనడంలో ఎవరికీ సందేహాలు లేవు. మరి అలాంటి సినిమాను ఒకరు పనిగట్టుకుని డిజాస్టర్ చేయడం ఏముంది? వచ్చిన టాక్‌తో దానంతట అదే డిజాస్టర్ అయింది. ఇక్కడ ఇంకో చిత్రమైన విషయం ఏంటంటే.. మట్కా, లైలా లాంటి సినిమాలను ఉదాహరణగా చూపించి.. చూశారా టార్గెట్ చేసిన సినిమాల ఫలితాలు ఏమయ్యాయో అని జబ్బలు చరుచుకుంటూ.. చిరంజీవి సినిమా 'విశ్వంభర'ను, పవన్ కళ్యాణ్ మూవీ 'హరిహర వీరమల్లు'ను కూడా వదిలేది లేదని.. వాటిని కూడా డిజాస్టర్లు చేస్తామని వైసీపీ సోషల్ మీడియా జనాలు ఛాలెంజ్‌లు విసురుతున్నారు. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ ఘోర పరాజయాన్ని ఆపలేకపోయిన వాళ్లు.. ఇప్పుడు సినిమాల ఫలితాలనే నిర్దేశిస్తామని సవాళ్లు విసురుతుండడం విడ్డూరం.

# ప్రపంచ శ్రేణి నగరంగా రూపు దిద్దుకుంటున్న FOURTH CITY 4.0



## FUTURE CITY - FOURTH CITY 4.0

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 50,000 ఎకరాల్లో **"ఫ్యూచర్ సిటీ"**ను అభివృద్ధి చేస్తున్నది. ఇది శ్రీశైలమ్ హైవే మరియు సాగర్ హైవే మధ్య, ORR మరియు RRR మధ్య ఉన్న ప్రాంతంలో ఉంటుంది. ఈ ప్రాజెక్ట్ యొక్క తొలి దశ 30,000 ఎకరాల్లో **"ఫోర్త్ సిటీ"**గా రూపుదిద్దుకుంటుంది. ఈ నగరంలో స్కిల్ యూనివర్సిటీ, డేటా సెంటర్లు, IT పార్కులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI సిటీ), వరల్డ్ ట్రేడ్ సెంటర్, గోల్ఫ్ క్లబ్, ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం, మెగా సాటిలైట్ టౌన్షిప్ (1,200 ఎకరాలు), ఫర్నిచర్ పార్క్, ఎడ్యుకేషనల్ హబ్‌లు మరియు ఫార్మా, లైఫ్ సైన్సెస్ హబ్‌ను నిర్మించనున్నారు. ఇవన్నీ కాలుష్యం లేని, నెట్-జీరో సిటీ మోడల్‌లో అభివృద్ధి చేయబడతాయి. రెండవ దశ 20,000 ఎకరాల్లో లాజిస్టిక్స్ పార్క్, హెల్త్ సిటీ, అమ్యూజ్‌మెంట్ పార్క్, టూరిజం డెవలప్‌మెంట్ హబ్, ఎలక్ట్రానిక్ సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్మార్ట్ సిటీ మరియు ఇండస్ట్రియల్ కారిడార్‌ను అభివృద్ధి చేయనున్నారు.

ఫ్యూచర్ సిటీకి సంబంధించిన మాస్టర్ ప్లాన్ ఇప్పటికే విడుదల కాగా, నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రేడియల్ రోడ్లను డిజైన్ చేసి, ఉత్తమ కనెక్టివిటీని కల్పిస్తున్నారు. స్కిల్ యూనివర్సిటీకి భూమిపూజ కూడా పూర్తయ్యింది. మెగా ఇంజనీరింగ్ కంపెనీ 100 కోట్ల రూపాయల పెట్టుబడితో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టింది. మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రాను స్కిల్ యూనివర్సిటీ చైర్మన్‌గా నియమించారు. అనేక కంపెనీలతో భాగస్వామ్యాలు కూడా జరుగుతున్నాయి.

ORR నుండి ఫ్యూచర్ సిటీ మీదుగా RRR వరకు 330 అడుగుల వెడల్పులో గ్రీన్‌ఫీల్డ్ రోడ్ నిర్మాణం ప్రారంభమైంది. అలాగే, శంషాబాద్ నుండి ఫ్యూచర్ సిటీకి మెట్రో రైలు సేవకు అనుమతి ఇవ్వబడింది. ఫార్మా కంపెనీలతో లైఫ్ సైన్సెస్ హబ్‌లో ఒప్పందాలు (MOU) సంతకమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వమూ ఈ 50,000 ఎకరాల భూమిని, 7 మండలాల 56 గ్రామాలను కలిపి ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అథారిటీ (FCDA)గా ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి రాజధాని CRDA వంటి విధంగా ఇక్కడ కూడా 2,10,000 ఎకరాలు FCDA కార్పొరేషన్‌గా ప్రకటించబడ్డాయి.





తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ ను తన డ్రీమ్ ప్రాజెక్ట్ గా డెవలప్ చేయడానికి ప్రపంచ దేశాలలోని అన్ని కంపెనీలతో ఒప్పందాల కొరకు ప్రయత్నిస్తున్నారు.రాబోయే 10 సంవత్సరాలలో ఈ ప్రాజెక్ట్ 10 లక్షల ఉద్యోగాలను సృష్టించి, 25 లక్షల నివాసస్థలాలకు నిలయం కానుంది.ఈ అభివృద్ధి కోసం ప్రభుత్వం


రోడ్లు, నీటి వనరులు మరియు మౌలిక వసతుల నిర్మాణం మీద దృష్టి పెట్టాయి. భవిష్యత్తులో, హైదరాబాదు, సికింద్రాబాద్, సైబరాబాద్ లాంటి మరొక కొత్త నగరంగా ఈ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందనుంది. ఫ్యూచర్ సిటీ ప్రపంచ స్థాయి నగరంగా, లివింగ్, వర్కింగ్ మరియు ఇన్నోవేషన్ కేంద్రంగా మారిపోతుంది.

భవిష్యత్తులో ఈ భారీ ప్రాజెక్ట్, ఈ ప్రాంతాన్ని ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేసి,ఇన్నోవేషన్‌కు , వ్యాపార , వాణిజ్య రంగంలో అభివృద్ధి చెంది ప్రజలకు

మెరుగైన జీవనశైలి, ఉద్యోగ , ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.





SAMOOHA
PROJECTS
SANDIL APARTMENTS, H.NO. 4-50/P-11/55&56,
02ND FLOOR, JAYABHERI ENCLAVE,
BEHIND RADISSION HOTEL, GACHIBOWLI, HYDERABAD-500084
040 42613261 WHATS UP: 9989354333
INFO@SAMOOHAPROJECTS.COM
PLOTS | LANDS | INVESTMENTS |



Sri Siddhi Vinayaka Cultural Center
SVCC Temple Fremont
40155 Blacow Rd, Fremont, CA 94538
(510) 403-4256
www.svcctemple.org/fremont
Weekdays: 9 am - 12 pm and 5:30 pm - 8:30 pm
Weekends: 9 am - 8:30 pm


ఉగాది శుభాకాంక్షలతో
త్వరలో వస్తున్నాము...
మీ
KBP DEVELOPERS
QUALITY | TRUST | VALUE
అత్యున్నత ప్రమాణాలతో
VILLA PLOTTING VENTURES
PARNASALA, MACHILIPATNAM
NAMBURU - KAZA
www.kbpdevelopers.com
Promoters
Ram Bobba | Kanuri Seshu Babu | Sridhar Patibandla | Suresh Katamreddy









HAPPY 2025 NEW YEAR

కొత్త సంవత్సరంలో మరింత
# మెరుగైన ప్రగతిని
# అందుకుందాం

ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ
2025 నూతన ఆంగ్ల సంవత్సర
శుభాకాంక్షలు

## గత 6 నెలల్లో... పేదల సేవలో... మీ మంచి ప్రభుత్వం

- నెలనెలా ఒకటో తారీఖునే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు
- రాష్ట్రవ్యాప్తంగా 203 అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ
- పేదలకు 1 లక్ష ఇళ్ళ నిర్మాణం పూర్తి
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు. కొత్తగా ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ (నిషేధ) చట్టం 2024
- రైతులకు 48 గంటల్లోనే ధాన్యం కొనుగోలు డబ్బులు
- దీపం-2 పథకంతో ఏడాదికి 3 ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు
- పది సూత్రాలతో స్వర్ణాంధ్ర @ 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల
- రూ.861 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లపై గుంతల పూడ్చివేత
- 2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి లక్ష్యం
- జోరందుకున్న అమరావతి నిర్మాణం
- రాష్ట్రానికి పారిశ్రామిక పెట్టుబడుల వెల్లువ



ఈ నూతన సంవత్సరం మీకు, మీ కుటుంబ సభ్యులకు ఆనంద ఆరోగ్యాలతో
కూడిన అభివృద్ధిని అందించాలని కోరుకుంటోంది మీ ప్రభుత్వం

Printed & Published by **Sagar Doddapaneni** on Behalf of **Sampark Media**, USA
For Advts Send an Email To: ads@namasteandhra.Com, # 510-409-1309, Read E-Paper @www.namasteandhra.com